UNIVERSAL LIBRARY
OU_204090
UNIVERSAL LIBRARY

OUP—901—26-3-70—5,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No T923/V41A Accession No G.T 335

Author

Title

This book should be returned on or before the date last marked below

1953

ఆ వంశమం దుద్భవించినవా రెల్లరును సౌజన్య సంపన్ను లనియుఁ బరోపకార పారీణులనియు, సత్కార్య నిర్వాహణ చణులనియు నెంతయు ఖ్యాతిఁగన్నవారు. మఱియు వారు శౌర్యాలంకృతులయి భుజబల సామర్థ్యమున నిస్సీములై వెలయుచుండిరి.

పూర్వ మింగ్లండులోని ధనవంతులును, నున్నతవంశ జులు నగువారు జంబుక మృగయాక్రీడయందుఁ దమ జీవిత కాలమున నెక్కువ భాగము వ్యయపఱచుచుండిరి. ఈ వేఁట యత్యంత గౌరవప్రదమని యానాఁటి యింగ్లదేశీయుల తలంపు.

వాషింగ్టను వంశమున నిరువు రన్నదమ్ములు రాజ్యము నందలి యంతఃకలహములు కారణములుగ క్రీ॥ శ॥ 1657 సం॥ రమున నింగ్లండుదేశ వాసముం జాలించి యమెరికాఖండము లోని యొక భాగమగు వర్జీనియా దేశమునకు వలసపోయిరి. ఆసహోదరుల పేరులు లారెన్సు వాషింగ్టను, జాన్ వాషిం గ్టను. వీరిరువురును విద్యావంతులును, వివేకవంతులును. ఆకాలమున నమెరికాలోని యాదిమ నివాసుల సంఖ్య చాలఁ దక్కువగ నుండినందున, నింగ్లండు మున్నగు ప్రదేశముల నుండి యట కరుదెంచువారు అనేక సహస్ర సంఖ్యాగల యెకరముల భూభాగములను దమ స్వాధీనము జేసికొనఁ గలిగిరి. లారెన్సును, నతని యనుజుండును నమెరికాకుఁ జేరు నప్పటి కవివాహితులుగనే యుండిరి. తరువాతఁ గొన్నాళ్లకు వారు స్వానుగుణ్యాలగు కన్యల నన్వేషించి పెండ్లియాడి

వారితో గార్హస్థ్యము నెఱపుచుండిరి. ఇట్లుండ జాన్ వాషింగ్టనుకు లారెన్సను కుమారుఁ డొకఁ డుద్భవించెను అతని కగస్టీనను పేరుగల పుత్త్రుఁడు జనించెను. అగస్టీనున కిరువురు సతులుండిరి. అం దొకర్తుక పేరు "జేన్ బట్లరు" మఱియొకతెపేరు "మేరీబాలు". జేన్‌బట్లరను భార్యయం దగస్టీనునకు నొకసుతుఁడు గలిగెను. అతని యభిధానము లారెన్సు. రెండవయామెకు మన కథానాయకుఁడగు "జార్జి వాషింగ్టను" క్రీ॥ శ॥ 1732 సం॥రము ఫిబ్రవరి 22 దినమున జన్మించెను. అతఁడు సర్వలక్షణ సంపన్నుఁడై దినదినాభివృద్ధినందుచుండెను.

వాషింగ్టను కుటుంబమువా రమెరికాలో మిగుల గౌరవముం గాంచిరి మన వాషింగ్టనుయొక్క ప్రపితామహుఁడగు జాన్ వాషింగ్టనను నతఁడు శోణహైందవులతో నాంగ్లేయులకుఁ దటస్థించిన సంగ్రామమునఁ దన భుజబల పరాక్రమములం జూపి యశముగడించెను.

జార్జి వాషింగ్టను జనకుఁడగు నగస్టీను వాషింగ్టను వర్జీనియాలోని పోటోమాగు నదికి సమీపమందలి "పోను" అను నుపనది తీరమున నున్న యొక గ్రామమందు వసించుచుండెను. బెంజమిన్ ఫ్రాంక్లిను కుటుంబము సయిత మిటకు సమీపముననే కాపురముండెను. కావున వాషింగ్టను కుటుంబము వారికిని ఫ్రాంక్లిను కుటుంబమువారికిని నత్యంత స్నేహమేర్పడియుండెను.

జార్జి వాషింగ్టను పుట్టిన మందిరము అమెరికాలో

సంభవించిన మహాపరివర్తన సమయమున నిర్మూలమయినది. తరువాత ననేక వత్సరములకుఁ బిదప నతని బంధుగులలో నొకఁడగు కన్ట్సిసనునతఁడు జార్జివాషింగ్టను పుట్టి పెరిఁగిన భవనమున్నచోట నాతని జ్ఞాపకార్థమయి చిహ్న మొకదానిని నెలకొల్పెను. ఆ చిహ్న మిప్పటికిని నాస్థలమున నొప్పుచున్నది. జార్జివాషింగ్టను పూటకొక విలాసము తోడను దినమున కొక వికాసముతోడను నభివృద్ధిఁ బొందుచుండ నతనికి నాలుగేండ్లు గడచెను. ఇంతలో నతని తలిదండ్రులు "ప్రిట్రిక్స్‌బర్గు"నకు నెదుటనున్న మఱి యొండు ప్రదేశము నకుఁ దమ కాపురమును మార్చుకొనిరి. ఈ నూతనప్రదేశము "ఇరాపనాసు" నది యొడ్డున నున్నది. అది రమణీయ వనప్రదేశ మధ్యభాగము.

జార్జి వాషింగ్టను కాలమున నమెరికాలో మానవ జాతి యిప్పటియట్లంత విస్తారముగా నుండియుండలేదు. అప్పుడట నే భాగముంజూచినను విశేషముగ ముండ్లచెట్లు, రుప్పలు, అడవులు, మైదానములు మొదలగు వానిచేఁ బరివేష్టింపఁబడి యుండెను. అట్టి సమయముననే యైరోపా దేశీయు లా ఖండముం జొచ్చి యందలి భూములను వ్యవసాయ యోగ్యములుగ నొనర్చి యం దనేకోద్యాన వనములను సస్యములను బెంచ నారంభించిరి. తన్మూలముగ వారు నానాఁటికి ధనవంతులై దివ్యభవనముల నిర్మించుకొని సుఖముగఁ గాలముం బుచ్చుచుండిరి. వారి నివాసస్థలములకుఁ జుట్టుపట్ల సాంద్రారణ్య సీమలుండినందున వారు వేటాడుట

లోను జేరువహించిరి. అమ్మహా గహనప్రదేశములలో స్వేచ్ఛగఁ ద్రిమ్మరు హరిణముల వేఁటాడుటయందు వారి కత్యంత ప్రియముగ నుండెడిది. అనవరత జలప్రవాహ యుతములగు నదీనదములట నమరియున్నందున వారు చేపలఁ బట్టుట సయితమొక వృత్తిగఁ జేకొనియుండిరి. జార్జి వాషింగ్టనుకూడఁ దన చిఱుత ప్రాయమున "ఇరాఫర్నాగు" నదీతీరమునఁ గూరుచుండి చేఁపలఁ బట్టుచుఁ గాలము గడపు వాఁడు.

అమెరికాలోని యాదిమ నివాసులు శోణహైందవులని చెప్పితిమిగదా! వీ రమెరికాలో నివసింపవచ్చిన యైరోపా దేశస్థులకుఁ దమవలన నైన సహాయ మొనర్చుచు వచ్చిరి. కాన నైరోపియనులు దమ కంగరక్షకులుగ వారిని నియమించుకొనిరి. అందుచే వారు వీరి భవనములచెంతనే గుడిసెలం గట్టుకొని నివసించుచుండిరి. అనంతర మొక్కింత కాలమునకు శోణహైందవులచే నైరోపా దేశస్థులకుఁ గష్టములు సంభవింప నారంభించినవి. కావున వారు తమ కార్యములకు సహాయ భూతులనుగ నీగ్రోజాతివారిని నియమించుకొనఁ దొడఁగిరి. ఈ నీగ్రోజాతివారు వారి తోఁటలలోను నిండ్లలోను గూడఁ బనిసేయుచుండిరి.

---

## ౨. జార్జి వాషింగ్టను బాల్యము.

జార్జి వాషింగ్టను శైశవదశలో నున్నపు డతని సహవాసులలో నొకఁ డతని కొక "ఆపిల్" పండును దెచ్చి

యిచ్చెను. దానిం బరిగ్రహించిన జార్జి వాషింగ్టను దన సోదరీ సోదరుల కందు భాగమిచ్చుటకు మన సొప్పకుండెను. ఆ విషయ మెఱింగి యతని తండ్రి యతనిం జేరఁబిలిచి సౌభ్రాత్రముం గూర్చి బోధించెను కాని, యప్పటికిని నతఁడు దాఁబట్టిన పట్టు వదలక, తన తోఁబుట్టువుల కా ఫలమునం దావంతేని నీయకుండెను. అప్పు డగస్టీను జార్జికి బుద్ధిఁగఱపఁ గృత నిశ్చయుండై, యొకనాఁడు తన బిడ్డలం దోడ్కొని "ఆపిల్" ఫలములు విస్తారముగఁ బండియున్న యొక తోఁట కరిగెను ఆ వనమున ఆపిల్ వృక్షములు ఫలభార నమ్రములై నేలఁదాఁకున ట్లుండెను. వీరా తోఁటకుఁ జేరుట కొక్కింత సేపునకుముందే పెద్దగాలివీఁచి యందలి వృక్షముల లోని పండ్లంతటను రాలి నేల నెఱసి యుండెను. ఈ రీతి నట భూజములు బహు ఫలభరితములై యుండుటయుఁ, గ్రింద విస్తారముగఁ బండ్లు పడియుండుటయుఁ గాంచి జార్జి వాషింగ్ట నాశ్చర్య చకితుఁ డయ్యెను. అపు డాతని జనకుఁ డాతనిం జూచి "జార్జీ! చూచితివా? యీ ఫలములను. మున్ను నేనొక పరి దేవుఁడు నీ కనేక ఫలము లనుగ్రహించునని నుడివి యుంటిని గదా! తదనుగుణముగ నామహనీయుఁడు నేఁడు నీ కెన్ని ఫలము లిట లభింపఁజేసెనో కనుము. కొన్నాళ్లకు మునుపు నీకొక "ఆపిల్" పండు దొరికినపు డందుఁ గొంచె మేని నీ తోఁబుట్టువుల కొసంగక పోవుట నీ కింకను జ్ఞప్తియం దుండును. ఇఁక నట్లెన్నటికి నొనర్పకుము. నీవు నీ సోదరీ సోదరుల విషయమున నేకాక, తక్కినవారి యెడలను సుహృ

డ్భావములో నడచుకొంటివేని దేవుఁడు నీయందుఁ గటాక్షించు" నని యుపదేశించెను. ఈవాక్యము లాలించిన జార్జి వాషింగ్టన వనత వదనుఁడై, తన యవగుణముం గూర్చి పశ్చాత్తాపము నొంది, కొంతవడికిఁ దలయెత్తి తండ్రింజూచి "నాయనా! నన్నీ పర్యాయము క్షమింపుము. ఇఁక నెన్న డిట్టి యవగుణముం గలిగి యుండను" అనెను. అందుల కతఁ డెంతయు సంతసించి తన కుమారుని ప్రకృతి మాటినందులకు భగవంతున కనేక కృతజ్ఞతా పూర్వక నమస్కృతు లొనర్చి కుమారీ కుమారులతో నింటికరుదెంచెను. నాఁటనుండియు జార్జి వాషింగ్టను సద్గుణము లలవఱచుకొనసాగెను.

జార్జి వాషింగ్టనునకు భగవద్భక్తి యలవడఁజేయ నెంచి యతని తండ్రియగు నగస్టీ నొకనాఁడు తనతోఁటకేఁగి యందుఁ జిన్నచిన్న పాదులుగావించి యొక్కొక్క పాదిలో నొక్కొక్క పెద్ద యక్కరము చొప్పున "జార్జి వాషింగ్టను" అను తన కుమారుని నామాక్షరములు గల్పించి వానిపైఁ దృణాంకురముల నారోపించెను. కొన్నాళ్లకవి యభివృద్ధి నొంది కనులపండు వొనర్పసాగెను. అప్పు డగస్టీను తన పిల్లల నటకుఁ దోడ్కొనివచ్చి యీ యక్షరపంక్తిం గాన్పించెను. జార్జి వాషింగ్టన ద్దానిం గాంచి యచ్చెరువు హెచ్చ జనకునితోఁ "దండ్రీ! నాకు సమృద్ధి నేర్పు నుద్దేశముతో మీరే యిట్లొనర్చియుందు" రనెను. అందుల కాతఁ "డది తాఁజేసినది కాదనియు, సర్వజగ త్సర్గస్థితిలయ కారకుండగు పరమేశ్వరుఁడే యట్లు సల్పెననియు, నతని మహిమఁ దెలియ

నేరికి నసాధ్యమనియు, నతఁడు బిడ్డలయం దమిత దయగల వాఁడనియుఁ, గావున నాతని విషయమున నెల్లరు భయ భక్తులతో మెలఁగుట శ్రేయస్కరమనియు బోధించెను. ఇట్లగస్టీనువలన బోధింపఁబడిన నాఁటనుండి యతఁడు దేవుని యందు వినయ భయ భక్తులుగలవాఁ డయ్యెను.

అగస్టీను తనతోఁటలో నొక చెట్టు నెక్కువ మక్కువతోఁ బెంచుచుండెను. జార్జి యొకనాఁ డుద్యానవనమునకు వెడలియుండినపుడు దనచేతనున్న గొడ్డలితో నామహీజమును నఱికివైచెను. మఱునాఁ డగస్టీ నటకు వచ్చునప్పటికిఁ దాను బ్రియమార వృద్ధికిఁ దెచ్చుచుండిన తరువు ఛేదింపఁబడి నేల వ్రాలియుంటం గాంచి విచారము నొందుచుండెను. ఏతత్సమయమునఁ జేతనున్న గొడ్డలితోఁగూడ వాషింగ్టను తోఁటలోఁ బ్రవేశించెను. అగస్టీను కుమారుంగాంచి "పుత్త్రా! ఈ నికుంజము నిటు లొనర్చినవా రెవరో నీ వెఱుంగుదువా?" యని ప్రశ్నించెను. జార్జి వెంటనే "తండ్రీ! నేనే యీచెట్టు నిట్లు కూలఁద్రోచితిని." అని బదులు సెప్పెను అందుల కతఁడు ప్రమోదముం బొంది తనకుమారుఁడు సత్యమాడినందులకై యతనిం గౌగిలించుకొని ముద్దాడెను. పిదప నతఁడు తన కుమారునికి సత్యవాఙ్నియతిచేఁ గలుగు లాభములం గూర్చియు, నసత్యము వచించుటచేఁ గలుగు నష్టములం గూర్చియు నుగ్గడించెను.

జార్జి వాషింగ్టనున కెనిమిదేండ్ల ప్రాయమునఁ బడమటి యిండియా దీవులలో స్పానిష్ వారికిని నాంగ్లేయులకును

బోరు వొసఁగెను. దేశాంతరవాసులగు నాంగ్లేయులు స్వ
తము సేనల సమకూర్చి యాంగ్లేయులకు సహాయముగాఁ
బంపవలయునని యాంగ్ల ప్రభుత్వమువా రాజ్ఞాపించిరి.
కావున వర్జీనియా ప్రదేశస్థులును దండునుగూర్చు ప్రయత్న
మున నుండిరి.

ఈ యుద్ధము తటస్థించుటకు ముందే జార్జి వాషింగ్టను
సహోదరుఁడగు లారెన్సు ఇంగ్లండునకుఁ బోయి యుద్ధసం
బంధ విషయములలోఁ బ్రవేశించి యుండినందున, నతనికి
బడమటి యిండియా దీవులకుఁ జేరి, స్పానిష్ వారితో సంగర
మొనర్పవలయునను నుద్దేశముండెను. తదనుసారముగా
నతఁడు దండ్రి యానతింగొని పడమటి యిండియాలోని పోరికి
బయలుదేఱిన సేనలోఁ జేరెను. దృష్టికి మిఱుమిట్లు గొలుపు
నానావిధ కవచములను నాయుధములను ధరించి కలనికి
నడచు సైనికులం జూచి జార్జి వాషింగ్టను కూడ రణరంగ
మున కుఱుక నుత్సహించుచుండెను. కాని యతఁడు పసితన
మున నున్నందున నతనికి సేనలోఁ జేరుట కవకాశము లభింప
దయ్యెను. పిదప నతఁడు తన సహాధ్యాయులతో నాటలాడు
సమయములయం దపుడపుడు సైనికు లొనర్చు సామాన్య
కార్యములను జేయుచుఁ దనకుఁ గల రణప్రీతిని వెల్లడించు
చుండెను.

జార్జి వాషింగ్టను సహోదరుఁడగు లారెన్సు ఒక సేనా
శాఖ కధిపతిగ నియమింపఁబడి పడమటి యిండియా దీవు
లకుఁ బంపఁబడెను. ఇతఁడు "అడ్మిరల్ వెర్నను" అను

పేరుగల నౌకా సేనాధిపతి యాజ్ఞలకు లోఁబడి నడచుకొన వలసి యుండెను. లారెన్సు తనకు నియమింపఁబడిన కార్యములను సక్రమముగ నెఱవేర్చుచు నిజభుజబలపరాక్రమమును గాన్పించి "సంహారవీరుఁ" డను పేరుఁ బొందెను. ఆ దీవులలోని యాంహావ మణఁగఁగనే లారెన్సు తన దేశమునకుఁ దిరిగివచ్చెను. మఱికొన్నాళ్లకతఁడు మరల నింగ్లండున కరిగి యక్కడఁ దన సామర్థ్యముం జూపఁ బ్రయత్నించెను. అగస్టీను మొదటఁ గుమారుని యీ కోర్కెకు సమ్మతింపలేదు. కాని తుదకు లారెన్సు ప్రార్థనమున కంగీరింపక తప్పదయ్యెను.

ఈవిషయ మిట్లుండ లారెన్సు తాము నివసించుచున్న చోటికి సమీపమందు వాసముచేయుచుండిన "విల్లియం ఫేర్ ఫాక్స"ను నతని కుమార్తెయగు "ఆన్ని" అను నామెం బరిణయమయ్యెను. అందుచే నిదివఱకుఁ దండ్రి యానతిం గన్న యతని యింగ్లండు ప్రయాణ ప్రయత్నమును బూర్తిగ విడువవలసివచ్చెను.

పడమటి యిండియాదీవులనుండి లారెన్సు వచ్చిన పిదప, నతఁడు తన సహోదరుఁడగు జార్జి వాషింగ్టనునకు, యుద్ధమునకు సంబంధించిన యనేక చిత్రవిషయములను గథలవలెఁ జెప్పుచుండెడివాఁడు. జార్జి తన యగ్రజుఁడు సెప్పు యుద్ధవీరుల భుజబలపరాక్రమములు, యుద్ధక్రమములు మున్నగునవి సంభ్రమాశ్చర్యములతో వినెడివాఁడు. అందుచే నతని మనమునఁ దానును బొలికలనికి నడచి యుద్ధమొనర్ప వలె నను నుత్సాహబీజ మంకురించి నానాఁటి కభివృద్ధి

కాఁజొచ్చెను. జార్జి వాషింగ్టను ఆజానుబాహుఁడును విశాల బుద్ధియునై తన్నుఁ జూచిన యితరుల నిమిషమాత్రమున నాకర్షించునట్టి ముఖవర్చస్సు గలిగి నివ్వటిలుచుండెను. ఈ కారణముచే నతనియం దెల్లరకు నొకవిధమగు గౌరవ భావమును, బ్రీతియు, విశ్వాసము నేర్పడెను.

జార్జి వాషింగ్టను బాల్యక్రీడలయందును బ్రియము గలవాఁడే. కాని యాతనికి బుద్ధి నెక్కుడుగ నుపయోగించి యాడవలసిన క్రీడలయందువలెఁ జెడుగుడు, బొంగరము మున్నగు నాటలయందుఁ జిత్తము పాఱకుండెను. అతఁడు చక్కఁగఁ బఱువెత్తువాఁడు. వృక్షారోహణమునను, మల్ల యుద్ధమునను నతఁడు తనతోడి బాలురను మించుచుండెను. మిగుల భారములగు వస్తువుల నతఁ డవలీలగ నెత్తి తన మిత్రుల కాతఁ డాశ్చర్యముఁ గొలుపుచుండును.

---

## 3 జార్జి వాషింగ్టను విద్యాభ్యాసము

జార్జి వాషింగ్టను పంచవర్ష వయస్కుఁడైనపు డతని తలిదండ్రు లతనిఁ దమయూరనున్న యొక పాఠశాలకుఁ బంపుచుండిరి. ఆ పాఠశాల నట నెలకొల్పి నడపుచుండిన వాని పేరు "హాబీ". అతఁడు సర్వసామాన్యములగు పఠన లేఖనములను మాత్రము నేర్చినవాఁడు. కాని, లక్ష్య లక్షణ యుక్తమగు భాషాప్రపంచముం గాంచినవాఁడు గాఁడు. అయిన నతఁడు లేఖనవాసనయే లేని కుఱ్ఱవాండ్రకుఁ దగిన యుపాధ్యాయుఁడుగనే యుండెను. జార్జి వాషింగ్ట నీ హాబీ

పాఠశాలలోఁ జదువుచుండినపుడు దనతోడి పిల్లవాండ్ర కంటెఁ దాను జక్కఁగఁ జదివి గురుని వాత్సల్యమును మన్ననమును బొందుచుండెను. అతని తలిదండ్రులు సయిత మతనిని బడికిఁ బంపుటతోఁ దమభారము తొలఁగినదని భావింపక, యింటికడఁ గూడ నతనికి విద్య నేర్పుచుండిరి. జార్జి వాషింగ్టను చక్కఁగ వ్రాయువాఁడు. అతఁ డేదిచేసిన నలగొలగాఁ జేయువాఁడు గాఁడు. ఈ యలవా టతనికి వయస్సుతోఁగూడ నభివృద్ధిఁ జెందెను. అతఁ డక్షరములు వ్రాయుటతోఁ గూడఁ జదువుటకును నేర్చుకొనియెను. అచిర కాలముననే యతఁ డేదే నొక విషయముంగూర్చి సమగ్రముగ వ్రాయ సమర్థుఁడయ్యెను. అతఁడు తన చదువునందెంత శ్రద్ధగలవాఁడో, తా నాడు నాటలయందు నంత శ్రద్ధగలవాఁడు. కాని, యాడునపుడు విద్యావిషయములపైనను, జదువునపుడు క్రీడలమీఁదను మనసు బోనిచ్చెడు వాఁడు గాఁడు. అతఁడు క్రీడారంగమునే యుద్ధరంగముగ భావించి పిల్లవాండ్రందఱును దన్ను మించిపోకుండునట్లు చూచుకొనుచుఁ దానే జయము సంపాదింపఁ బ్రయత్నించుచుండెను. ఒక్కొక్క దిన మతఁడు బాలుర నందఱను రెండుపక్షములుగ విభజించి యొకతెగవారు స్పానిష్ వారనియు నింకొకతెగవా రాంగ్లేయు లనియు దిట్టపఱచి, యా రెండు తెగలును యుద్ధమొనర్ప నాజ్ఞాపించెడువాఁడు. అట్టియెడఁ దా నాంగ్లేయపక్షమునకు సేనానాయకుఁడుగను స్పానిష్ పక్షమునకుఁ దన సహాధ్యాయియగు "విల్లియంపస్సిల్"

దండనాథుఁడుగను నుండువారు. ఎల్లప్పుడును జార్జి వాషిం గ్టను పక్షమువారే గెలుచుచుండెడువారు. ఇట్లు జార్జి వాషిం గ్టను తన విద్యార్థి జీవితముననే యుద్ధవిషయములలో ననుభవము గడించుచుండెను.

ఇట్లుండ నొకనాఁ డాడునపుడు రెండుకక్షులవారికి నొక వివాదము తటస్థించెను. అక్కారణమున నా బాలురలోఁ గలహముగలిగి ప్రత్యేకప్రత్యేకముగఁ జీలిపోయిరి. అట్లు చీలిపోయినవారి నొకటిగాఁ జేర్ప జార్జి వాషింగ్టను మిగులఁ బ్రయత్నించెను. కాని నిష్ఫలమాయెను. ఇంతలో నీవిషయముం దెలిసికొని సాక్షీ పిల్లవాండ్ర నందఱిని బిలిపించి జరిగిన విషయముంగూర్చి యడిగెను. కాని యొక్కరైన నున్నసంగతిం జెప్పరైరి. ప్రతిబాలుఁడును నెదుటి పక్షముమీఁదనే నేరము మోప నారంభించెను అందుచే వారు ప్రత్యేకపక్షములకుఁ జెందినవారని యుపాధ్యాయుఁడు వెంటనే గ్రహించెను. జార్జి వాషింగ్టను మాత్ర మేపక్షమునందును జేరక దూరముగనుండెను. అందుచే నుపాధ్యాయుఁడాతనింబిలిచి వృత్తాంత మేమని యడిగెను. వెంటనే యతఁడాదినుండియు నడచినవిషయములను నిరుపక్షముల వారిలోఁ గల లోపములను వివరించిచెప్పెను. అంత నా గురుపుంగవునికి నిజము తెలియవచ్చెను. అది మొద లుపాధ్యాయుఁడే కాక, యతని శిష్యులును జార్జి వాషింగ్ట నెన్నడును సత్యద్రష్టయని గ్రహించి యతని విషయమున నెక్కుడు గౌరవములోఁ బ్రవర్తించుచుండిరి. తనతోఁ జదువు విద్యార్థు

లొండొగులలోఁ గలహించుచో వారికిఁ దగురీతి బోధించి సమాధానము చేయుచుండెడివాఁడు.

జార్జి వాషింగ్టనుయొక్క గుణములం గాంచి యతని జననీ జనకు లత్యంత సంతోష భరితులగుచుండిరి. జార్జి వాషింగ్టను హాఫీ పాఠశాలలో నేర్చికొనవలసిన దంతయుఁ గొలఁది కాలములోనే నేర్చికొనెను. అప్పు డతని మఱియొక పాఠశాల కంపుట యత్యావశ్యకమై యుండెను. అందుచే నతఁడు తన సహోదరులలో నొకఁడగు నగస్టీను వసించుచుండిన పట్టణమున కేగి యట నొక కళాశాలలోఁ జదువ నారంభించెను. ఆ కళాశాలాధ్యక్షుఁడు "విల్లియమ్సు" అను నతఁడు. ఆతఁడు కావ్యములఁ జక్కఁగఁ బాఠము సెప్పఁ జాలిన యుపాధ్యాయుఁడు. జార్జి వాషింగ్టను విల్లియమ్సు పాఠశాలలలోఁ జేరఁబోవునపు డతని తల్లి యతని నవలోకించి "నాయనా నీ వేది నేర్చికొనఁదలఁచినను దానిని శ్రద్ధతో నేర్చుకొనుము. పూర్ణముగ నేర్చికొనుము. అశ్రద్ధయు నసంపూర్తియు నే కార్యము నందును మేలుగాదు. ఎట్లైనను గౌరవము గడించుటయే పురుషలక్షణము. ప్రతి కార్యమునకును శ్రద్ధ, బుద్ధి, విషయగ్రహణ సామర్థ్యము, పట్టుదల యుండవలయును. వృద్ధికి వచ్చువారి కివి యత్యంతావశ్యకము" లని బోధించెను.

తన మాతృదేవత తన కుపదేశించిన సద్విషయ రత్నములను శిరసావహించి జార్జి వాషింగ్టను విల్లియమ్సు కళాశాలలోఁ జదువుకొనుచుండెను. అక్కడ నయిత మతఁడు

దక్కిన విద్యార్థులకన్న మిన్నయని శీఘ్రకాలముననే పేరు దెచ్చుకొనెను. అతనికి గణితశాస్త్రమున నత్యంతాభిమానము. ఎట్టి గణితమైన నతఁడు సునాయాసముగఁ జేయుచుండెను. వాషింగ్టనునకుఁ జదువుపైఁ గల శ్రద్ధం బరికించి విల్లియమ్సు ఆతనిఁ గడుంగడుఁ బ్రేమించెను. అతని గణిత శాస్త్రమందలి శ్రద్ధకు మెచ్చి విల్లియమ్సు ఒకనాఁ డాతని విలోకించి "జార్జి! నీకు గణితశాస్త్రమున విశేషాభిమానమున్నది. అంతటి యభిమానము భూపరిమాణ శాస్త్రమున నున్నచో నీకుఁ జాలమేలు గలుగును. మఱియు మన దేశమున భూపరిమాణ శాస్త్రానుభవము గలవా రనేకులు లేరు. ప్రస్తుతము మన దేశమునకు భూపరిమాణ శాస్త్రజ్ఞులతో నెక్కువ యవసరమున్నది" అని చెప్పెను.

జార్జి వాషింగ్టను "విల్లియమ్సు" కళాశాలలోను దనతోడి విద్యార్థులతోఁ జేరి యాడుచుండెవాఁడు. ఆట్లాడుటలో మునుపటివలెనే యుద్ధ సంబంధములగు క్రీడల సయితము ప్రవేశపెట్టెడువాఁడు. అదికని విల్లియమ్సు, జార్జి వాషింగ్టనున కట్టి యుద్ధక్రీడ లావశ్యకములు గావనియు, వానికై వెచ్చించుకాలము నతఁడు విద్యావిషయమున వెచ్చించుచో బాగుగ నుండుననియు, భూపరిమాణ శాస్త్రమును నేర్చుచో భావికాలమున నతని కెంతయు నది యుపకారకమగుననియుఁ జెప్పెను. అయినను జార్జి వాషింగ్టనున కట్టి కల్పిత యుద్ధక్రీడలయం దుత్సాహము తగ్గినదికాదు. అట్లని యతఁడు భూపరిమాణ శాస్త్రమునఁ గృషిచేయక పోలేదు.

ఇమ్మాడిక్క భూపరిమాణ శాస్త్రమును జార్జివాషింగ్టను చేకొని, యందుఁ బ్రవీణుఁడైన పదంపడి, తన పాఠశాలావరణ ప్రదేశమును మొట్టమొదటఁ గొలత దీసెను. తదుపరి నతఁడు కళాశాల చుట్టునున్న బయలుప్రదేశమును దోడిబాలుర సహాయముతోఁ గొలిచెను. ఇట్లతఁడు గ్రంథమూలముగ గడించిన శాస్త్రజ్ఞానము ననుభవముచేఁ బెంపొందించుకొనుచుండెను. జార్జి వాషింగ్టను సూక్ష్మబుద్ధిం గాంచి యతని గురు వత్యంత సంతోష స్వాంతుఁడయ్యెను.

ఒకనాఁడు అమెరికాదేశ చరిత్రములోని యొకానొక విషయముం గుఱించి కళాశాలయందలి యిరువురు విద్యార్థులకు వివాదము తటస్థించెను. ఆ వివాదము తుదకు మన స్తాపముగా మాఱినందునఁ గళాశాలా విద్యార్థులలోఁ గొందఱు "జార్జి వాషింగ్టనే యీ వివాదముం దీర్పఁగల బుద్ధిమంతుఁ" డని వక్కాణించిరి. వెంటనే యా బాలు రిరువురును వాషింగ్టను కడ కేఁగి తమ వివాదాంశములను గూర్చి ముచ్చటించిరి. అతఁడు తన బుద్ధిచాతుర్యముచే నా కలహముందీర్చి యా యిద్దఱిమధ్య పరస్పర సుహృద్భావము గలుగునట్లు చేయఁగలిగెను. జార్జి వాషింగ్ట నీరీతిఁ దన సహాధ్యాయులకుఁ దటస్థించు వివాదముల ననేక పర్యాయములు బోకార్చి స్నేహభావము, ప్రేమము, పరోపకార చింతనము వారి కలవడునట్లు సలుపఁ బ్రయత్నించువాఁడు.

జార్జి వాషింగ్టను తనతల్లి యుపదేశము నేమఱక ప్రతికార్యమును శ్రద్ధతోను సంపూర్ణముగను నొనర్చుచుఁ

ప్రజల మెప్పును బొందుచుండెను. అతని యుపాధ్యాయుఁడును, దక్కిన బాలురంగూడ, నతని నాదర్శముగఁ గైకొని కార్యములు సాధింపఁ బలుమఱుఁ బురికొలుపువాఁడు. కొందఱు పిల్లవాండ్ర కది మనస్సునఁ బట్టకుండెను. కాని, జార్జి వాషింగ్టనునకును, నతనివంటి కొందఱు విద్యార్థులకును నా సదుపదేశ మత్యంత సహాయకారి యయ్యెను. అందువలననే వారు భావికాలమున నున్నతదశకు వచ్చిరను విషయమును మన మెన్నఁడును మఱువరాదు.

జార్జి వాషింగ్టను గురువగు విల్లియమ్సు తనకడఁ జదువు కొండికలకు లేఖన మభ్యసింపఁజేయ శీర్షికాక్షరములఁ దాను స్వయముగ వ్రాసి యిచ్చువాఁడు. అట్టి శీర్షికలందొక్కొక్కటియు నొక్కొక్క (శాస్త్ర) విషయముం గూర్చి యుపన్యసించునదిగా నుండెడిది. కావున నట్టి లేఖన గ్రంథమును జార్జి వాషింగ్టను కడు జాగ్రత్తతోఁ గాపాడుకొనువాఁడు. దానింజూచి యతని మిత్రులందొకఁడు "జార్జి! నీవిట్లీ పుస్తకమును భద్రపఱచి యుంచుటకుఁ గారణమేమి?" అని యడిగెను. "అది భావికాలమున నాకెంతయుఁ బ్రయోజనకారి కాఁగల" దని జార్జి ప్రత్యుత్తర మిచ్చెను. అందుల కా చెలికాఁ డెంతయు సంతసించి, మఱుమాటాడక వెడలిపోయెను.

జార్జి వాషింగ్టను తాను వ్రాయు లెక్కల పుస్తకమునుగూడ నలక్ష్యము చేయక, యందుఁ దన యుపాధ్యాయుఁడు నేర్పిన విధులతోడను గడు జాగ్రత్తగ లెక్కలుచేసి

దాఁచియుంచువాఁడు. ఇంతియగాక చిత్రలేఖన పుస్తకమును గూడ నట్లే భద్రపఱచువాఁడు. అతఁడే విషయమునకు సంబంధించిన గ్రంథమునుగాని పాఱవేయక మిక్కుల శ్రద్ధ మెయిఁ జూచుకొను చుండువాఁడు. ఎల్లప్పుడు నతఁడేదో యొక ప్రయోజనకర విషయమునందే తన ధీవిశేషమంతయు నుపయోగించుచుఁ జిఱుతవయసుననే యత్యంత కుశాగ్ర బుద్ధియని ప్రసిద్ధి వహించెను.

జార్జి వాషింగ్టను గద్య గ్రంథములను గాని, పద్య గ్రంథములను గాని చదువునపు డందెట నేనిఁ జిత్తాకర్షక భాగములు గాన్పించుచో వాని నతఁ డొకచిత్తు పుస్తకమున వ్రాసికొనువాఁడు. సమయము దొరకినప్పుడెల్ల నతఁడా చిత్తు పుస్తకముం గైకొని యందుఁ దాను వ్రాసిన యంశములను మననము జేయుచుండెడి వాఁడు. ఇట్లు చేయుటచే నతనికి లక్ష్యజ్ఞాన మధికమాయెను. మనుజుఁడు తన జీవితకాలమున నెట్లు నడుచుకొనవలయునను విషయముం గూర్చి యతఁ డనేక గ్రంథముల శోధించి యొక పుస్తకములో వ్రాసి యుంచెను. అందలి నీతి మార్గములెల్లను వాషింగ్టను వాడు కలకు సంబంధించినవని చెప్పుటయం దతిశయోక్తి లేశమయి నను లేదు. అతఁడు వ్రాసిన యీ పుస్తకము నేఁటికిని నతని దేశమునఁ గాపాడఁ బడుచున్నయది.

జార్జి వాషింగ్టను విల్లియమ్సు క్లాశాలలోఁ జదువు చుండ నొకసారి సెలవుదినములు తటస్థించుడు నాతఁడా కాల ముంగడప నొక బంధుగు నింటికి బోయియుండెను. అప్పు

డతని జనకునికి శరీర మస్వస్థముగ నుండెను. వెంటనే జార్జి వాషింగ్టనున కావార్తఁ దెలుపవలయునని యతనితల్లి తలంచెను. కాని వాషింగ్టను తండ్రి యామెతోఁ దన వ్యాధి యంత ప్రబలమైనది కాదనియు, వాషింగ్ట నింకను గొన్నాళ్లవఱకా బంధుగుని యింటనే యుండవచ్చుననియు, నవసరపడి యతని రావింప వలదనియుఁ జెప్పెను. అందుచే నామె తన భర్త శరీరాస్వస్థతం గూర్చి వాషింగ్టనునకుఁ దెలుపదయ్యెను. కాని యగస్టీనునకు రోగము నానాఁటికిఁ బ్రబలసాగెను. భిషగ్వరులును నాస వదలుకొనిరి. కావున నిఁక దన నాథుని దేహస్థితిం గూర్చి యామె వాషింగ్టనునకుఁ దెలుపక తప్పినది కాదు. తత్క్షణమే యొక సేవకుని మూలమునఁ గుమారునికి వార్తనంపెను. ఆ వార్తయందఁగనే జార్జి వాషింగ్టను దన చుట్టముకడ వీడ్కోలు వడసి యతి త్వరితముగఁ దండ్రిని జూడవచ్చెను. అట్టిసమయమున నగస్టీను అవసానదశలో నుండెను. ఆ స్థితిలోఁ దండ్రి యొక్కయుఁ, దనయుల యొక్కయు హృదయము లెట్లుండునో పాఠకులే యూహించు కొందురు గాక!

జార్జి వాషింగ్టను తండ్రి తన యనంతరము తన సొత్తుల నెట్లెవరెవరు విభాగించు కొనవలయునను విషయముం గూర్చి యొక మరణశాసనమును వ్రాసియుంచి యీ లోకముం బరిత్యజించి స్వర్గముం జూఱగొనియెను.

## ౪. ఉద్యోగ ప్రయత్నము.

జార్జి వాషింగ్టను తల్లికడ నొక యరేబియా తురంగ ముండెను. అది యెవ్వరికిని లోఁబడలేదు. అందుచే దాని చెంత నెవ్వరును జేరరాదని యామె యాజ్ఞాపించి యుండెను. ఒకనాఁడు జార్జి వాషింగ్టను సతని మిత్రులును నా గుఱ్ఱ ముండిన ప్రదేశమునకు సమీపమున నాటలాడుకొనుచుండిరి. అప్పుడా యశ్వము నధిరోహించ వలయునను తలంపు వాషింగ్టనున కుద్భవించెను. అతనితోఁగూడఁ క్రీడించు చుండిన పిల్లవాండ్రాతని యభిప్రాయముం దెలిసికొని యతనిం బ్రోత్సహించిరి. అందుచే నతఁడు తన సామర్థ్యము తేట తెల్లమగునట్లు ఆ హయ మేమఱియుండగా నదాటున దానిపై కెగిరి కూరుచుండెను. అంత నా గుఱ్ఱము దిగ్భ్రమముం జెంది వెఱ్ఱియెత్తినరీతి యథేచ్ఛగా నానాదిక్కులఁ బఱువెత్త నారంభించెను. వాషింగ్టను దనవలన నైనంత వఱకు దానిని స్వాధీన పఱచుకొనఁ బ్రయత్నించెను, కాని సాధ్యము గాలేదు. అపుడా బాలుఁడు దాని మెడమీఁది జూలును గట్టిగఁ బట్టుకొని వాజి వీపుపైఁ బగుండెను. గుఱ్ఱము చెలరేగి తన యిచ్ఛ వచ్చినట్టు లా మైదానమునఁ ద్రిమ్మర సాగెను. గుఱ్ఱము వీఁపుపై మోఁపిన కడుపుజాతి జార్జి పడునేమో యని యతనితోడి బాలురు వగచుచుండిరి. అయినను జార్జి వాషింగ్టను సైంధవము జూపుచున్న మోటు తనమునకు లేశమైనను భయమందక సాధ్యమైనంతవఱకు దానిని లోఁబఱచుకొనుచుఁ బోవుచుండెను. ఒక్కొక్కపు

డది వాషింగ్టనును గ్రిందఁ ద్రోసివైచు స్థితిఁగూడ సంభ
వింపఁ జేయుచుండెను. ఇట్లది ప్లుతగతి నటఁ బఱువెత్తుచు
సమీపగతులకుఁగూడ దిగులు బుట్టించుచుండెను. కట్టకడ
కది యలసి నోట నురుగులు గ్రక్కుచుఁ దటాలున నేల
వ్రాలి యసువులు వాసెను. దానింగన్న జార్జి వాషింగ్టనును
నతనితోడి చెలికాండ్రును మిగుల భీతిల్లిరి.

తరువాత జార్జి యింటికేఁగి తన తల్లితో జరిగిన
విషయ మాద్యంతము వివరించెను. ఆమె కుమారుని నిర్భ
యతకు లోలోన సంతసించియు "నిఁక నెన్నఁడట్టికార్యముల
సాహసించి యొనర్పవల" దని మందలించెను.

ఈ వృత్తాంతమువలన జార్జి వాషింగ్టనుయొక్క
ధైర్యగుణమును గార్య దీక్షయు నెంత యుత్కృష్టములైనవో
మనము సులభముగ గ్రహింపఁగలము.

పితృవియోగము సంభవించిన పిదప జార్జి వాషిం
గ్టను తన జ్యేష్ఠ సహోదరుఁడగు లారెన్సు నివసించు ప్రదేశ
మునఁజేరి యతనితోఁగూడ నుండెను. తన తండ్రి మరణింపఁ
గనే జార్జి వాషింగ్టను కళాశాలలోని విద్యాభ్యాసమును
మాని వైచెను. తీరుబాటు కలిగినప్పు డతఁడు తాను నేర్చిన
విషయముల నింటికడ స్వయముగానే చదువుకొనుచుండెను.
జార్జి వాషింగ్టనున కప్పటివయస్సు పదునాలుసంవత్సరములు.

జార్జి వాషింగ్టను తండ్రి తాను చనిపోవునప్పు డొక
మరణ శాసనము వ్రాసి యుంచెనని చెప్పియుంటిమిగదా!—
అందు సూచింపఁబడిన రీతి లారెన్సు తన తండ్రి సొత్తులలోఁ

దనకు జేరవలసిన భాగముం గైకొనెను. అట్లతనికి లభించిన యాస్తి పోటామాక్ నదీతీరమునంగల భూములు. లారెన్సు అడ్మిరల్ వెర్నను అను నావికా సేనాధిపతియొక్క యధికారమునకులోబడి యుద్యోగము చేయుచు వచ్చినందున నతఁడు తన నివాసస్థానమునకు "వెర్నన్ భవన" మని నామకరణ మొనర్చి యందు నివసించుచుండెను. ఆ ప్రదేశమున కపుడప్పుడు నావికా సైనికోద్యోగులు వచ్చుచుండుట వాడుకగా నుండెను. వారిని వీక్షించినపుడంతయు జార్జి వాషింగ్టనునకుఁ దానుగూడ వారివలె నొక యుద్యోగస్థుఁడుగ నుండవలయు నను నూహ జనించి యది క్రమక్రమముగ నభివృద్ధిఁ గాంచెను. కడ కతఁడు నావికా సైన్యమున నుద్యోగము సంపాదించఁ దీర్మానించుఁకొనెను. అతని తల్లి యతని యభిప్రాయముతో నేకీభవింప లేదు. అయినను లారెన్సు అను జన్మని యిష్టప్రకారమే నడువవలయునని తల్లితోఁ జెప్పినందున నామె తుట్టతుదకుఁ గుమారుని నావికా సైన్యమునఁ జేర్చుట కంగీకరించెను. వెంటనే జార్జి వాషింగ్టనున కత్యానందము జనించెను. అతఁడు నావికా సైన్యమునఁ జేర్పఁబడెను. కావున నా యుద్యోగమునకుఁ దగు సన్నాహముతో బయలు వెడలుచుఁ దన పెట్టె మొదలగునవి యోడలో నుంచుమని తన సేవకున కాజ్ఞాపించి, తల్లి దీవనంగొనఁ నామెకడ కరుదెంచి నమస్కరించెను. తన కుమారుఁడు నావికా సైనికోద్యోగమునఁ జేరుట యామె కేమాత్రము సమ్మతి గాకుండెను. ఆమె నేత్రద్వయమునుండి యశ్రుధా

లోడికలు గట్టెను. తనకుఁ బ్రాణతుల్యుఁడైన కుమారుం గ్రుచ్చి కౌఁగిలించుకొని, "ప్రియకుమారా! నీవు నన్ను విడనాడి పోవుట నాకు లేశమైన నిష్టము లేదు. ఇక్కడనే యేదో యొక యుద్యోగమును నీవు సంపాదించుకొంటివేని నా మన మున కూఱట గలుగును" అని యనెను. స్వమాత్రాజ్ఞ జవదాఁటరానిదని గ్రహించిన జార్జి వాషింగ్టను తన పూనిక నుండి తత్క్షణమే విరమించి, యోడలోఁ బెట్టఁబడిన తన పెట్టె మొదలగునవి మరలఁ దీసికొని రమ్మని తన భటుని కుత్తరు వొసంగెను. అతఁడు తన తల్లియెడఁ జూపిన గౌరవ మును గమనింపుఁడు! ఈ సందర్భమున "జననియు జన్మ భూమియును స్వర్గముకంటెను మాననీయము" లను నార్య వచనమునకుఁ దగినట్లుగ జార్జి వాషింగ్టను ప్రవర్తించుట కడుంగడు శ్లాఘనీయము గదా!

జార్జి వాషింగ్టను తన తండ్రి గతించిన పిదపఁ దన యన్నయగు లారెన్సు నింట వసించుచుండెనని చెప్పియుం టిమిగదా! అట్లతఁడు అక్కడ వసించుచుండఁగా లారెన్సు అతనికి సాధారణ సైన్యమునందైన నుద్యోగ మిప్పింపనెంచి, యతని నొక సేనాధిపతి వశముచేసెను. అతనికడ జార్జి వాషింగ్టను సేనా సంబంధములగు ననేక విషయములను బుస్తకముల మూలముగ గ్రహింపఁ గలిగెను. జార్జి వాషిం గ్టను సోదరుఁడగు లారెన్సు ఫేర్ఫాక్సను నతని కుమా ర్తెను వివాహమాడి యుండెను గదా! కావున, జార్జి తన యన్నయింటి కపుడపుడు వచ్చుచుఁ బోవుచునుండు ఫేర్

ఫాక్సును జూచుట సంభవించుచుండెడిది. ఫేర్ఫాక్సు సహితము జార్జియొక్క మతి చాతుర్యమునకును, సామర్థ్యమునకును సంతసించి, యతని ననేక విషయములలోఁ బరీక్షించెడువాఁడు. తుద కతఁడు జార్జి వాషింగ్టనున కేదేనొక సహాయమొనర్ప సంకల్పించి యుండెను.

ఇంగ్లాండునందు లార్డ్ ఫేర్ఫాక్సు అను నొక ప్రభువుండెను. అతని కమెరికాలో విస్తారమైన భూస్థితి యుండెను. దానిని బైఁ జెప్పిన ఫేర్ఫాక్సు అను లారెన్సు మామగారే చూచుకొనుచుండిరి. కాలక్రమమున లార్డు ఫేర్ఫాక్సు అమెరికా కరుదెంచి నివాస మేర్పఱచుకొనెను. అప్పుడతఁడు జార్జిం జూచి యతని మేధావిశేషమున కచ్చెరువడి మెచ్చుకొని, యతనికిఁ దనకడనుండిన యుత్తమ గ్రంథములను గొన్నిఁటిని బహూకరించెను. జార్జి వాషింగ్టనా పుస్తకములం జదివి యందలి విషయములను గడు జాగ్రత్తగ జ్ఞాపకముంచుకొనెను. లార్డు ఫేర్ఫాక్సు తానిచ్చిన గ్రంథముల నలక్ష్యము సేయక జార్జి వాషింగ్టను శ్రద్ధతోఁ బఠించి యందలి విషయము లవసరమయినపుడుఁ జెప్పఁగలిగినందుల కెంతయు సంతసించి యతనియం దప్పటినుండియు నెక్కుడు గౌరవముం గాన్పించుచుండెను. అతఁ డెల్లపుడును జార్జి వాషింగ్టను సన్నిధానముం గోరుచుండెను. అట్లగుట నా ప్రభుఁడు వేటకుఁ బోవునపుడును విహారమునకు వెడలునపుడును జార్జి వాషింగ్టనును దనతోఁగూడఁ దోడ్కొని యరుగుచుండెడివాఁడు.

ఇటులుండ లార్డు ఫేర్ఫాక్సు, జార్జి వాషింగ్టనును తన భూములనెల్లఁ గొలుచు నుద్యోగమున నియమించెను. ఈ యుద్యోగమునఁ బ్రవేశించిన జార్జి వాషింగ్టను తన ధర్మమును జక్కఁగ నెఱవేర్చుచుండెను. అతఁడు తన కార్యక్రమము నొక దినచర్యాగ్రంథమున లిఖించుచుండెను. అతఁడా యుద్యోగమున నున్నపుడుఁ బడరాని కష్టములెల్లఁ బడెను. ఆ కష్టముల కతఁడు గొంచెమైనను జంకక తాఁ బూనుకొన్న కార్యములఁ జేయుటయందే దృష్టియుంచి మెలఁగుచుండెను. అతఁ డొక్కొక్కపుడు లార్డు ఫేర్ఫాక్సు ప్రభుని గ్రామములకేఁగి యక్కడి భూములను గొలిచి తిరిగి వచ్చునపుడు తటాలున గాలివాన సంభవించుట వాడుక. ఇంకను నిట్టి మఱికొన్ని కష్టము లతనికి మాటిమాటి కేర్పడుచుండెడివి. అయినను నతఁడంత మాత్రమున నిరుత్సాహమొందినవాఁడు కాఁడు. 'కర్మవీరుఁ డెట్టి కష్టములనైన లక్ష్య పెట్ట' డను నీతి మనమతని చరిత్రవలన నేర్చికొనఁదగును. అతని కొక్కొకసారి భోజనముకూడ లభింపకుండెడిది. సూర్య రశ్ములు నెత్తి మాడ్చుచుండ గంటలకొలఁది నతఁ డెండలో నిలువఁబడి పని చేయవలసి వచ్చెడిది. అతఁడు భయంకరములగు వన్యమృగ బాధలకును, శోణ హైందవుల హింసలకును నగ్గము కావలసి వచ్చెడిది. ఉద్యోగ కారణముగ నతఁడు బయట సంచరించునపు డొక్కొక్కపరి తల దాఁచుకొనుటకు సైతము నీడలేక యవస్థ నొందెడివాఁడు. అట్టి సమయములందతఁడు బట్టబయళ్లలోఁ జండకరుని ప్రచండ కిరణ ప్రసార

ములలోఁ గాలముఁ గడపువాఁడు. పనుల సందర్భముల ననుసరించి యతఁడప్పుడప్పుడు గ్రామములలోనే నిలువవలసి వచ్చెడిది. అట్టియెడ నతఁడు శోణహైందవులు వసించు గుహాలవంటి "విగ్వామ్ (Wigwaum)" అను గుడిసెలలో నుండెడివాఁడు.

జార్జి వాషింగ్టను కార్యదీక్షుంగని వర్జీనియా రాష్ట్రాధికారులతనిఁ దమరాష్ట్ర భూపరిమాణ కార్య నిర్వాహకోద్యోగిగ నియమించిరి. అప్పుడు నతఁడు తన విధ్యుక్త ధర్మమును గడు శ్లాఘాపాత్రముగ నిర్వహించుచుండెను.

లార్డు ఫేర్ఫాక్సుకడ నుద్యోగములో నుండినప్పుడు జార్జి వాషింగ్టనునకు "స్టీవెన్స"నను నతని కుటుంబస్థులతోఁ బరిచయ మేర్పడెను. "స్టీవెన్సు" సతీమణి కేడుగురు సుతు లుండిరి. జార్జి వాషింగ్టను తనకుఁ దీరుబాటు దొరకినపుడెల్ల వారితోఁ జేరి పఱువెత్తుట, ముష్టియుద్ధమొనర్చుట, ద్వంద్వకలహ మాడుట మున్నగు నాటలతోఁ బ్రొద్దుపుచ్చెడు వాఁడు.

---

## ౫. సైనికోద్యోగము

అమెరికా యందలి యాదిమ నివాసులు శోణ హైందవు లనియు, హూణు లమెరికాకు వలసవచ్చిన వారనియుఁ జెప్పియుంటిమి గదా! శోణహైందవులు తమ ఖండముం బ్రవేశించిన శ్వేతవర్ణులకుఁ దామెన్ని యిడుములఁ గలిగింపఁ గలిగిరో యన్నియుఁ గలిగించిరి. కావునఁ దెల్లవారు తమధన

ప్రాణములను గాచుకొనుట కొక సైన్యము నేర్పఱచుకొనక తప్పదయ్యెను. అయినను నాదళము యుద్ధక్రీడయం దారితేఱినది కానందున, నందుల కద్దానిఁ దగినరీతి సిద్ధపఱచిరి. అట్లు సేనను సిద్ధపఱచుటయందు శ్రమఁ గైకొన్నవారిలో జార్జి వాషింగ్టను సోదరుఁడగు లారెన్సు సహితమొకఁడు.

లారెన్సు, వర్జీనియా రాష్ట్రమున 'జనరల్' అను పదవింగాంచి పనిసేయు చుండెను. అతఁడు రోగపీడితుఁడై నందునఁ దనకార్యము నిర్వహింపఁజాలక పోయెను. కావున నతఁడా యుద్యోగముం బరిత్యజింప నెంచి, తన సహోదరుఁడగు వాషింగ్టనుకుఁ దన యభిప్రాయం బెఱిఁగించి తనకార్యము నాతని కిప్పించినఁ దప్పక యంగీకరించ వలయునని ప్రతిమాలెను. జార్జి వాషింగ్టను తనకంటె నెక్కుడగు విద్యావివేక ధురీణు లెందరో కలరనియు, వారిలో నేరికేని నాపదవి యొసంగిన బాగుగ నుండుననియు నన్నతోఁ దెలిపెను. అయినను లారెన్సు, వాషింగ్టనే యాయుద్యోగమును నిర్వహింపఁగల సమర్థుఁడని యెఱింగి యున్నందునఁ, దన యనంతర మాపనిని వాషింగ్టను నెఱవేర్చుటయే మిగుల శ్రేయస్కరమని తలంచి, యతఁ డందులకుఁ దగిన ప్రోద్బలముం గావించెను. అదివఱకే జార్జివాషింగ్టను శ్రద్ధయు బుద్ధియుఁ గార్యదీక్షయుఁ గనులార నెల్లరుఁ గాంచియుండుటచే నతని నీక్రొత్త యుద్యోగమున నియమించుట కెవ్వరును నేవిధమగు నాటంకమును గలిగింప కుండిరి. జార్జి వాషింగ్టను తన పందొమ్మిదేండ్ల ప్రాయమున వర్జీనియాకు "జనరలు"గా నియ

మింపఁబడెను. అతనికి "మేజరు" అను బిరుదమును నొసంగఁ బడినది.

అప్పుడు లారెన్సు, తన దేహారోగ్యము నిమిత్తము 'ఫార్ఫోటాసు' నకుఁ జని యట వర్షకాల మంతయుఁ గడపి రా నిశ్చయించెను. తదను సారముగఁ దన తమ్ముఁడగు వాషింగ్టనుతోఁ గూడ నతఁడు "ఫార్ఫోటాసు" నకుఁ జేరెను. కాని యక్కడను నతనికి వ్యాధి నెమ్మదికాలేదు. జార్జి వాషింగ్టనున కట స్ఫోటకము సోఁకి, చాల బాధపడెను. కావున నన్నయొద్ద ననుజ్ఞఁ గొని జార్జి వర్జీనియాకు మరలి వచ్చెను. లారెన్సుమాత్ర మచ్చట మఱిరెండు మాసములుండి స్వదేశమునకుఁ జేర నెంచెను. అతనికి రోగము నివారణ మగుటకు మాఱు క్రమక్రమముగ హెచ్చుచుండెను. తుదకెట్లో యారెండు నెల లటుఁ గడపి వర్జీనియాకుఁ దిరిగి యేతెంచెను. అట్లువచ్చిన తరువాత నాలువారముల కతఁడు పరమ పదించెను. తాను మరణించుటకు ముందతఁడు తనసొత్తులకు సంబంధించిన మరణశాసన మొండు వ్రాసి యుంచెను. ఆ సొత్తులను బరామర్శించుటకు నియమింపఁ బడినవారిలో జార్జి వాషింగ్టను నయిత మొకఁడు.

లారెన్సు తన మరణశాసనమునందుఁ దన భార్యకును గుమారునకును జేరఁదగిన సొత్తులను సూచించుటయే కాక, వాషింగ్టనునకును దనయాస్తిలో నొకభాగము చెందవలసినట్లు వ్రాసెను. మఱియు నతఁడందుఁ, దనపుత్త్రుఁడు గతించుచోఁ దన కత్యంత ప్రియుఁడగు వెర్నను పేరుతో

దానను భవించుండిన భూస్థితియంతయు వాషింగ్టనునకే చేర వలయుననియు వ్రాసెను. లారెన్సు తనూజుఁడతఁడు శంకించి నట్లే యచిరకాలమున మరణించుడు వెర్నక పేరుతో వెలయుచుండిన లారెన్సు భూస్థితి వాషింగ్టనుకే చెందెను.

జార్జి వాషింగ్టను వర్జీనియా రాష్ట్రమున "జనరల్" పదవియందు నియమింపఁబడెను గదా! ఆయుద్యోగమునఁ బ్రవేశించినది మొదలతని కార్యభార మధిక మాయెను. అయిన నతఁడా యుద్యోగమును శ్రమ యని భావింపక నెఱ వేర్చు చుండెను.

అమెరికాలో నాంగ్లేయులకును ఫ్రెంచివారికిని శోణ హైందవులకును బరస్పర మంతః కలహములు గొన్ని యారంభించినవి. ఆంగ్లేయులు తామే యమెరికా ఖండమందలి తూర్పు సముద్రతీర దేశములను గనిపట్టితి మనియుఁ, గావున నమెరికా ఖండము తమదేయనియు వక్కాణించిరి. ఫ్రెంచి దేశస్థులు తమ నౌకలే ప్రప్రథమమున "సెయింట్ లారెన్సు" నదిలోఁ బ్రవేశించి, యమెరికాలోని మహా నదులకుఁ జేరిన ప్రదేశములను గనుఁగొనెననియు, నందుచే నాఖండము తమదే యనియుఁ దెలిపిరి. శోణహైందవులు తాము తత్ప్రదేశాదిమ నివాసుల మనియుఁ, దమ యనుమతిం గొనియే తెల్లవారటకు రావలెననియుఁ బలికిరి. ఫ్రెంచివారును నా ఖండ మందటనటఁ గొన్ని చోటులను గైవసము చేసికొని యుండిరి. అమెరికా వాస్తవ్యులలో "జిస్ట్" అను నతఁడు మంచి పలుకుబడి గలవాఁడు. అతనితోడ రాష్ట్రపాలకుఁడు

(గవర్నరు) అగు "డిన్విడి" యనునతఁడు, ఫ్రెంచివారి యొక్కయు శోణహిందువుల యొక్కయు నాధిక్యము నణఁచుటం గూర్చి యాలోచించెను. మఱియు వారు ఫ్రెంచివారి కడకు రాయబారము నంపి తమకును వారికిఁగల యంతఃకలహముల నొకవిధముగఁ దీర్చికొని సమాధానపడఁ దీర్మానించు కొనిరి. తుదకు జార్జి వాషింగ్టనును ఫ్రెంచివారి కడకు రాయబారిగాఁబంప నిశ్చయించిరి. జార్జి వాషింగ్ట నందులకు సమ్మతించెను. అతఁడు ఫ్రెంచివారికడకు రాయబారిగ వెడల నున్నాఁడను వార్త నాలించి యమెరికా వాసులగు నాంగ్లేయులు గడు ముద మందిరి.

జార్జి వాషింగ్టను ఓహియోనదీ తీరముననున్న ఫ్రెంచివారి యొద్దకు రాయబారియై పోవుటకు సిద్ధపడి ముందుగాఁ దన తల్లికడకరిగి దండప్రణామ మాచరించెను. తన కుమారుఁడు ప్రాణోపద్రవకరమగు కార్యమునకుఁ దల యొగ్గుటయుఁ, గొన్నాళ్లకు ముందే జ్యేష్ఠపుత్త్రుఁ డసువులఁ బాయుటయుఁ దలపోసి యాయమ యేమి సేయుటకును దోఁచక, తన తనయుం జూచి "కుమారా! భగవంతునిపై భారమువైచి కార్యము నెఱవేర్పుము. సుఖముగాఁ బోయి రమ్ము" అని యాశీర్వదించి పంపెను.

తమ రాష్ట్రాధిపతి యొద్దనుండి ఫ్రెంచి దళవాయి కొక యుత్తరముం దీసికొని యతనిం గాంచుటకై జార్జి వాషింగ్టను బయలుదేఱెను. అతఁడు తగిన సహాయులతో ఫ్రెంచి సేనాధిపతినిజూచి, యాంగ్లేయులకును ఫ్రెంచివారికిని

నేర్పడియుండిన మనస్తాపములను బోఁగొట్టుటకై బయలు దేఱి పోవుచుండఁగా దారిలో గాలివాన ప్రారంభమాయెను. గాలివాన లేనిసమయమున మంచు కుఱియసాగెను. అతని ప్రయాణమునకు నంతరాయము లిట్లు తటస్థించుటచే నతఁ డనుకొన్న దినమున కక్కడకుఁ జేరఁజాలకపోయెను. జార్జి వాషింగ్టను శోణహైందవులను గని వారితో "ఓహియో" నదీ సమీపప్రదేశములకు సంబంధించిన విషయములంగూర్చి సంభాషించెను. వాషింగ్టను, ఆంగ్లేయులు న్యాయ మార్గమున సమాధానమే యభిలషించు వారనియు, వారు స్వాధీన పఱచుకొన్న ప్రదేశములు దుస్థిలో లేవనియుఁ, గావున వారి వచనములయందు శోణ హైందవులు విశ్వాసముంచి మెలఁగుట యుచితమనియుఁ దెలిపెను. మఱియు నతఁడు బ్రతిమాలుకొనిన పిదప శోణ హైందవ నాయకు లతనిని, నతని యనుచరులను ఓహియో నదీతీరమందు ఫ్రెంచివారు కట్టుకొనియున్న దుర్గమునకుఁ బిలుచుకొని పోవుటకు నంగీకరించిరి. మార్గ మధ్యమున వారి కనేక కష్టములు సంభవించినవి. కాని జార్జి వాషింగ్టను వాని నేమాత్రము గణింపక కార్య సాధకత యందే దృష్టియుంచి ప్రవర్తించెను. తుదకెట్లో వారు ఫ్రెంచివారి కోటం జేరి, యందు వసించు ఫ్రెంచి సేనాధిపతిం దర్శించి తమ గవర్నరిచ్చినలేఖ నాతని కొసఁగి, తాము వచ్చిన కార్యము విషయమై సవిస్తరముగ విన్నవించిరి.

జార్జి వాషింగ్టనునకును నతని సహచరులకును ఫ్రెంచి

దళ నాథుఁడు వింక నొకదాని నేర్పఱచి, యావిందులో వారికి నమితముగ మద్యమొసఁగి, వారిని పరవశులం జేసి, వారు వచ్చిన కార్యము నెఱవేర్చుకొనఁ జాలక పోవు నిమిత్తము దురాలోచనము లొనర్పఁ బూనెను. అయినను జార్జి వాషింగ్టనుయొక్క సామర్థ్యముచే నతని దురాలోచనము నెఱవేఱలేదు. "తానొకటి తలఁచిన దైవమొకటి తలఁచు" నను న్యాయరీతి ఫ్రెంచివారి యభీప్సితము నెరవేరనైనపోయెను గాక, జార్జి వాషింగ్టనునకు వారి మూలముగనే వారిని గుఱించి యనేక విషయములు తెలిసెను. అవి జార్జి వాషింగ్టనునకును నతని తోడి వారికిని జాలఁ దోడ్పడెను.

జార్జి వాషింగ్టను ఫ్రెంచివారి కోటయందుండి నపుడు ఆదుర్గమును గూర్చిన విషయముల నన్నిఁటిని వివరముగఁ దెలిసికొని, దాని పటము నొకదానిని వ్రాసి తనయొద్ద నుంచుకొనెను. అంతియగాక యాఫ్రెంచి సైన్యాధికారికి సంబంధించిన యనేకాంశములం గూడ గ్రహింపఁ గలిగెను.

ఫ్రెంచి సేనాధ్యక్షుఁడు రాయబారుల కుచితమగు ప్రత్యుత్తర మొసఁగలేదు. వారివిన్నపముల నతఁడు బెడచెవిం బెట్టెను. అయినను నతఁడు వారు తెచ్చిన యాంగ్ల రాష్ట్రాధిపతి కమ్మకు మాత్రము బదులువ్రాసి యిచ్చెను. ఆ లేఖ యందతఁడు తమపై నెట్టి నేరముగాని యాంగ్ల దేశీయులు మోప నవసరము లేదని తెలిపెను.

ఫ్రెంచివారు, జార్జి వాషింగ్టనును నతని సహాయక వర్గమును వెంటనిడుకొని వచ్చిన శోణ హైందవులకుఁ గావల

సిన ధన మొసఁగి, యెట్లయినను రాయబారులను దమ మార్గమునకుఁ ద్రిప్పఁ బ్రయత్నింపుఁడని ప్రోత్సహించిరి, కాని నిష్ప్రయోజన మాయెను.

ఫ్రెంచి వాహినీపతి యొసంగిన యుత్తరముం గైకొన్న తత్క్షణము జార్జి వాషింగ్టనును నతని సహకారులును ఫ్రెంచి వారి దుర్గమునుండి బయలుదేఱ నెంచిరి, కాని వచ్చిన వారిలో నొకఁడు జ్వరగ్రస్తుఁ డైనందున వారి ప్రయాణము నిలిచిపోయెను. కావున వారందఱట రెండుమూఁడు దినములు లాఁగవలసి వచ్చెను. అనంతరము వారు బయలుదేఱి తిరిగి వచ్చునపుడు గాలియు, వానయు, మంచును విశేషముగ నుండినందున నటనట వారి కనేక కష్టములు ప్రాప్తించెను. కావున జార్జి వాషింగ్టను ముఖ్యుఁడగు "జిస్టు" ను మాత్రము వెంటఁ దీసికొని, తక్కిన వారి నచ్చ్యెడనే యుండ నియమించి, యూరికిఁ బ్రయాణ మయ్యెను. అట్లు బయలు దేఱి వచ్చునెడ వారి కెదురుగా నొక శోణ హైందవుఁడు వచ్చుచుండెను. అతని వారిదివఱకు ఫ్రెంచివారి దుర్గమునఁ జూచియుండిరి. అతఁడు వారిని సమీపించి ప్రయాణాను కూలోపచారములు వారికిం గావించు నట్లు నమ్మఁబలికి వారితోఁ గలసి నడచు చుండెను. అతఁడు సరియైన మార్గముం బరిత్యజించి వారిని మఱియొక దారిలోనికిఁ బెట్టెను. అప్పుడు జార్జి వాషింగ్టను జట్టువారును ఆ శోణ హైందవుఁడు తమ్ముఁ గ్రొత్తత్రోవను దీసికొని పోవుచున్నాఁడని గ్రహించి, వాని విషయమై సందేహించుచు వాని వెనుకనే

నడచుచుండిరి. వారు సందేహించినట్లే, యా శోణ హైందవుఁడు తుదకు దుర్భావము గలవాఁడుగనే మాఱిపోయెను. వారి నతఁడట్లు చాలదూరము పిలుచుకొని పోయిన తరువాత దటాలున వెనుకకుఁదిరిగి తన చేతనుండిన తుపాకితో వారిని గాల్ప నారంభించెను. కాని దైవవశమున గుఱి తప్పిపోయెను. అట్లగుట జార్జియు జిస్టును నుసురులఁ దక్కించుకొనఁ గలిగిరి. ఆ శోణ హైందవుఁడు తన తుపాకిగుండు గుఱితప్పి పోవుట నెఱింగి, వెంటనే సమీపమందలి యొక మహామహీజము నధిరోహించి మరల వారిని గాల్చుటకై తన తుపాకిలో గుండ్ల నిముడ్చుచుండెను. జార్జి వాషింగ్టనును నతని యనుచరుఁడును భయమందక వానిం బెదరించి యాకుజమునుండి దిగునట్లుచేసి, వానికరమున నున్న తుపాకిని దీసికొనిరి. తరువాత నా శోణ హైందవుఁ డొక శ్వానముంబోలె వారి వెంట నడచెను. వారు దీర్ఘాలోచనము గల వారగుట నా శోణ హైందవుని వధింపరైరి. వారు వానిం జంపియుండినచోఁ దక్కుంగల శోణ హైందవులెల్ల రొక్కుమ్మడిగ వచ్చి పైఁబడి వారిని బొరిపుచ్చి యుందురనుటయం దావంతయు సంశయములేదు. పిమ్మట వారా శోణ హైందవుని క్షమించి, వాని తుపాకిని వాని కప్పగించి వానిని వెడలి పొమ్మని చెప్పిరి. వెంటనే వాఁడు ప్రాణములు దక్కుటయే చాలునని తలంచి యా చోటువదలి యరణ్య మధ్యమునకుఁ బాఱిపోయెను. అయినను వాషింగ్టను జిస్టులు వాని వలన దమ కొకవేళ మరల నేదైన నాపద సంభవింపవచ్చునని

శంకించుచుండిరి. కాని వాఁడు మరల వారి కంటికి గనబడ లేదు. ఇఁక నక్కడఁ గాలయాపన మొనర్చుట క్షేమకరము గాదని యూహించి వారిరువురు నతి త్వరితగతిఁ దమ పయన మును సాగించిరి. ఆ రీతి వారు బయలుదేఱి పోవుచుండ మార్గ మధ్యమున నొక తరంగిణి తటస్థపడెను. దానిని వారు దాఁటు టత్యంతావశ్యకముగ నుండెను. కావున, వారా నదీ తీరమున లభించిన చెట్ల మొద్దులను జేర్చి యొక తెప్పగాఁ గట్టిరి. పిదప వారా తెప్పపై నెక్కి యేటిని దాఁటుచుండ వాషింగ్టను పట్టుతప్పి జాఱి నదిలోఁ బడెను. అయినను నతఁ డెట్లో యీఁదుకొనుచు వచ్చి మరల నా పడవ నెక్కెను. ఇట్లు వారా తటినిం దాఁటుచు నొక చిన్నదీవిం జేరిరి. అక్కడకుఁ జేరఁగనే వారు తమ ప్రాణములు గట్టునఁ బడి నందుల కెంతయు సంతసించిరి. వారక్కడ నిరువదిమంది శోణ హైందవులంగని, వారి మూలముగ వారి రాజిని దర్శించి యామెవలన సత్కారములం బొందిరి. తరువాత వారు స్వస్థానమగు "విల్లియమ్స్ బాగు" నకు వచ్చిచేరి, తాము సుఖముగా మరల గృహమునకుఁ జేరఁగలిగినందు లకుఁ బరమేశ్వరునకు స్తోత్రములఁ జెల్లించిరి. పిదప జార్జి వాషింగ్టను తమ రాష్ట్రాధిపతిని దర్శించి తాము వెడలి వచ్చిన రాయబారవిషయమై చాలసేపు సంభాషించెను. ఫ్రెంచివారి చర్యల నామూలాగ్రముముగ నతనికి నివేదిం చుటయగాక, వారి దుర్గబల విషయములను వివరించి, తా నక్కడఁ బ్రత్యక్షముగఁ జూచిన వానింగూర్చి తనచే

వ్రాయఁబడిన గ్రంథము నాతని కిచ్చెను. అతఁ డందలి యంశములెల్ల సావధానముగఁ బరించి యది యత్యంతోప యోగకరమని భావించి దాని ముద్రించి శాసన సభ్యులు మొదలగువారికిఁ బంప నిశ్చయించి, తానే దాని నచ్చు వేయించెను. అతఁడట్లచ్చు వేయించిన ప్రతులను నమెరికా లోని శాసన సభ్యులకు మాత్రమేకాక, ఇంగ్లండులో రాజ్యాం గము వారికిని, వార్తా పత్త్రికలకును బంపెను. దానిని వార్తా పత్త్రికలన్నియుఁ బ్రచురించినవి. శాసన సభ్యులు నా గ్రంథ ములోని విషయములం గాంచి యచ్చెరువునొంది జార్జి వాషింగ్టను బుద్ధి కుశలత్వము ననేక విధములఁ గొనియాడిరి.

---

## ౬. మహాసంగ్రామము.

ఫ్రెంచివా రాంగ్లేయులకు వాషింగ్టను మూలముగ సరియగు ప్రత్యుత్తర మంపనందున నమెరికాలోను నింగ్లాండు లోను నుండు నాంగ్లేయులకు ఫ్రెంచివారిపై ద్వేషము ప్రబ లెను. కావున నాంగ్లేయు లాత్మగౌరవ సంరక్షణార్థము ఫ్రెంచివారితో యుద్ధమొనర్పక తప్పదయ్యెను. ఇంగ్లాండు పరిపాలకుఁడును ఫ్రెంచివారితో సంగరము సలుపుట తక్క వేఱొండు మార్గములేదని గ్రహించి, యందులకుఁ దగిన యేర్పాటులు గావింపఁ దనయనుమతి నొసంగెను. ఆహావ మునకు సైన్యములు సమకూర్పఁ బడెను. యువకు లనేకులు సేనలోఁ జేరుటకు ముందంజ వేయుచుండిరి. జార్జి వాషింగ్టనా విషయమును రాష్ట్రపాలకునకు నివేదించెను. అపుడతఁడు

సేనలోఁ జేరువారికి 'ఓహియో' నదీ తీరమునందలి సారవంతములగు భూము లీఁబడునని ప్రకటించెను. దానింగని యమెరికా వాసు లనేకులు సేనలోఁ జేరిరి. అట్టి సేనకు జార్జి వాషింగ్టను నాయకత్వము వహింపవలెనని యధికారులు కోరిరి. అయిన నతఁడందుల కంగీకరింపక, తనకుముందు నుండియు సేనాధిపతిగానుండు 'కర్నల్ జోసువాయిరై' అను నతఁడే యాపదవికిఁ దగినవాఁడని వచించి, తగుప్రయత్నము లొనర్చి యాతనికే యాపదవి నిప్పించి నాతనిక్రిందఁ బని సేయు చుండెను.

ఇంతలోఁ బ్రతినిధుల సభకు సభ్యుల నేర్పఱచు కొనుట కెన్నికలు జరిగెను. అపుడొక తెగకు నిరువు రభ్యర్థులు పోటీచేసిరి. అందొకని పేరు "కర్నల్ జార్జి ఫేర్ఫాక్సు", మఱియొకని నామము "ఎల్లిసు". జార్జి వాషింగ్టను, "కర్నల్ ఫేర్ఫాక్సు" పక్షమున మాటలాడెను. అప్పు డట నున్న "ఫెయి" యనునతఁడు తన పక్షమునకు నాయకుఁ డగు నెల్లి సనునతని యభ్యర్థిత్వమును బలపఱచుచు మాటలాడెను. వెంటనే వాషింగ్టను "సత్ప్రవర్తనములేనివాఁ డెంత సమర్థుఁ డయినను బ్రయోజనము లే"దని యతనికిఁ గినుక జనించునట్లు నుడివెను. అందుచే "ఫెయిను" మివుల కోపావేశముతోఁ దనచేతిలో నుండిన యొక కఱ్ఱతో వాషింగ్టనుంగొట్టి క్రిందికిఁ ద్రోసెను. దానింజూచిన వాషింగ్టను మిత్రులా "ఫెయిను"ను బ్రహరించు చుండిరి. తత్క్షణమ వాషింగ్టనులేచి, తన హితులంజూచి "నేను వాకొనిన

విషయము లాతనికిఁ గోపకారణము లయ్యెను. అందులకు నాబుద్ధిహీనతయే మూలము. కావున నతని నేమియు ననవలదు. వదలిపెట్టు" డని వేడుకొనెను. అంత వారతనిని విడిచిపెట్టిరి. తరువాత వాషింగ్టను స్వగృహముంజేరి, యొక యుత్తరమును లిఖించి "ఫెయిను"నకుఁ బంపెను. అందుఁ దానువ్రాసిన ప్రకారము మఱునాఁ డుదయమున ఫెయిను మందిరమునకు వాషింగ్టను నెడలెను. వాషింగ్టను దనకేదో కీడొనరించుటకే వచ్చుచున్నాఁడని 'ఫెయిను' భావించి యాయుధపాణియై, తనకడ కరుదెంచిన వాషింగ్టను నెదుర్కొనెను. ఫెయినురాఁగానే వాషింగ్టనతని కరస్పర్శముంగావించి తాను దెలియక యాచరించిన యపరాధమును క్షమింప వేడికొనుటకే వచ్చితినని విన్నవించెను. వాషింగ్టను సచ్ఛీలమునకును సుహృద్భావమునకును ఫెయిను పరమానందముంబొంది యతనిం గౌఁగిలించుకొనియెను. తరువాత వారిరువురును జీవితాంతము వఱకు గాఢమైత్రితో మెలఁగుచుండిరి.

వాషింగ్టను కొంతసేనను సమకూర్చుకొని ఫ్రెంచివారితో యుద్ధమొనర్ప బయలుదేఱెను. పోవునపుడు దారిలో ఫ్రెంచివారి నెదిరించి వారికి భయముపుట్టు నట్లొనర్చెను. ఫ్రెంచివారికిని నాంగ్లేయులకును యుద్ధము పొసఁగెను. ఆ రణమున ఫ్రెంచిసేనాని మడిసెను. ఇంకను వాషింగ్టను ఆయుద్ధభూమియందే యుండఁగా, నతనికిని నతని సేనకును గావలసిన యాహారాదికములకుఁ గొఱంత యేర్పడెను. దానిని దీర్ప నతఁడెంతయో ప్రయత్నించుచు యోధులకు నుత్సా

హము గలిగించెను. జార్జి వాషింగ్టను తనచే నెఱవేరునట్టి కార్యములకు మఱియొకరి నెన్నఁడు నెదురుచూచి యుండ లేదు. అతఁ డనుదినము ప్రాతఃకాలమునను సాయంకాలమునను దన సైనికులకుఁ గావలసిన సద్విషయములం గూర్చియు నైతిక మార్గములం గూర్చియు బోధించుచుండెను. కావున నతఁడు మతబోధకుఁడుగ సైతము నుండెననుటయం దతిశయో క్తి ఇంచుకయు లేదు. వీరభటులు స్వల్ప విషయములకుఁ గూడ శపథము లొనరించుట వాడుకగా నుండెను. దానిని వాషింగ్టను మాన్పఁగలిగెను.

మరల జార్జి వాషింగ్టను తన ప్రతిపక్షుల హోరాహోరిగ నెదుర్కొనెను. ఇట్లెదుర్కొనుటచేఁ దటాలున నతనికిని నతని శత్రువులకును ఘోరయుద్ధము నడచినది. ఈ యుద్ధమున వాషింగ్టను తన పగవారితో సమాధాన పడ వలసి వచ్చెను. అయినను వాషింగ్టనును నతని యుద్ధభటులును శత్రువులు సైతము మెచ్చఁదగినరీతి సంగ్రామ మొనరించిరి. ఫ్రెంచివారి పక్షము మిక్కిలి యధికముగ నున్నందున నతఁడు వారితో విధిలేక సంధి గావించుకొన వలసి వచ్చెను. వాషింగ్టను ఫ్రెంచివారితో సమాధానము చేసికొని విల్లియమ్సుబర్గునకు వచ్చిచేరెను. రాష్ట్రాధిపతియును, ప్రతినిధి సభా సభ్యులును జేరి, వాషింగ్టనును, నతని సైనికులును ఫ్రెంచివారితో ధైర్యముగాఁ బోరాడినందులకు మిగులఁ బ్రశంసించిరి. ఆయుద్ధమున ధైర్యసాహసములం బ్రకటించిన వీరయోధుల కొసంగుటకుఁ బ్రతినిధి సభవారు నాలుగు

నూఱుల తుపాకులును, బది వేల డాలరులును ప్రభుత్వమువా రీవలెనని తీర్మానించిరి. మఱియు నాంగ్లేయ రాజ్యాంగవారు అయిదు వేల డాలరుల నాసైనికులకుఁ బంచిపెట్ట నాజ్ఞాపించిరి.

ఫ్రెంచివారు, తమదళవాయి నెదిరించుట క్షమింప రాని నేరమని యాంగ్లేయులపై దోషా రోపణముం గావించిరి. అయినను, నాంగ్లేయులు, ఫ్రెంచివారి సైన్య బలాదికములఁ గనుఁగొని పోవుటకు వచ్చిరనియు, నట్టియెడ వారి నెదిరించుట తప్పనిసరి యాయెననియుఁ బ్రత్యుత్తర మొసఁగి తమపై మోఁపబడిన నిందకుఁ బ్రతీకారమును వెదకుచుండిరి.

అమెరికా రాష్ట్రాధికారి యెట్లయిన ఫ్రెంచివారి దుర్గమును స్వాధీనపఱచుకొనుటయందే తనదృష్టినంతయు నిలిపియుంచెను. ఆవిషయ మతఁడు జార్జి వాషింగ్టనునకు స్పష్టముగఁ దెలిపెను. అతఁడు, సముచిత సన్నాహమును, వాహినీ సంపదయును లేక యా దుర్గముంబట్టుట కష్టసాధ్యమగు కార్యమని విశదీకరించెను. కాని, ప్రస్తుతమున్న సేనతోనే బయలువెడలి ఫ్రెంచివారికోటను ముట్టడింపక తప్పదని రాష్ట్రాధీశుఁడు జార్జి వాషింగ్టనున కాజ్ఞాపించెను. అందులకుఁ దగినట్లు సేనకుఁ గావలసిన సౌకర్యములు సయిత మా రాష్ట్రపతి యొనరింపఁ డయ్యెను. ఆతనికి జార్జి వాషింగ్టనుపయి నొకవిధమగు నసూయత యేర్పడి యుండెను. కావున నతఁడాంగ్ల రాజ్యాంగము వారికి వ్రాసి, "వలస రాజ్యములలోని సైనికోద్యోగులు (సేనాధిపతులు మున్నగువారు) బ్రిటిష్ సేనానాయకులక్రిందఁ బనిచేయవలయు" నను నొక శాసనముం

జేయించెను. ఈ శాసన విధానము ననుసరించి జార్జివాషింగ్టను "కర్నల్" అను పదవినుండి, "కాప్టను" అను తక్కువపదవికి మార్పఁబడెను. అప్పుడతఁడు, తనకు రాష్ట్రాధిపతి కలిగించిన యవమతిందలఁచి చాల వగచెను. కావునఁ దానా తక్కువ పదవింగైకొన నిష్టము లేనివాడై వెంటనే తన సైనికోద్యోగమును వదలుకొని, స్వస్థలమున కరిగెను. అతఁడుద్యోగమునుండి విరమింపఁగనే ఫ్రెంచివారి కోటను బట్టుకొను నుద్దేశము సమూలముగ నశించెను.

మఱియు, నమెరికాకుఁ జేరిన యనేక దేశము లొక్కటిగఁ గూడి ఫ్రెంచివారితోఁ దలపడ వలయునని తమలో నొక నియమముం గావించుకొనినవి. అట్లు పూనుకొన్న దేశములకు సహాయకులగు నాంగ్ల రాజ్యాంగమువారు "జెనరల్ బ్రాడక్" కనునొక సేనాధిపతి నమెరికాకుఁ బంపిరి. అతఁడు వచ్చిన వెంటనే, యక్కడి పరిస్థితులం దిలకించి జార్జి వాషింగ్టను సాయము లేక కార్యము నెఱవేఱదని గ్రహించి, యీ విషయమును రాష్ట్రాధిపతికి నెఱింగించి, యతని యనుమతి ననుసరించి జార్జి వాషింగ్టనును బిలిపించి తన సేనలోఁ జేర్చికొనియెను. జార్జి వాషింగ్టను సేనలోఁ జేరఁబోవుటకుముందు తన మాతృదేవత కడకుంజని యామె యాశీస్సులఁబొంది, రణరంగమున కుఱుక సిద్ధపడెను. జనరల్ బ్రాడక్కునకు అమెరికానుగూర్చి యేమాత్రమును జక్కఁగఁ దెలిసియుండమి, "డాక్టర్ ఫ్రాంక్లి" ననునతఁడు, అతనికి ముఖ్యముగా శోణహైందవుల విషయమునఁ బ్రవ

ర్తింపవలసిన విధముంగూర్చి వివరించి చెప్పెను. కాని వానిని ఫ్రాటాక్కు లక్ష్యముసేయలేదు. తన యభిప్రాయము ప్రకారము నడుచుకొనుటయందే యతఁడు పట్టుదల నెక్కుడుగఁ గలవాఁడు. కేవలము దురభిమానపూరితుఁడు. తుదకు ఫ్రాటాక్కు ఫ్రెంచివారిని మార్గ్గానఁ దనసేనతోఁడ బయలు వెడలెను. వాషింగ్టనుసయితము మాతనిం గలసికొనెను. జార్జి వాషింగ్టనుకూడ శోణహైందవులతోఁ దలపడఁ బ్రయత్నింప వలదనియు, నైరోపాదేశమునందలి యుద్ధపద్ధతు లమెరికాలో నుపయోగపడవనియు, ఫ్రెంచివారి కనుకూలముగ శోణహైందవు లనేకులు వారిసేనలోఁ జేరియున్నారనియు, నీవిషయముల నన్నిఁటిని జక్కఁగ నాలోచించియే సంగర మొనరింప వలయుననియు ఫ్రాటాక్కునకు స్పష్టపఱచెను. కాని, ఫ్రాటాక్కు వాషింగ్టను నుడివిన యంశములంగూడఁ బెడచెవింబెట్టెను. అతఁడు "తాబట్టిన కుందేటికి మూఁడేకాళ్లను" మూర్ఖస్వభావముఁ గలవాఁడు. మఱియు నతఁడు పానప్రియుఁడయి నందున, నప్పుడప్పుడు డొడలు మఱచునట్లు త్రావుట యాతనికి వాడుకయయి యుండెను.

డాక్టరు ఫ్రాంక్లిను, జార్జి వాషింగ్టను మున్నగు వారు చేసిన హితబోధలను జనరల్ ఫ్రాటాక్కు లక్ష్యపెట్టక, తన యిష్టానుసారము ప్రవర్తించినందునఁ బగతు అదాటునఁ దాఁకిరి. అట్టి సమయమున జార్జి వాషింగ్టను తన వెనుకనున్న ఫ్రాటాక్కు సేనావీరు లాశ్చర్య పడునట్లాహవ మొనరించెను. ఈ సంగ్రామమున ఫ్రాటాక్కునకు గొప్ప గాయము లేర్పడి.

నవి. కావున, సేనను నడుపవలసిన భారమంతయు వాషింగ్టను పైననే పడెను. ఎన్నఁడు నెదురు సూడని విధముగ శాత్రవుల చేతిలో నాంగ్లవీరులు చిక్కువడవలసిన స్థితి తటస్థించినందున, వారు తెన్నుఁగానక వెనుదిరిగి పఱువిడవలసి వచ్చెను. జనరల్ బ్రాడాక్కు మేను వీడునపుడు, తాను జార్జి వాషింగ్టను చెప్పిన విషయముల నలక్ష్యము చేసినందుల కెంతయుఁ బశ్చాత్తాపముం గనఁబఱచెను.

జనరల్ బ్రాడాక్కు మరణించిన పిదప "జనరల్ డన్ బా" రను నొక యోధుఁడు రాణువ కధిపతిగ నియమింపఁబడెను. కాని, యతఁ డింకను బొలికలనునకుఁ జేరకమున్నే జార్జి వాషింగ్టను సర్వసేనల కాధిపత్యము వహించి వానిని నడుపవలసిన యవసర మేర్పడెను. ఇంతలో "డన్ బారు"ను వచ్చి కలసికొనెను. అతఁ డంత ధైర్యమును బుద్ధి చాతుర్యమును గలవాఁడు గాఁడు. మఱియు నతఁడు రణరంగమున ముం దడుగు వేయలేనంతటి పిఱికి తనమును గలవాఁడు. దీనికిఁ దోడు వర్షకాలమును సమీపించుచుండెను. కావున సేనలన్నియు ఫిలడెల్ఫియాకు మరలి పోయెను. శాసన సభ వారును, రాష్ట్రాధిపతియు వైరివర్గమును మార్కొను విషయమై మునుపుఁ జూపిన శ్రద్ధజూపుట లేదు. అయినను జార్జి వాషింగ్టను మాత్రము ఫ్రెంచివారిని దఱిమి వేయవలయుననియు, లేకున్న నాంగ్లేయుల కెంతమాత్ర మమెరికాలో నెమ్మది యుండదనియు నొక్కి చెప్పెను. తుట్ట తుదకు జార్జి వాషింగ్టను అనేక సేనలకు నధిపతిగా నియమింపఁ

బడెను. సర్వ సేనాధిపతి పదవిఁ బొందిన పిదప జార్జి వాషింగ్టను కార్యములను జాకచక్యముతో నిర్వహింప మొదలిడెను. స్వప్రయోజనార్థమై యతఁడొక పరి న్యూయార్కు నగరమున కేఁగెను. అపుడతఁ డక్కడ "మిస్ఫ్లిట్జు" అను కన్యతో మైత్రి యొనర్చెను.

ఓహియో నదీ తీరమున ఫ్రెంచివారికిని ఆంగ్లేయులకును గల సరిహద్దు ప్రదేశముకడ నిరుపక్షముల వారికిని బోరు వొసఁగెను. శోణ హైందవులు ఫ్రెంచి వారితోఁ జేరి యాంగ్లేయులకుఁ గడునిడుమలు గలిగించిరి. ప్రజా సామాన్యము భయభ్రాంతమై పరిపాలకు లెవరగుదురో యని యాందోళన మందుచుండెను. అట్టి యెడ ఫ్రెంచివారి నెదుర్కొన నాంగ్లేయులచే సిద్ధము చేయఁబడిన సేనయొకటి రణభూమి కవతరించెను. ఆ సేనను నడుపు నతఁడు ఫ్రెంచివారికి సహాయకులగు శోణ హైందవుల ప్రవర్తనముం గూర్చి యించు కంతయుఁ దెలియనివాఁడు అందుచే నాంగ్ల సేనా వీరుల కెన్నియో కష్టములు సంభవించెను. సేనా నాయకులు తమ సేనలకుఁ గలిగిన కష్ట నష్టములం గుర్తించి మరలి పోవ నుద్దేశించిరి. కాని, జార్జివాషింగ్టను అట్లు చేయుట పౌరుషము గాదనియు, నెట్లయినను ఫ్రెంచివారి నమెరికా నుండి తఱిమివేయ వలయుననియు సంకల్పించి, సేనా వీరులకుఁ దగు ప్రోత్సాహముం గలిగించి, సేనను ఫ్రెంచివారి దుర్గముపై నడిపి, దానిని ముట్టడించెను. ఇట్లకస్మాత్తుగాఁ గోటపైకి వచ్చిన జార్జివాషింగ్టనును నతని సేనలను గాంచి యందున్న

ఫ్రెంచివారు వెఱచి కోటవిడిచి పఱువులెత్తిరి. అపుడు వాషింగ్టను నిరాటంకముగఁ గోటను బ్రవేశించి, బురుజుపై నుండిన ఫ్రెంచివారి పతాకముం దీసివేయించి, యాంగ్ల పతాకమును స్థాపించెను ఇంతటితో ఓహియో నదీతీరపు టెల్లలో ఫ్రెంచి వారు దుర్గమును గట్టుకొని యుండినందున, నాంగ్లేయులకును ఫ్రెంచి వారికిని నేర్పడియుండిన వివాదము సమాప్త మయ్యెను. ఈ కలహము ముగియఁగనే వాషింగ్టను తన యుద్యోగమును వదలుకొని, స్వగ్రామమున కరిగి యక్కడఁ దన కాలముం గడుప నిశ్చయించు కొనెను. ఆంగ్లేయులు తాము ఫ్రెంచివారి యొద్దనుండి ఓహియో నదీ తీరమందలి కోటను స్వాధీన పఱచుకొన్న వెంటనే, దానికిఁ దమ ప్రథమ మంత్రియగు "విల్లియంపిట్టు" జ్ఞాపకార్థము శాశ్వతముగ "పిట్టు దుర్గము" అని పేరిడిరి.

పైఁ జెప్పిన యుద్ధములలో నాంగ్లేయులకును ఫ్రెంచి వారికిని ననేక నష్టములు ప్రాప్తించెను. కాని యదధికముగ ఫ్రెంచి వారికే కలిగినట్లు చరిత్రకారులు వ్రాసియున్నారు.

## ౭. కుటుంబ విషయములు

ఫ్రెంచివారితో నేర్పడిన యంతఃకలహములన్నియు నొక విధముగఁ బరిష్కారము కాఁగానే జార్జి వాషింగ్టను శ్రీమతి. కస్టిస్ అను పేరుగల వితంతువును వివాహ మాడెను. ఈమెకు విస్తారమగు భూస్థితి యుండెను. అంతియు గాక యీమె కాకర్షణీయకమగు రూప సంపదయును బుద్ధి చాతుర్యమును వెలయుచుండెను. వాషింగ్టను వెర్జినియా

రాష్ట్ర శాసనసభకు సభ్యుఁడుగా నెన్నుకొనఁబడెను. అతఁడు తన పదవి నొందినపుడు తక్కిన సభ్యు లతనిని మిగులఁ గొని యాడిరి.

జార్జి వాషింగ్టను అపుడపుడు తన స్నేహితులం బిలి పించి వారికి విందులు మున్నగునవి జరుపుట యలవాటు. వాషింగ్టను నతని కుంటుబము వారును తక్కిన ధనవంతుల వలెనే మిగుల నాడంబరముగా నుండ నభిలషించు చుండిరి. వాషింగ్టను నీగ్రోవారిని జాలమందిని దనకడఁ బనివారినిగా నియమించుకొని యుండెను. వారిని తానును దన సతియును మిగుల ప్రేమతోడను గౌరవము తోడను జూచుకొను చుండెడి వారు. వాషింగ్టనునకుఁ గష్టపడి పనిచేయుట యందు ప్రియమధికము. అతనికిని అతని భార్యకును విస్తారముగ భూ స్థితి యున్నదని చెప్పితిమి గదా. ఆ భూము లలోఁ బనిసేయ వలయునని వాషింగ్టను మిగుల నుత్సహించు చుండెడి వాఁడు. వాషింగ్టను పసితనమునుండియే సదభ్యా సము లలవఱచుకొని యుండెను. అవి కాలక్రమమున నతని యందుఁ బెంపొంది యతఁడు పెద్దవాఁడైనపుడెంతయు నత నికిఁ బ్రయోజనకరము లయ్యెను. అతఁడు తన భూముల విషయమై శ్రద్ధఁబూని యద్దాని కనేక నూతనాభివృద్ధి మార్గములను కనుఁగొనెను. వాషింగ్టనును నతని రమణీ మణియు మిగుల దైవభక్తిఁ గలవారు. వారప్పుడప్పుడు దేవాలయమునకు వెడలి దేవునిఁ బ్రార్థించువారు. జార్జి వాషింగ్టను భార్య, మొదట కస్టిస్ అనునతని భార్య.

ఆమె కా మొదటి భర్త మూలమున నిరువురు పుత్త్రులును నొక పుత్త్రికయుఁ గలిగి యుండిరి. అందుఁ బ్రథమ సుతుఁడు తన జనకుఁ డున్నపుడె మరణించెను. కావున జార్జి వాషింగ్టను వివాహమాడు నప్పటికి శ్రీమతి కస్టిసునకు నొక పుత్త్రుఁడును నొక పుత్త్రికయు నుండిరి. వారిలో నాఁడుబిడ్డ తన తల్లికి వివాహమైన కొలఁది కాలమునకే వ్యాధి పీడితురాలై చనిపోయెను. ఆమె గతించినపుడు శ్రీమతి వాషింగ్టనును జార్జి వాషింగ్టనును పొందిన దుఃఖమునకు మేరయే లేదు. తరువాత మిగిలిన యొక కుమారుఁడును వారిచే మిగులఁ బ్రేమతోఁ బెంచఁబడెను. అందుచే నతఁడు తన యిష్టము వచ్చినట్లెల్ల సంచరించు చుండెను. వాని పనికి మాలిన నడతను గాంచి శ్రీమతి వాషింగ్టను మిగుల చింతించి వాని విషయమై తన భర్తతో విన్నవించెను. వాషింగ్టను నా పిల్లవానిని న్యూయార్కు పట్టణములోని యొక పాఠశాలయందుఁ జదువవేసెను. గాని యా బాలుఁడు చదువునందు శ్రద్ధఁజూపక పాఠశాలనుండి వెడలివచ్చెను. తరువాత నతఁడు యుక్త వయస్కుఁడైనప్పుడు పెండ్లి జేసికొనెను. వాషింగ్టను తనకెన్ని ముఖ్య కార్యములుండినను దీరుబడి యైనప్పుడెల్ల ననేక శాస్త్రములను జదువు చుండెడివాఁడు. ప్రతి విషయమునందు నతఁడును నతని భార్యయును నేకాభిప్రాయముఁ గలవారై వర్తించుచుండిరి. అందుచే వారికి సంసారము సంతోష దాయకముగనే యుండెను.

## ౮. ఇంగ్లాండును, అమెరికాయును

జార్జి వాషింగ్టను దాదాఁపు దశ వర్షములకాలము స్వగ్రామమున భార్యతోడను బంధుజాలముతోడను వసించెను. ఇగ్లండు శోణహైలాందవుల యల్లరి తిరిగి తలయెత్తెను. వారి యాధిక్యత నాంగ్లేయులు సులభముగ నణఁచివైచిరి. అయినను అమెరికా వారికిని, ఆంగ్లేయులకును గొన్ని విషయములలో నభిప్రాయభేదము లేర్పడి యభివృద్ధియై యవి పోరాటమునకుఁ గారణము లాయెను.

ఇంగ్లాండు రాజ్యాంగమువారు ఆర్థికదుస్స్థితి కారణముగ నమెరికాలో వసించు వారు కొంత పన్నును జెల్లించవలెనని యాజ్ఞాపించిరి. తమకు ఇంగ్లీషు పార్లమెంటులోఁ బ్రాతినిధ్యము లేకయే ఇంగ్లీషు పార్లమెంటువారు విధించు పన్నులను దాము చెల్లించుటకు వీలులేదని అమెరికాలోనున్న వారు తెలిపిరి. వారిట్లు తెలిపిన విషయములను ఇంగ్లీషు వారు అలక్ష్యముచేసి యింకను గ్రొత్త క్రొత్త పన్నులను విధించుచు వచ్చిరి ఇంగ్లీషు పార్లమెంటువారు 'స్టాంపాక్టు' అను నొక చట్టము నిర్మించి ఎట్టి వ్యవహారములలో నైనను దానిననుసరింప మూఁకల యిడిరి దాని నమెరికా వా రంగీకరింపలేదు. "పాట్రిక్ హెన్రి" అను పేరుగల యమెరికా ప్రతినిధి యమెరికా శాసనసభలోఁ బైఁ జెప్పిన పన్ను అన్యాయమైనదనియు దానిం గట్ట నవసరము లేదనియుఁ బ్రసంగించెను. ఆంగ్లేయ దొరతనము వారి ప్రతినిధియగు రాష్ట్రాధిపతి పాట్రిక్ హెన్రి తెలిపిన విషయములు రాజద్రోహకరములైన

వని యెంచి శాసనసభను రద్దుపఱచెను. మరల శాసనసభకు నెన్నికలు జరిగినవి. ఇదివఱకు సభ్యులుగా నున్నవారే మరల నెన్నుకొనఁబడిరి. ఈ పరియు వారు బ్రిటిషు రాజ్యాంగము వారి చర్యలను ఖండించి మాటలాడిరి. జార్జి వాషింగ్టను సైతము వారితోఁ జేరియుండెను అయినను బ్రిటిషు రాజ్యాంగమువారు తాము పట్టిన పట్టు వదలక అమెరికావారి ప్రార్థనములను బెడచెవిం బెట్టిరి. అమెరికావారును దమ యుద్దేశము నే మాత్రమును మార్పఁగూడదని తీర్మానించుకొనిరి. ఇందుచే బ్రిటిషువారికి వ్యాపారసంబంధములగు ననేక నష్టములు సంభవించినవి. వెంటనే బ్రిటిషు వణిజులు మిగుల భీతిఁజెంది, యమెరికా వారివలనఁ దమకుఁ దటస్థించిన నష్టములం గూర్చి బ్రిటిషు ప్రభుత్వమువారితో మొఱఁబెట్టుకొనసాగిరి. కావున బ్రిటిషు రాజ్యాంగమువారు తేయాకుపైఁ దప్పఁ దక్కిన సరకులపై విధించియుండిన సుంకములను దొలఁగించిరి. అయినను అమెరికావారు దానితోఁ దృప్తినొందలేదు. అమెరికా వారు తమకు బ్రిటిషు పార్లమెంటునందు ప్రతినిధి స్థానము నొసఁగనిచో నే విధమగు పన్నును జెల్లింప వీలుగాదని స్పష్టముగఁ దెలిపిరి. విషయము లిట్లుండ తేయాకుపై విధింపఁబడిన పన్నుమాత్రము బ్రిటిషువారు తొలఁగింపమిచే, వారి కమెరికా వారిపైఁ బన్ను విధించు స్వాతంత్ర్యమున్నదని రూఢియగునట్లుండెను. కావున నమెరికావా రా పన్నును దొలఁగింపఁ బోరాడిరి. ఇట్లు వా రెదిరించి పోరాడుటలో నింగ్లండునుండి సరకుల నెగుమతిచేసికొనివచ్చిన యోడ లమెరికా రేవులకుఁ

జేరి సరకులను దింపి ఇంగ్లండునకు మరలినవి. ఒక యోడ మాత్రము మరలిపోక తేయాకు మూటలతో "బోస్టను" రేవునం దుండినది. దానింగాంచిన బోస్టను వాస్తవ్యులోక కొందఱు శోణ హైందవులపోల్కి వేషములను ధరించి యా యోడలోఁ బ్రవేశించి యందలి తేయాకు మూటలను దీసి సముద్రమునఁ బాఱవైచిరి. పిదప బోస్టను నగరవాసులు బ్రిటిషు సైనికులుండినస్థలము నాక్రమించుకొని, దాని వదల కుండిరి. అందుచే నమెరికా ప్రజలపై బ్రిటిషు రాజ్యాంగ మున కప్రియము జనించెను. వెంటనే అమెరికా వారికి నాంగ్లేయులు తమవలననైన కీడులనన్నిఁటి నొనర్ప నాలోచించిరి. అందుచేత నమెరికా వారికి బ్రిటిషు వారిపై నేర్పడిన మన స్తాపము మఱింత ప్రబలమాయెను. అమెరికా నాయకులు, తమకు బ్రిటిషువారిపైఁగల యవిశ్వాసముం బ్రకటించుటకు అక్కడక్కడ సభల నొనర్చి ప్రజల కెల్లరకును దమ న్యాయమును బ్రిటిషువారి వైఖరియు వివరించి యుపన్యసించిరి. మఱియు, వారు తమ పక్షమునకు సలుపుచున్న యపకారముల నుండి తమ్ము రక్షింపవలయునని భగవంతునిఁ బ్రార్థించిరి. అమెరికావా రూరేగింపులు మున్నగునవియు జరిపి యాంగ్లేయులపైఁ దమకుఁ గల యసమ్మతిం బ్రకటించిరి. అంతియ కాక, వారు తమ కే బ్రిటిషు రాజ్యాధికారిపై ననిష్టముగలిగెనో యట్టివాని నవమానింప దొరకొనిరి. వారు తమ కప్రియముం దలఁచిన బ్రిటిష్ రాజ్యాంగనాయకులవలెఁ బ్రతిమలం గల్పించి, వాని మూరేగించుచు నవమానపఱచిరి. ఇందు

చే బ్రిటిష్ వారి కమెరికావారిపై నెక్కుడు కోప ముప్పతిల్లెను ఏతత్కారణమున వారు బోస్టన్ నగరమున కే నౌకయు రాకుండునట్లు బోస్టన్ రేవును మూసివైచిరి.

తరువాత నమెరికావారు 1774 సం॥రము సెప్టంబరు మాసము 5-వ దినమున ఫిలడెల్ఫియా నగరమున సమావేశమయి, తమ దేశాభివృద్ధి విషయములంగూర్చి యాలోచించిరి. మఱియు వా రాంగ్లేయ రాజ్యాంగము వారికొక లిఖిత విజ్ఞాపనము మూలముగఁ దమ కోరికలం గూర్చి విన్నవించుకొనిరి. కాని, యీ విజ్ఞాపనము లక్ష్యపెట్టఁ బడలేదు. అయినను నమెరికావారి విషయమున మొదటి నుండియు సానుభూతిం జూపుచుండిన "లార్డ్ సాథ" మను ప్రభువు "అమెరికా వారికి పార్లమెంటులోఁ బ్రాతినిధ్య మొసంగక, వారిపైఁ గ్రొత్త పన్నులను విధించుట తగ" దని స్పష్టముగ వచించెను. కాని, యాతఁడుచేసిన హితబోధనము బధిరునకు శంఖారావమువలె వ్యర్థమయ్యెను. బ్రిటిషు అధికారు లమెరికావారి మొఱల నాలకించుటకు బదులు వారి నడంప వీరభటులతోఁగూడిన సేన నమెరికాకుఁ బంపిరి తమ పైకి నిట్లు సేన యంపఁబడుటంగాంచి యమెరికావా రత్యంత కోపావేశముంగొని బ్రిటిషు పార్లమెంటువారి ప్రతిభ యెంత సత్త్వముగలదో యొకపరి కనుఁగొనుటయే మేలని నిశ్చయించిరి. లెక్సింగ్టను, కాంకార్డు అను ప్రదేశములలో బ్రిటిషు సేనలకును, నమెరికా వారికిని బోరాటములు సాగెను.

లెన్సింగ్టనులోనే ప్రప్రథమమున నమెరికావారు తమ స్వాతంత్ర్య సమరమును జరిపిరి.

ఈ యుద్ధమైన తరువాత నమెరికావారు ద్వితీయ సమావేశముం గావించి యింకేమి చేయవలయు ననుటం గూర్చి చర్చించిరి. ఈమహాసభలో వాషింగ్టనును, ఆడమ్సును గూడ నుండిరి. వారు తమకుంగల పలుకుబడి మూలముగ నొక సైన్యమును సమకూర్చిరి. కట్టకడపట జార్జివాషింగ్టనే అమెరికా సైన్యమునకు నాధిపత్యము వహింప నేకగ్రీవముగ నెన్నుకోనంబడెను. వాషింగ్టను దళవాయి పదవిని బొందంగనే యందులకు సంబంధించిన కార్యములను గడు మెలంకువతో నిర్వహింప నారంభించెను. అతండు తన యోధవీరులకు "స్వాతంత్ర్యముం గాంచ నభిలషించుచో సమస్తకష్టముల నోర్పుమెయి సహింపవలయు" నని యుపదేశించెను. ఆ యుపదేశము ననుసరించియే వారును నడచుకొనిరి. వాషింగ్టను సేనకు సంబంధించిన యనేక సౌకర్యములం గలిగించి, యుద్ధానిం దగినచోట సిద్ధపఱచియుంచెను. బ్రిటిష్ వారు తమకుం జేంజిక్కిన యమెరికా యుద్ధవీరులం జెఱంబట్ట నారంభించిరి. దీని నమెరికావారు తీవ్రముగ ఖండించిరి. మఱియు బ్రిటిష్ వా రొనరించినట్లే వారును దమ కగపడిన బ్రిటిష్ సైనికుల బంధించుచుండిరి. బోస్టన్ ప్రదేశమున బ్రిటిష్ వారికి నమెరికా వారికిని యుద్ధము తటస్థించెను. ఈ యుద్ధమున నమెరికావారే జయముం గాంచిరి. అమెరికా (కాంగ్రెసు) దేశీయ మహాసభవారీ జయముం బ్రస్తుతించి, యందులకుం

గారకుఁడగు జార్జివాషింగ్టనునకుఁ దమ కృతజ్ఞతాభినందః ములు దెలిపి, యతనికొక బంగారుపిడిగల ఖడ్గమును బహూకరించిరి.

ఇంగ్లండ వాషింగ్టనును జెఱవట్టుటకై యాంగ్లేయులు దురాలోచనము లొనరింప నారంభించిరి. ఈవిషయము దెలియఁగనే, దురాలోచనపరులతోఁ జేరియుండిన యమెరికా దేశీయుఁ డొకఁడు మరణదండనముం బొందెను. అమెరికా వారిఁక మౌనధారణము కార్యకారికాదని గ్రహించి జనరల్ వాషింగ్టనునకుఁ బెద్దసేన నొకదాని నొసఁగి పంపిరి. అంతియ గాక వారు, తమకును బ్రిటిష్ వారికిని నిఁకమీఁద నేలాటి సంబంధములేదని తీర్మానించిరి. 1776 సం॥రము జూలై నెల నాలుగవ దినమున వారు పైఁజెప్పిన తీర్మానముం గావించిరి. అది మొద లమెరికావారు స్వాతంత్ర్యముం గాంచిన వారైరి. అమెరికావారు, న్యూయార్కు నగరము బ్రిటిష్‌వారి స్వాధీనము గాకుండుటకుఁ దగు కట్టుదిట్టముల నొనరించిరి. అప్పు డొక సేనాశాఖకు నధిపతియగు నొకఁడు, తన సేనావీరులు తమచేఁ బైకెత్తఁబడుటకు సాధ్యము కాని యొక దూలము నెత్తుటలో మిగులఁ బ్రయాస పడుచుండుటఁ జూచియు, వారికి సహాయపడుటకు మాఱు, వారిపైఁ దన యధికారముం జెల్లించుచుండెను. అప్పు డటకు వచ్చిన జనరల్ వాషింగ్టను ఆ సేనానాయకుం గాంచి "అయ్యా! ఈభటు లింతకష్టపడుచుండఁగా, వారికిఁ దాము సహాయపడరాదా?" యని ప్రశ్నించెను. వాషింగ్టను సర్వ సేనానాయకుఁడు ధరించఁ

దగిన యుడుపులతో నప్పు డుండక, సామాన్యములగు నుడుపుల తోడనే యుండినందున నతఁడు "వాషింగ్ట" నని యా దళవాయి గ్రహింపఁ జాలకపోయెను. కాన నతఁడు తన్నుఁ బ్రశ్నించిన వాఁడొక సామాన్యుఁడని భావించి, తన యధికారధోరణిం బ్రకటించుచు "నేనొక దళమున కధిపతినని నీ వెఱుఁగవా? అట్టి నే నెందులకు వీరికిఁ దోడ్పడవలయు" నని ప్రత్యుత్తరమిచ్చెను. అపుడు జనరల్ వాషింగ్టను ఆదళనాయకుని తెలివిలేమికి వగచి, యతనితో "నయ్యా! నే నెఱుకలేమిఁ దమ్మిట్లు ప్రశ్నించి నందులకు నన్ను క్షమింప వేఁడుచున్నా" నని వచించి, యాభటులతోఁ జేరి తాను నా దూలము నెత్తెను. తత్క్షణమే యాభటు లతని సహాయముతో నా దూలమును జేర్చవలసిన చోటికిఁ జేర్చిరి. పిమ్మట వాషింగ్టను ఆదళవాయిం దిలకించి "అయ్యా! ఇఁక నెప్పుడైనఁ దమకు సహాయము గావలసియున్నచో జనరల్ వాషింగ్టను ఇప్పుడు సహాయపడినట్లే సహాయ పడఁగలఁడు. అయినఁ దమకు మనుష్య సహాయము గావలసినప్పుడు తామాయనకుఁ జెప్పిపంపుఁడు" అని చెప్పెను. ఆమాట లాలించిన యా సేనాపతి, తనయెదుటనున్న యతఁడు వాషింగ్టనని గ్రహించి దిగులొంది తన యపరాధమును మన్నింపఁ బ్రార్థించెను. వాషింగ్టను సయితము తనపదవికిఁ దగిన ట్లతని మన్నించి కాచి, యతనికిఁ దగినరీతి నుపదేశించెను.

అమెరికావారు, తమకును నాంగ్లేయులకును నేవిషయమునను సంబంధముండఁ గూడదని తీర్మానించు కొనిరికదా!

దానికిఁ దగినట్లే యమెరికా వా రాంగ్ల రాజ్యాం గాధికారము నకు లోఁబడకుండునట్లు తగిన ప్రయత్నము లొనర్చు కొను చుండిరి మొట్ట మొదట నమెరికా వారికిని బ్రిటిష్ వారికిని నప్పు డప్పు డీ విషయమయి కలహములు సాగుచునే యుం డెను. అయినను నమెరికా వారు తమ కార్యసాధనమునందు నెక్కువ పట్టుదలతోఁ బోరాడుచుండిరి అట్టి పోరాటమున విజయమునకు హేతు భూతుఁడు జార్జి వాషింగ్టనే. అతని నిరంతర దీక్షచేతను, నపరిమిత త్యాగము చేతను నమెరికా వారు ధైర్య స్థైర్యములతోఁ బ్రిటిష్ వార నెదిరించి పోరా డిరి. అట్టి మహా పురుషుఁడే యొకఁ డమెరికా వారి పక్షమున నిలిచి పనిసేయకుండియున్నచో వారి ప్రయత్నములు సఫలీ కృతములై యుండవు. వా రింగ్లాండు వారిని జయించి యుండ లేరు. సమయమునకుఁ దగినట్లు భగవత్సహాయమును నమె రికా వారికిఁ బూర్ణముగ నుండెను. "తా నొకటి తలఁచిన దైవ మొకటి తలఁచు" ననుట తథ్యము. బ్రిటిష్ వారొకటి తలఁచిన, నది మఱియొక విధముగ నెఱవేఱినది.

'ట్రెంటు' నను చోటను, ప్రిన్సుట నను ప్రదే శమునను పోరాటములు జరిగినవి ఆ యుద్ధములలోను నమె రికా వారే గెలుపు నొందిరి. వాని తరువాత నడచిన కొన్ని చిన్న కలహములలో నమెరికా వారి కపజయము కలిగెను. అయినను నమెరికా వారు దానిని లక్ష్యపెట్టక, తమ కార్య ము సాధించుకొనుట యందే యెక్కువగ దృష్టి నిలిపిరి.

జనరల్ "పర్‌కాయ" ననునతఁ డమెరికా ఖండ

ములోని యుత్తర దిక్కునం దుండిన బ్రిటిష్ సైన్యములకు నాయకుఁడుగ నుండెను. అతఁడు తనకు దక్షిణ భాగమునుండి సహాయము లభించునని విశ్వసించి యుండెను. కాని బ్రిటిషు రాజ్యాంగాధికారులు సల్పిన కొన్ని యకార్యముల వలనఁ దగు సమయమున నతఁడెదురు చూచిన స్థానానికి సహాయము కలుగలేదు. కావున నతఁడు చతుస్సహస్ర సేనా వీరులతోడ "సారటోగ" యను చోట నమెరికా వారిని శరణుజొచ్చెను. దీనితో నమెరికా వారికిని బ్రిటను వారికిని గలిగిన సంఘర్షణ మొక విధముగ ముగిసిన దనవచ్చును. బ్రిటిషు సేనలు 'సారటోగ' యొద్ద నమెరికా వారితో సంధిజేసి కొన్నంతనే ఫ్రెంచి వారును స్పానిషు వారును నింగ్లండునకు విరోధముగ నమెరికా వారితోఁ గూడిరి. ఫ్రెంచివారి నౌకా సైన్యము అమెరికా వారికి సహాయపడెను. అందుచే బ్రిటిషు వారు కావలసినంత సైన్యమును అమెరికాకుఁ బంప నశక్తిగా దయ్యెను. సముద్రములో ఫ్రెంచివారి యుద్ధ నౌకల ప్రాబల్యమధికముగ నుండెను. ఇట్లుండ యార్కుటవునులోని కారన్ వాలీసునకు తగినంత సహాయము లభింప మార్గాంతరము లేక పోయెను. కావున నతఁడు మొలకువతో నమెరికా వారిని శరణు జొచ్చెను. ఇంతతో నమెరికావారి యుద్దేశము సంపూర్ణముగా సఫలీకృత మాయెను.

సారటోగ, యార్కుటవు నను నీరెండు స్థలముల లోను శరణమొందిన తరువాత, బ్రిటిషువారింకను యుద్ధము చేయుట యుక్తము కాదని గ్రహించి సంపూర్ణ సమాధాన

మునకుఁ ద్రోవ వెదకుచుండిరి. కట్టకడకు బ్రిటిషు వారికిని నమెరికా వారికిని సమాధాన మేర్పడినది. ఈ సమాధానము ననుసరించి బ్రిటిషువారు అమెరికా సంయుక్త రాష్ట్రముల యందు స్వాతంత్ర్యము నంగీకరించిరి. అమెరికా వారికిని బ్రిటిషు వారికిని నడచుచుండిన పోరాట మేడు సంవత్సరములకుఁ దరువాత నొక విధముగ నంతము నొందెను. ఈ పోరాటముచే గ్రేటు బ్రిటనునకుఁ బది కోట్ల పవునులు నష్టమేర్పడినది, లక్షప్రజలు యుద్ధములో మడిసిరి. ఇంతటి నష్టము సంభవించినను వారి కొక్కలాభమును జేకూరలేదు. అమెరికాకును నధిక ద్రవ్యప్రజానష్టము కలిగెను. దాని నంతయు లక్ష్యముచేయక సమస్త నష్ట కష్టములను శాంతముతో సహించి తుట్టతుదకు వారు తమ మనోరథమును బరిపూర్తి నొందించుకొనిరి. సంధి కుదిరిన తరువాత జార్జివాషింగ్టను తన పదవిని వదలి కాంగ్రెసు వారి యాజ్ఞనొంది స్వగ్రామముఁ జేరెను. కాంగ్రెసు సభ్యులు జనరల్ వాషింగ్టనును నతని సైనికులను మిగుల పొగడి తమ యానందమును వెలిబుచ్చిరి. తన స్వగ్రామమును జేరిన జనరల్ వాషింగ్టను తన భవనములను భూములను నుత్కృష్ట స్థితికిఁ దెచ్చుటలో నెక్కుడు శ్రద్ధగైకొను చుండెను. మఱియు నతఁడు శాస్త్ర సంబంధములగు విషయములలోను నెక్కుడు పరిశ్రమచేయ మొదలిడెను.

## ౯. ఉన్నత పదవియు అవసాన దశయు.

జనరల్ వాషింగ్టను అమెరికా కొనరించిన యత్యంతో త్కృష్టమగు సేవకయి, యతనికి నాల్గువేల డాలర్ల విలువగల సొత్తులను సన్మానముగా నొసంగ వలయునని యమెరికా శాసన సభవారు తీర్మానించిరి. ఈ విషయము వాషింగ్టను నకుఁ దెలియఁగనే, యతఁడు తనకుఁగల దేశాభిమానముచేఁ, దనవలన నైన దేశసేవ యొక్కింత చేసితిననియుఁ, బ్రతిఫలా పేక్షతో నట్టికార్యముఁ జేసినవాఁడఁ గాననియుఁ, గావున నే విధమగు బహుమతియుఁ దా నంగీకరించుట కిష్టపడ ననియు నెఱిఁగించెను. మఱియు నతఁడా యాస్తితోఁ గళాశాలను స్థాపించినచో మంచిదని తెలిపెను. అమెరికా శాసన సభవా రతఁడు వచించి నట్లే యా సొత్తులనుండి వచ్చినధనమును విద్యా వ్యాపకమునకే వినియోగించిరి. ప్రస్తుతము కొలంబి యాలోనుండు వాషింగ్టను కళాశాల (College) యా ద్రవ్యము మూలముగ నేర్పడినదే.

పిదప నమెరికా వారు తమ రాజ్యపరిపాలనార్హతకు నిదర్శనముగ జార్జివాషింగ్టనును అమెరికా సంయుక్తరాష్ట్ర ములకుఁ బ్రథమాధ్యక్షుని (President) గ నెన్నుకొనిరి. అతఁడు బాల్యము నుండియే యేకార్యమునుగాని యుక్త కాలమునఁ గావించు నాచారముఁ గలవాఁడగుటచేఁ, దా నధ్యక్షుఁడయిన పిమ్మటఁ గూడ నా వాడుకను వదలక వర్తించుచుండెను. నియమిత కాలము పూర్తి కాఁగానే మరల రెండవ పర్యాయము సహిత మతనినే ప్రజ లధ్యక్ష

పదవి కెన్నుకొనిరి. అతఁడు ప్రజోపయోగకర కార్యము లొనరించుటలో నద్వితీయుఁడు అతఁగు "సివిల్ సర్వీసు" సంబంధమైన విద్యాభి వృద్ధికిని, కానిసల వ్యాపారము నిలుపుటకును దగిన ప్రయత్నము లొనరించెను

ప్రజలు మూఁడవసారియు నతని నే యధ్యక్షునిగ నెన్నుకొనఁ జూచుచుండిరి. కాని, జార్జి వాషింగ్టను ఇదివఱకుఁ దానధ్యక్షుఁడుగ నుండి చేసిన ప్రజా సేవతో సంతృప్తినొంది, తన జీవిత శేషమును స్వగ్రామమునఁ గడుప నెంచి యటకరిగెను. ఒక నాఁ డతఁ డేదో పనిమీఁద వెడలి వర్షమునఁ దడిసి యింటికి వచ్చి చేరెను. అందుచే నతనికి జ్వరము సోఁకి, యెన్ని చికిత్సలు సలిపినను నిలువక, తుద కతనికి మృత్యుసాన్నిధ్యముం గల్పించెను.

జనరల్ వాషింగ్టను యొక్క నిర్యాణ వార్త నాలించిన యమెరికా వాస్తవ్యులు దుఃఖసాగరమున మునిఁగిపోయిరి. లోకములోని తక్కిన భాగముల యందలి ప్రజలును నతని మరణమున కయి మిగుల వగచిరి.

జనరల్ వాషింగ్టను యొక్క భౌతికశరీర మదృశ్యమయినను, నతని యాత్మ మాత్రము ప్రజలలో వ్యాపించి నిజమగు దేశాభిమానమును గార్య దీక్షను గల సార్థక జీవులను నొనరించుచున్న దనుట సత్యము.

---

# 2. ఆబ్రాహాము లింకను.

౧ బాల్యము

ప్రపంచమున యశోగౌరవముల నార్జించిన మహా పురుషులలో ననేకులు దమ బాల్యదశయందు నిప్పచ్చరమను రుజచేఁ బీడింపఁబడి యనేకకష్టముల ననుభవించి, తుదకు స్వప్రయత్నములచేఁ బ్రజల మెప్పుఁగాంచి, యున్నత పదవులఁ బొందిరనుటయం దసత్యము లేశమైన లేదు. అందులకీ "యాబ్రాహాములింకను" చరిత్రమే ప్రబలతార్కాణము.

మన కథానాయకుండగు "నాబ్రాహాములింక" నను నతఁ డమెరికాలోని కెంటకీ రాష్ట్రమందలి "హార్డి" నను ప్రదేశమున క్రీ॥ శ। 1809-వ సంవత్సరము ఫిబ్రవరి మాసము ప్రథమ దివసమున జననమందెను. అతని జనకుని పేరు "థామస్ లింకను". అతని జనని నామము "నాన్సి హాంక్సు". ఆబ్రాహాములింకను ప్రపితామహుఁడు ప్రప్రథమమున వర్జినియాలో వసించుచుండెను. అతని పూర్వులమెరికా యాదిమ నివాసులగు శోణ హైందవులచేఁ బొందిన కష్టములకు మితిలేదు. ఆబ్రాహాము లింకను పితామహుఁడీ శోణ హైందవుల నిశిత విశిఖంబుల కెఱయాయెను. అక్కాలమున నమెరికాయందీ శోణ హైందవుల ప్రాబల్యమెక్కుడుగ నుండెను. ఆబ్రాహాము లింకను శైశవమున

నున్నప్పు డతనితండ్రి యతని కప్పుడప్పుడు శోణ హైందవుల భయంకర కృత్యములంగూర్చి చెప్పుచుండువాఁడు. వాని నాలించునపుడెల్ల నాబ్రాహాములింకను తన ప్రపితామహాదులకు శోణ హైందవులచేఁ దటస్థించిన యాపదలం దలంచి మిగుల వగచువాఁడు. ఈ శోణ హైందవులు శ్వేతముఖులు వసించు ప్రదేశముల కరుదెంచి వారికిఁ గీడుఁ గావించుటయ కాక, వారి శిశువులను సయితమెత్తికొని పాఱి పోవువారు.

అబ్రాహాములింకను తండ్రి మొట్టమొదటఁ బడవ నడపువాఁడుగ నుండెను. తరువాత నతఁడు వడ్రంగమును నేర్చికొని, దానివలన వచ్చినవరుంబడితోఁ దనకుటుంబమును బోషించుకొను చుండెను. అతనికి వ్రాయుటకును జదువుటకును దెలియదు. కాని యతని సతీమణికి మాత్రము కొలఁదిగఁ జదువుటకును వ్రాయుటకును దెలియును. ఆమె మూలముగ నామె భర్త కొంతకాలమునకుఁ జదువుటకును వ్రాయుటకును నభ్యసించెను. అబ్రాహాములింకను యొక్క మాతాపితలఁగూర్చి మన మెఱుంగవలసిన దింతియ. అబ్రాహాము చిన్నతనమునఁ దన కాలమును మత్స్యములు పట్టుటయందును, నల్ప జంతువులను వేఁటాడుటయందును వినియోగించుచుండెను.

అబ్రాహామునకు, విద్యాభ్యాసమున కుచితమగు వయసు వచ్చినది. వెంటనే యతని తలిదండ్రు లతనిని దమ యూరఁగల యొక పాఠశాలకంపిరి. ఆ పాఠశాలోపాధ్యాయుఁ డంత సమర్థుఁడుగాఁడు. అతనికిఁ జదువుటకు వ్రాయు

టకు వచ్చును. కాని, లౌకిక జ్ఞానము చాలఁ దక్కువ. అయినను, "నిరస్తపాదపేదేశే ఏరండోపి ద్రుమాయతే" యన్నట్టులాయూర నతఁడే విద్వాంసుఁడు. కొన్నాళ్లకా బ్రాహాము పాఠశాలను వదలి మఱియొక బడి కేఁగెను. ఈ క్రొత్త పాఠశాల యతని గ్రామమునకు నాలుగుమైళ్ల దూరములో నుండెను. అయినను దూరమని యెంచక యా బ్రాహామనుదిన మా విద్యాలయమున కరిగి చదువుకొను చుండెను. అబ్రాహాము క్రైస్తవ వేదమగు 'బైబిలు'ను జదువ నారంభించెను. అతనికా గ్రంథస్థ విషయములయం దత్యంత విశ్వాస మేర్పడెను. బైబిలునం దతఁడు చదివిన విషయము లతనికి వెనుకటి కాలమున నెంతయో యుపయోగించెను.

అబ్రాహాము లింకను తండ్రి యింతలోఁ దామున్న యూరువదలి మఱియొక యూరుఁ జేర నెంచి తమ సరకుల నెల్లఁ ఒడవలోఁ జేర్చుచుండఁ, బడవ బోర్లపడి సామానులు లన్నియు నదీజలములం గలసెను. పిదప వానికొఱ కెంత ప్రయాసపడినను నందొక్కటియు లభింపలేదు. అబ్రాహాము జనకుఁడు తాను క్రొత్తగఁ జేరిన గ్రామమున నీరు దొరకక కష్టపడవలసి వచ్చెను. అబ్రాహాములింకను తల్లి దైవ విశ్వాసముగలది యగుటచే, నామె కా గ్రామమున నగపడిన త్రాగుడు మొదలగు దురాచారములు పట్టలేదు. వారు క్రొత్తగాఁ జేరిన ప్రదేశమునందలి జను లీ దురాచారమున కగ్గమై యుండుటంగాంచి యామె మిగుల విచారపడెను.

ఆబ్రాహాములింకను దుపాకిఁ జేఁబూని యరణ్యములకరిగి తమ యాహారమునకుఁ గావలసిన మృగములను బక్షులను వేఁటాడి తీసికొని వచ్చువాఁడు. ఒకనాఁడతఁడొక యెడఁ గూడియుండిన కొన్ని యడవి కోళ్లను గాల్చెను. ఒక పెద్దవనకుక్కుటం బతనికి లభించెను. దాని నింటికిఁ దేఁగనే యాతని తలిదండ్రు లెంతయు సంతసించిరి.

---

## ౨ మాతృవియోగము.

ఆబ్రాహాము లింకనునకుఁ గాలక్రమమున విద్యయం దభిరుచి యెక్కువగుచు వచ్చెను. అతనికడ బైబిలు తప్ప వేఱొండు పుస్తకము లేదు. ఇట్లుండ బిల్లలకు సంభవించు నొకానొక వ్యాధి యతనికిఁ గన్పట్టెను. అందుచే నతఁడు చాల బాధపడెను. తుదకతని కీశ్వరకృపచే నా వ్యాధి తొలఁగెను. అతని కుత్తమవంశ జాతులగు నాలుగు రిరువురు పరిచయులైరి. ఈ దంపతుల కాకస్మికముగ జబ్బుచేసెను. అప్పుడాబ్రాహాములింకను తనవలన నైన సకలోపచారము లొనరించెను. కాని, దైవచిత్తము వేఱువిధముగ నుండి నందున వారిరువురును స్వర్గతులైరి. వారట్లు మరణించుటచే నాబ్రాహాములింకనున కలవికి మీఱిన కష్టము లేర్పడినవి.

ఆబ్రాహాములింకను బాల్యమున నుండగనే యతని ప్రియమాత రోగగ్రస్తురాలై పడకఁ బట్టెను. పాపమా బ్రాహామేమి సేయఁగలఁడు? అతఁడు భక్తితో దేవునిఁ బ్రార్థించెను. అతని పొరుగువారు తమవలన నైనంతవఱకు కా

బ్రాహాము కుటుంబమునకు సహాయ మొనరించిరి. అయిన నేమి? పరమేశ్వరుఁ డాబ్రాహాము జననిని దన సన్నిధానము నకుఁ జేర్చికొనెను. తన తల్లి విగతజీవ కాఁగానే యా బ్రాహాములింకను, ఆమెనుగూర్చియుఁ, దన స్థితినిగూర్చియు నా యూరనుండు మతబోధకున కొక లేఖ వ్రాసెను. అందలి విషయములంగాంచి యా మతగురువును నా యూరివారును నాబ్రాహాము వినయ సౌహార్ద్రముల కెంతయు మెచ్చు కొనిరి ఆ మతగురు వాబ్రాహాము నింటికే తెంచి జరపవల సిన మత సంబంధములగు కర్మలు జరపఁగనే, యాబ్రాహాము జనని కళేబరము సమాధి చేయఁబడెను. అట్టి సమయమున నా మతబోధకుఁ డాబ్రాహాము జననిం గూర్చియు, నామె సుగుణ సంపత్తింగూర్చియుఁ బ్రస్తావించుచు, నాబ్రాహామును సయితము మెచ్చుచు "నిట్టి సంతతింగాంచిన తలిదండ్రులే యదృష్టవంతు" లని నుడివెను.

అమెరికాకు వలస వచ్చిన వారిలో మొట్టమొదటి వారు మతబోధకులు. వారటఁ దాము నివసించు స్థలము లలో నుండు జనుల కనేక సౌకర్యములను గలిగించిరి. వారు దిక్కులేని వారిని జేరఁదీసి కాపాడుచుండిరి. ఈమతగురువు లెవ్విధమగు ప్రతి ఫలాపేక్షయు నాసింపక క్రీస్తు నామముం బ్రకటించుచుఁ బ్రజలలో దైవభక్తి శ్రద్ధలను బెంపొందిం చుచు వచ్చిరి. వీరొనర్చు ప్రతికార్యమును బ్రజల కుత్సాహ జనకములుగను మార్గ దర్శకములుగను వెలయుచుండెను.

## 3 మతోపదేశకుల మైత్రి

అబ్రాహాములింకను తన బాల్యమున మతబోధకుల సంఘమునఁ జేరి, వారి యుపదేశములను వినుచుండెడివాఁడు. ఆ మతబోధకులు బాలురకు విద్యనుగూడఁ గఱపుచుండిరి.

అబ్రాహాములింకను తన జనకునితోఁ గూడఁ దమ క్షేత్రములలోని పనుల గమనించుచును, దక్కిన సమయముల యందు "పిల్ గ్రిమ్స్ ప్రోగ్రస్ (Pilgrims Progress)" అను పుస్తకమును, "ఈసప్స్ ఫేబుల్స్ (Aesopes Fables)" అనుగ్రంథమును జదువుచుండెడి వాఁడు. కాలక్రమమున నతని కాపుస్తకములపై నెంతయు నపేక్ష యధికమాయెను. అప్పుడాతని తండ్రి తనకుమారుఁడు కార్యముల నుపేక్షించి గ్రంథ పఠనమే యొనర్చుచుండినచో సోమరి యగునని తలంచి, యప్పుడప్పు డతని మందలించుచుండెను. అయినను నాబ్రాహాము తనకు విరామము లభించినపుడెల్ల పుస్తక పఠన మొనర్చుచునే యుండెను. పైఁజెప్పిన రెండు పొత్తములు నతని కమితోత్సాహ జనకములుగ నుండెను. అతఁ డొక్క క్షణకాలమైనను వ్యర్థపఱచినవాఁడు గాఁడు. పొలములలోఁ బనిసేయు చున్నప్పుడతఁడు తనకుఁదెలియని పదములను నేల మీఁద వ్రాసికొనుచుండు వాఁడు. అది కని యటనుండు తోడి పనివా రబ్బురమందువారు. ఒక్కొక్కప్పుడు వారు దానిం గూర్చి యాబ్రాహాములింకను నడుగువారు. అట్టియెడ వారి కాతఁడు దగురీతిఁ బ్రత్యుత్తర మొసఁగి వారికి సంతసముఁ గలిగించువాఁడు.

అబ్రాహాములింకను కొన్ని పుస్తకములం జగువఁగ నే పై పై నింకను జదువ నాస వొడమెను. ఇట్లుండ, నతని గృహమునకు సమీపమున నొక కమ్మరి, కొలిమిఁ బెట్టికొని యుండెను. అట కాబ్రాహాము లింకను తఱచుగా నేఁగుచుం డువాఁడు. అట్టియెడ నా కమ్మరి యాబ్రాహాము లింకను న కనేక కథలఁజెప్పవాఁడు. వాని నాబ్రాహాము శ్రద్ధతో నాలించువాఁడు. ఒక్కొక్కప్పు డాబ్రాహా మాతని కథల చే సంతుష్టుఁడై కమ్మరిపనులలోఁ నాతనికిఁ దోడ్పడువాఁ డు. ఇట్లతఁడను దినము తనకుఁదీరినపుడెల్ల నా కమ్మరి వాని దుకాణమున కరిగి యాతఁడు వచించు కథలను వినుచుండు వాఁడు. ఆ కమ్మరికిని బిల్లలయెడ నమితప్రేమ.

ఇట్లుండ నాబ్రాహామునకు "రామ్సే" యను నతని చే రచింపఁబడిన "వాషింగ్టను" చరిత్ర మొందు ప్రతి లభిం చెను. దాని నమితోత్సాహముతో నతఁడు పఠించి యందలి యనేక విషయములను గ్రహించెను. తరువాత నతఁడు "రాబిన్సన్ క్రూసో" యను కథా పుస్తకమును గూడఁ జదివెను. దానియం దతని కత్యంతాపేక్ష యగుట చే, నాతఁ డద్దానిని బలుసారులు చదివెను.

ఆబ్రాహాము లింకను జనని పరమపదించెను గదా! గృహ కృత్యములు నిర్వర్తించుట కెవ్వరును లేనందున నా బ్రాహాము జనకుఁ డొండొక సతింబరిణయ మాడెను. ఆమె యింతకు మున్నొకనిం బెండ్లాడి వితంతువయిన కాంత. కావున నా యమ కామె ప్రథమపతివలనఁ గలిగిన బిడ్డలుం

డిరి. అయినను నా సాధ్వి యాబ్రాహామును సయితము తన బిడ్డలలో నొకనిగనే భావించి పోషించు చుండెను. అబ్రాహామును దన సవతి తల్లియెడ మిగుల భక్తి విశ్వాసముల తోడనే మెలఁగుచుండెను. ఈమెయు నాబ్రాహాము తల్లి వలెనే విద్యావతిగ నుండెను.

---

## ౪. విద్యాభివృద్ధి.

అనంతర మాబ్రాహాము రెండు విద్యాలయములలోఁ జదివెను. అతఁడన్ని పాఠములలోను బ్రథముఁడుగ గణింపఁబడుచుండెను. అందుచే నుపాధ్యాయులెల్ల రాతని విషయమున నెంతయు సంతస పడుచుండిరి. "గ్రాఫోర్డు" అను నతని పాఠశాలలో నాబ్రాహాము లింకను విద్య నభ్యసించుచుండ, గ్రాఫోర్డతని బుద్ధి కుశలతకును, నుత్తమ గుణములకును బలుమఱు మెచ్చుకొనెడివాఁడు. మఱియు నతఁ డాబ్రాహాము భావికాలమున మహోన్నత పదవులంది కీర్తి నార్జించు ననియు వక్కాణించు చుండెను. అబ్రాహాము లింకను బాల్యము నుండియే సత్యము, భూతదయ, ధైర్యము, శ్రద్ధ, కార్యదీక్ష, సజ్జన సాంగత్యము మున్నగు సద్గుణములచేఁ బ్రకాశించుచుండెను. ఆ గుణపుంజ మతని వయసుతోఁబాటు నానాఁట వృద్ధిజెంది యతనికిఁ గీర్తిఁ గలిగించెను. గ్రాఫోర్డు విద్యాశాలలో నాబ్రాహాము చదువునపు డొకనాఁడు పాఠపాటునఁ బాఠశాలకు సంబంధించిన యొకానొక సాధనము

ను విఱుగఁగొట్టెను. దానింగాంచి యుపాధ్యాయు లాతనిఁ బ్రశ్నింప, నతఁడద్దానిఁ దానే విఱిచితిననియు, నవివేకముచే నొనరించిన తనతప్పును క్షమింప వలయుననియు వేడికొనెను. అబ్రాహాము వచించిన దాని నాలించిన యతని యుపాధ్యాయు లతని విషయమున మిగుల సంతసించి, యతని మన్నించి, యతని గుణములంగూర్చి యెంతయుఁ గొనియాడిరి.

అబ్రాహాము లింకను పాఠశాలయందు విద్యఁగఱచుచుండినపుడు వ్యాసముల నత్యుత్కృష్టముగ వ్రాయువాఁడు. వానింగాంచి, యుపాధ్యాయు లతనిని మిగులఁ బ్రేమించువారు. అతఁడే ప్రాణికిని నే విధమగు కీడు నొనరించెడి వాఁడు గాఁడు. ఇతరు లొనరించుచోఁ దాను వారిం బ్రార్థించి యట్టి దుష్కృత్యమునుండి విరమింపఁజేయువాఁడు. ఈరీతి సమస్త సద్గుణములచే భాసిల్లు తమ శిష్యుఁడగు నాబ్రాహామునుంగూర్చి గ్రాఫోర్డును దక్కిన యుపాధ్యాయులును నపుడపుడు బ్రస్తావించుకొనువారు. తోడి విద్యార్థులు తగవు లాడుచో నాబ్రాహాము తన బుద్ధి సామర్థ్యముచే వారి కలహములం దీర్చువాఁడు.

అతఁడు సర్వ సద్గుణముల కాటపట్టుగ నుండెను. అతని స్వభావముం గ్రహించిన వారాతని యెడ మిగుల విశ్వాసము గలిగియుండిరి. గ్రాఫోర్డు పాఠశాలను విడిచిపెట్టిన పిదప, నాబ్రాహామొండొక విద్యాలయముం బ్రవేశించెను. అది యాతని నివాసస్థానమున కైదుమైళ్ల దూరము

నందుండెను. కావున నాబ్రాహాము విద్యాశాల కరిగి వచ్చు టెంతయు శ్రమముగ నుండెను. అయినను విద్యయం దుఁగల యభిరుచిచే దూరమైనను శ్రమమైనను నతఁడు సర కు సేయకుండెను. ఒక సంవత్సరము గడచినది. ఈ లోపుననే యాబ్రాహాము, తన యుపాధ్యాయుని వలన నేర్చుకొనఁ దగిన విద్యనంతను నేర్చికొనెను. తరువాత నాబ్రాహాము పాఠశాల కేఁగుట మానివైచెను. అతని బంధుగులలో నొకఁ డగు "జాన్ హాంక్సు" అను నతనితో నతనికిఁ బరిచయ మేర్పడెను. ఆ పరిచయము దినదినాభివృద్ధి నొంది గాఢ మైత్రిగఁ బరిణమించెను,

ఒక దిన మాబ్రాహాము లింకను తన స్నేహితులతో నిష్టాగోష్ఠిగ సంభాషించు నవుడు జార్జి వాషింగ్టను ప్రస్తావ ము వచ్చెను. ఆబ్రాహాము హితులలో నొకఁడు "వీమ్సు" అను నతనిచే వ్రాయఁబడిన జార్జి వాషింగ్టను చరి త్రమును గూర్చి కొనియాడెను. దాని నాలించిన యా బ్రాహామునకు జార్జి వాషింగ్టను చరిత్రమును గొనిచదువ వలయునను నిచ్ఛ జనించెను. అతఁడప్పొత్త మెవ్వరికడ దొర కునని విచారించి తెలిసికొని, యది "జోస్యా క్రాఫోర్డు" అను నామముగల యొకనియొద్ద నున్నదని యెఱింగి, యాత నియింటి కోసానొక నడుచేయిపోయి, యాతనింగని, యా గ్రంథముం గొన్నాళ్లవఱకుఁ దనకుఁ జదువుట కొసంగఁ బ్రా ర్థించెను. ఆబ్రాహామునకు విద్యయందుఁ గల యపేక్ష కాతఁడు మోదమంది, యతనికిఁ దనయొద్దనున్న గ్రంథము

నొసంగి పంపెను. అబ్రాహా మా పుస్తకమును భక్తి శ్రద్ధలతోఁ జదువుచుండెను. ఒకనాఁ డతఁడు పుస్తకముం గైకొని తన పొలమునకేఁగి, యటఁ బనులం దీర్చికొని వచ్చు సమయమునఁ ద్రోవలో వర్షము దటస్థించెను. అపు డతని చేతిలోని పుస్తకము బూర్తిగఁ దడిసిపోయెను. దానిం గాంచి యతఁడు "పుస్తకాధికారికిఁక నేనెట్లీ గ్రంథమిత్తు" నని యెంతయుఁ జింతించెను. ఇంతలో గ్రాఫోర్డీ వృత్తాంతము నెఱింగి, కొంచెమేని దయాదాక్షిణ్యము లెంచక, నాబ్రాహాము కడకు వచ్చి, తన గ్రంథము నారీతిఁ జెఱిచినందుల కనేకవిధముల నతని నిందించి, తన గ్రంథమున కధికమగు క్రయముం గట్టి యీయ వలయుననియు, నట్లు కాదేనిఁ దాఁగోరిన పరిహారముం జెల్లింప వలయుననియు నాబ్రాహామును నిర్బంధించెను. అందుచే నాబ్రాహాము మూఁడెకరముల విస్తీర్ణముగల మైదానమందలి గడ్డిని సేకరించి పుస్తక క్రయమున కీడుగ నొసంగుటయ కాక, తానును దన సహోదరియు గ్రాఫోర్డు పనులను జేయవలసివచ్చెను.

గ్రాఫోర్డన్ని దుర్గుణములకును స్థానభూతుఁడుగ నున్నను, నతని గృహిణి మాత్ర మందులకు భిన్నముగ సమస్త సద్గుణములచే నొప్పారుచుండెను. ఆమె యాబ్రాహామునెడ నత్యంత వాత్సల్యము నెఱపుచుండెను. కావున నాబ్రాహామునకు వారియింటఁ బనిసేయుటయం దిసుమంతయుఁ గష్టము దోఁపకుండెను. గ్రాఫోర్డవగుణుఁడైనను నతనియొద్ద ననేకోత్తమ గ్రంథము లుండెను. వాని నాబ్రా

హాము తనకుఁ దీరినప్పుడెల్లఁ బఠించుచు వచ్చెను. చిన్నతనమునుండియు నతఁడు తన చేతికి దొరకిన పొత్త మేదియైనను విడువకుండఁ జదువుచు వచ్చుటచే నతనికి లక్ష్యజ్ఞానము మిక్కుటముగఁ గలిగెను. అట్టి గ్రంథ పరిచయ లబ్ధశబ్దజ్ఞానముచే నతఁడు చక్కని వ్యాసములను బద్యములను వ్రాయ నేర్వ గడించెను. వాని ననేకులు చదివి యాబ్రాహాము పాండిత్యమును వేనోళ్లఁ బ్రస్తుతింప సాగిరి. గ్రాఫోర్డు కడ నతఁడు బనిసేయుట జాలించిన యనంతర మతనిం గూర్చి పొగడుచు ననేక వ్యాసములను బద్యములను బ్రచురించెను. అందుచే గ్రాఫోర్డు పేరు ప్రసిద్ధి గాంచెను.

గ్రాఫోర్డు సతి యాబ్రాహామును దన గర్భమునఁ బుట్టిన పుత్త్రునివలెనే భావించి యాదరించుచుండెను అందుచే నాబ్రాహాము మాయింటఁ గల యెల్లరతోడను నెక్కుడు చనవుమీఱ భాషించెడు వాఁడు. ఒకనాఁడట్లు మాటలాడు సందర్భమున నతఁడు దనకుఁ దెలియకయే పెద్ద యెలుఁగునఁ బలుకుచుండెను. అప్పుడు శ్రీమతి గ్రాఫోర్డు అతనిం జూచి "యెందుల కట్లఱచెద" వని యడుగ, నతఁడు "నేనమెరికా సంయుక్త రాష్ట్రముల కధ్యక్షుఁడనయినచో మహాసభయందు బిగ్గఱగ మాటలాడవలసి యుండుటచే, నందులకిప్పటినుండియే యభ్యాసముం గావించు కొనుచున్నాఁడ" ననెను. ఆబ్రాహాము లింకనునకు బాల్యమునుండియే యున్నత పదవిం గాంచ నుద్దేశ ముండెను. కావున నతఁడు జిన్నతనమునుండియు మిగుల శ్రమపడుట కలవఱచుకొను

చుండెను ఒక్కొక్క దినమునం దతఁడు పదునాలుగు లేక పదునైదుగంటల కాలము పనిచేయువాఁడు. అతనికి జడస్వభావ మనునది లేదు.

అబ్రాహా మొకదినమునఁ గొంత ధాన్యమును బిండిగఁ జేసికొని వచ్చుటకై తన యశ్వముపై బయలు దేఱెను. పేషణ యంత్రముం జేరఁగనే యతఁడా యాజానేయము నొక భూజమునకుఁ గట్టివైచి, ధాన్యమును విసరించుకొన నరిగెను. కొంతతడవున కతఁడు తిరిగివచ్చి తన తురంగము నెక్కఁబోయెను. అప్పు డత్తేజి యతనిని వెనుక కాళ్లతో నొక్కతాఁపుఁ దాఁచెను. ఆ తాఁపుఁదగిలిన స్మృతియైన లేకుండ, నతఁడు వెంటనే నఱకివైచిన తరువుం బోలె నేలఁ గూలెను. సమీపముననున్నవా రాతఁడు మరణించియే యుండునని యెంచిరి. మరలఁ గొంతవడి కాతనికి స్మృతివచ్చి మెల్లగ లేచి, గుఱ్ఱము నెక్కి మందిరముం జేరెను

ఆ కాలమున నమెరికా సంయుక్త రాష్ట్రములలోని ప్రజ లంతగా విద్యావంతులు గారు. వారప్పటి కింకను నజ్ఞానాంధకారమున మునింగియుండిరి. వారు దయ్యములు, పిశాచములు, శూన్యములు మొదలగు వానియందు నమ్మకముం గలిగియుండిరి. వారికి మంత్రముల యందును, మంత్ర శాస్త్రజ్ఞుల యందును నమితాదర ముండెడిది. అజాది పశువ్రాతములకైనను వ్యాధులు సంభవించుచో వానిం బోగొట్ట వారు మాంత్రికుల నాశ్రయించు చుండిరి. వారు శకునములు సూచి కార్యముల నెఱవేర్చుచుండిరి. ఏకార్యము నారంభింప వలసి

యుండినను వారు దిన వార నక్షత్రశుద్ధి ముందుగా గమనించుచుండిరి. వారు ప్రకృతినే దైవముగాఁ జూచుచుండిరి. ముఖ్య కార్యములను శుక్రవారము నాఁడు చేయఁ గూడదని వారి సిద్ధాంతము.

తన చుట్టుపట్ల నిట్టి మూఢవిశ్వాసములు గల జనులే వసించు చుండినందున నాబ్రాహాము లింకనునకును నట్టి మూఢవిశ్వాసములు గొన్ని యలవడెను. అయినను నతఁడు ప్రతి విషయమును నామూలాగ్రముగఁ బరిశీలించు స్వభావముం గలిగియుండెను.

---

## ౫. జీవన మార్గములు

ఆబ్రాహాము లింకను పడవ నడపు నుద్యోగమునఁ గొంతకాల మమరియుండెను. తరువాత నతఁడు బన్నులు రాఁబట్టుకార్యమును జూచుచుండెను. అటుపిమ్మట నతఁ డొక యింటఁ బనివాఁడుగ నుండెను. ఈ రీతి నాతఁడు జీవనోపాయమున కేదేనొకపని సేయుచున్నను, దీఱుపాటయినపు డెల్ల నమెరికా సంయుక్త రాష్ట్ర చరిత్రమును జదువుచుండెడి వాఁడు. అక్కాలమున నతఁడు తన యజమానుని మానసమునే కాక, యతని పిల్లలఁ మానసములఁ గూడ నాకర్షించెను. అతఁడు వారి కత్యంత మిత్రుఁడాయెను. అయిన నాతఁడు రాత్రి చాలసేపువఱకు మేల్కొని చదువుచుంట యజమానుని పిల్లల కిష్టములేదు. తరువాతఁ గాలక్రమమున వారతని సుగుణాతి

శయముంగాంచి, యతని నెంతయుఁ బ్రేమించిరి. అతఁడు సర్వ కార్యములను మిగుల చాకచక్యముతో మెలఁగుచు పని చేయుచుండెను. ఇట్లుండ నతని సోదరికి వివాహము జరగెను. ఆ సమయమున నతఁడొక గీతముంబాడ, నటఁ జేరియున్న యందఱకును మహానంద మాయెను. నాఁటనుండి యతని ననేకులు గొప్ప గొప్ప సభల కాహ్వానించి, యతని పాటల విని యానందించెడి వారు.

అప్పుడు "జోన్సు" అను నొకఁడు చిల్లర దుకాణముం బెట్టికొని యుండెను. ఆ దుకాణమునఁ గొంత కాల మాత్రాహము పనిచేసెను. పలువిధములగు పనులలోఁ బ్రవేశముం గలిగించుకొని శ్రమపడిన వాఁడగుట నాత్రాహ మున కన్ని పనులును దెలిసియుండెను. కావున నతఁడొకపని కాకున్నను మఱియొక పనినైనఁ జేసి ధనము గడింప శక్తిఁ గలవాఁడుగ నుండెను. ఇట్లుండ నతఁడు "బెంజమిన్ ఫ్రాన్ క్లి" నను మహాపురుషుని జీవిత చరిత్రమును జదివి, యందలి విషయముల నెల్లఁ జక్కఁగ గ్రహించెను. మఱియు వార్తా పత్త్రికలను జదువుటకును నారంభించెను. అంతియు గాక రాజ్యాంగ విషయములను గుఱించి వీలయినపుడంత యుఁ దెలిసినవారితో వాదించుచుండెను. రాజకీయ విషయములలో నతని కత్యంతోత్సాహ మేర్పడెను. అతఁడు లోకులకుఁ దనవలననైన సహాయము నొనర్చుటలో వెనుదీయు వాఁడుగాఁడు. జోన్సు పలువిధములగు సరకులను విక్రయించు వాఁడు, కావున నతనికడ నమ్మకమునకు ననేక పుస్తకములు

గూడ నుండెను. వాని నాబ్రాహాము వీలయినపుడెల్లఁ జదు వుచుండెను. అట్టియెడ నతఁడు "హెన్రిక్లే" యను నతని జీవి త చరిత్రమును బఠించి యనేక క్రొత్త విషయములను గ్ర హించెను. తరువాతఁ గొంత కాలమున కాబ్రాహాము జోన్సు దుకాణమునఁ బని మానుకొనెను. కాని, యప్పు డప్పుడు పుస్తకములఁ జదువుకొనుటకై యాయంగడికిఁ బోవు చుండెను. అనేకులా దుకాణమునఁ గూడుట వాడుక. ఆప్పు డనేక విషయములంగూర్చి పలువురటఁ జర్చించుకొనుచుండెడి వారు. అప్పడాబ్రాహామును నందుఁ బాల్గొనెడివాఁడు.

ఒక నాఁడాబ్రాహా మా దుకాణమున కేఁగి, రాత్రి చాలసేపు వఱకుఁ బ్రొద్దుపుచ్చి, తానొక హితునితోఁగూడఁ దిరిగివచ్చుచుఁ ద్రోవలో నొకఁడొడలు దెలియక పడియుం డుటఁజూచి, వానికడ కరిగెను. వా డమితముగ మద్యపాన మొనరించి యందునఁ దన్నుఁ దానెఱుఁగని స్థితియందుండెను. వానియెడ నాబ్రాహాము జాలిఁగొని వాని నెత్తికొనిపోయి తగిన యుపచారము లొనర్పఁ దనమిత్రుని సాయముం గోరె ను. ఆ మిత్రుఁడతని మనోరథముం దీర్ప నిరాకరించెను. ఆబ్రాహాము వానిం గదలకుండునట్లు తన రెండు చేతులతోఁ బట్టి యెత్తికొనిపోయి సమీపముననున్న వేఱొక చెలికాని యింట బరుండఁబెట్టి, వానికిఁ గావలసిన యుపచారముల నన్నిఁటి నాతేయియెల్ల నొనరించుచుండెను. అతఁడారాత్రి యంతయు వాని సమీపముననేయుండి, మఱునాఁడు వేఁకువ ను వాఁ డొడలు తెలిసి యింటికరిగిన పదంపడి, తాను తన

గృహమున కేఁగెను. అబ్రాహాము తన చిన్నతనమునుండియే యనేక మతబోధకులతోఁ గలసియుండెడి వాఁడని వచించియుంటిమిగదా! అందుచే నతఁడు యుక్తవయస్కుఁ డయిన పిదప జనుల కనేక సదుపదేశములను జేయఁగలిగి యుండెను.

అబ్రాహాము తల్లి త్రాగుడు దురభ్యాసము నెడ మిగుల విముఖురాలని చెప్పియుంటిమిగదా! ఆమె వలెనే యాబ్రాహాము నాచెడునడవడియెడ నసహ్యాభావముం జూపుచు, దానిచేఁ గీడొందు జనులయొక్క పరితాపకరస్థితికై వగచుచు, దానిని రూపుమాపఁ దనచే నైనంతవఱకుఁ బ్రయత్నింప నారంభించెను. అట్టి ప్రయత్నము ఫలవంతమగు కాలమును సమకూడెను. ఆ విషయమయి యొక మహానుభావుఁ డదివఱకే ప్రచారము సేయుచుండెను. ఆతనితోఁ గూడ నాబ్రాహాము చేరి యా దురభ్యాసము మానునట్లు ప్రజల కుద్బోధింప మొదలు పెట్టెను. త్రాగుడును మాన్పుటకును, త్రాగుడుచేఁ గలుగు నాపదలను బ్రజలలోఁ బ్రకటించుటకును నొక పత్రిక స్థాపింపఁబడినది. ఆ పత్రికలో నాబ్రాహాము "లాహిరి" వస్తువులను వదలుటచేఁ గలుగు లాభములంగూర్చి తేఁటతెల్లముగ వివరించెను. రాజకీయ విషయములం గూర్చియుఁ బ్రజలలోఁ బ్రచారము సాగించుట కొక పత్రిక నెలకొల్పఁ బడెను. ఆ పత్రికకును నాబ్రాహామనేక రాజకీయ విషయములంగూర్చి వ్రాయుచుఁ బ్రజలకు వానియం దుత్సాహమును, శ్రద్ధయుఁ గలుగునట్లు గావించెను. మత్తు పదార్థములను బహిష్కరించుటకును, రాజకీయ

గూడ నుండెను. వాని నాబ్రాహాము పిలిచినపుడెల్లఁ జను
వుచుండెను. అట్టియెడ నతఁడు "హెన్రిక్లే" యను నతని జీవి
త చరిత్రమును బఠించి యనేక క్రొత్త విషయములను గ్ర
హించెను. తరువాతఁ గొంత కాలమున కాబ్రాహాము
జోన్సు దుకాణమునఁ బని మానుకొనెను. కాని, యప్పు
డప్పుడు పుస్తకములఁ జదువుకొనుటకై యాయంగడికిఁ బోవు
చుండెను. అనేకులా దుకాణమునఁ గూడుట వాడుక. అప్పు
డనేక విషయములంగూర్చి పలువురటఁ జర్చించుకొనుచుండెడి
వారు. అప్పుడాబ్రాహామును నందుఁ బాల్గొనెడివాఁడు.

ఒక నాఁడాబ్రాహామా దుకాణమునకేఁగి, రాత్రి
చాలసేపు వఱకుఁ బ్రొద్దుపుచ్చి, తానొక హితునితోఁ గూడఁ
దిరిగివచ్చుచుఁ ద్రోవలో నొకఁడొడలు దెలియక పడియుం
డుటఁ జూచి, వానికడ కరిగెను. వాఁ డమితముగ మద్యపాన
మొనరించి నందునఁ దన్నుఁ దానెఱుఁగని స్థితియందుండెను.
వానియెడ నాబ్రాహాము జాలిఁగొని వాని నెత్తికొనిపోయి
తగిన యుపచారము సేయనర్పఁ దనమిత్రుని సాయముం గోరె
ను ఆ మిత్రుఁడతని మనోరథముం దీర్ప నిరాకరించెను.
ఆబ్రాహాము వానిం గదలకుండునట్లు తన రెండు చేతులతోఁ
బట్టి యెత్తికొనిపోయి సమీపముననున్న వేఱొక చెలికాని
యింట బరుండఁబెట్టి, వానికిఁ గావలసిన యుపచారముల
నన్నిఁటి నారేయియెల్ల నొనరించుచుండెను అతఁడా రాత్రి
యంతయు వాని సమీపముననే యుండి, మఱునాఁడు వేకువ
ను వాఁ డొడలు దెలిసి యింటికరిగిన పదంపడి, తాను తన

గృహమునకేఁగెను. ఆబ్రాహాము తన చిన్నతనమునుండియే యనేక మతబోధకులతోఁ గలసియుండెడి వాఁడని వచించి యుంటిమిగదా! అందుచే నతఁడు యుక్తవయస్కుఁ డయిన పిదప జనుల కనేక సదుపదేశములను జేయఁగలిగి యుండెను.

ఆబ్రాహాము తల్లి త్రాగుడు దురభ్యాసము నెడ మిగుల విముఖురాలని చెప్పియుంటిమిగదా! ఆమె వలెనే యాబ్రాహాము నాచెడునడవడియెడ నసహ్యభావముం జూపుచు, దానిచేఁ గీడొందు జనులయొక్క పరితాపకరస్థితికై వగచుచు, దానిని రూపుమాపఁ దనచే నైనంతవఱకుఁ బ్రయత్నింప నారంభించెను. అట్టి ప్రయత్నము ఫలవంతమగు కాలమును సమకూడెను. ఆ విషయమయి యొక మహానుభావుఁ డదివఱకే ప్రచారము సేయుచుండెను. ఆతనితోఁ గూడ నాబ్రాహాము చేరి యా దురభ్యాసము మానునట్లు ప్రజల కుద్బోధింప మొదలు పెట్టెను. త్రాగుడును మాన్పుటకును, త్రాగుడుచేఁ గలుగు నాపదలను బ్రజలలోఁ బ్రకటించుటకును నొక పత్త్రిక స్థాపింపఁబడినది. ఆ పత్త్రికలో నాబ్రాహాము "లాహిరి" వస్తువులను వదలుటచేఁ గలుగు లాభములంగూర్చి తేఁటతెల్లముగ వివరించెను. రాజకీయ విషయములం గూర్చియుఁ బ్రజలలోఁ బ్రచారము సాగించుటకొక పత్త్రిక నెలకొల్పఁ బడెను. ఆ పత్త్రికకును నాబ్రాహామనేక రాజకీయ విషయములంగూర్చి వ్రాయుచుఁ బ్రజలకు వానియం దుత్సాహమును, శ్రద్ధయుఁ గలుగునట్లు గావించెను. మత్తు పదార్థములను బహిష్కరించుటకును, రాజకీయ

విషయములను జనులలో వ్యాపింపఁ జేయుటకును నాబ్రాహాము కంకణముఁ గట్టికొని పాటుపడుటం గాంచి ప్రజలతని యందెంతయు ననురాగము వహించిరి.

శోణ హైందవులకు భీతిల్లి యెల్లప్పు డమెరికా వాసులగు నాంగ్లేయులు తమ ప్రాణములఁ గాచుకొనఁ జేతి నాయుధముల ధరించుచుండిరి. అంతియగాక వారు వేఁటాడు వృత్తి కనుకూలముగను నట్టి సాధనములఁ దాల్చుచుండిరి. కావున, నక్కాలమున నమెరికాకు వలస వచ్చినవారు వేఁటాడుట నొక ప్రధాన కర్తవ్యముగఁ జూచుకొనుచుండిరి. అడవి మృగము లరణ్యములలోఁ బ్రబలి జన సంచారమున కేమాత్ర మెడమీయకుండెను. అందుచే వారట్టి మృగములను వేఁటాడ వలసిన యావశ్యకత యేర్పడెను. అబ్రాహాము తన కాలము నంతయు విద్యాభ్యాసమున నుపయోగించుచు వచ్చినందున, నతనికి వేఁటాడుట యందంత యాసక్తి యుండెడిది కాదు. అయినను నొక్కొక్కప్పు డతఁడడవికి వెడలినపుడు తనకుఁ గనఁబడు మృగములను వేఁటాడుచుండెడి వాఁడు. అతఁడనేక క్రీడలయందు గడుంగడు సమర్థుఁడు.

అబ్రాహాము భుజబల పరాక్రమములతోఁ గూడిన మంచిజోదు. అతఁడు దృఢమైన శరీరము గలవాఁడుగనుండెను. ముగ్గురుచేరి యొనర్పఁగల కార్యము నాతఁడొక్కఁడే చేయ సమర్థుఁడుగ నుండెను. తన పదునెనిమిదవ యేఁటనే యాబ్రాహా మిట్టిస్థితి యందుండెను.

'జెంట్రి' యనుపేరుగల యొక వణిజుఁడా బ్రాహా

మున్న ప్రదేశమున వసించుచుండెను. అతనియొద్ద నాబ్రాహాము పనివాఁడుగ నమరెను. అబ్రాహాము మన్నిపనులయందును నిపుణుఁడుగ నుండినందున, నతనియెడ నతని యజమానుని కమిత విశ్వాసమేర్పడెను. ఆవర్తకున కొకకుమారుఁడుండెను. అతఁడాబ్రాహామునకు సమవయస్కుఁడగుట నతనికి నాబ్రాహామునకుఁ జెలిమికలిగెను. అబ్రాహాము లింకను సత్యము, శాంతము, వినయము, తెలివి, విధేయుత మొదలగు మంచిగుణములను గలిగియుండుటచే జెంట్రి కాబ్రాహామునందు మిగుల ప్రియముకలిగెను. కావున నతఁడాబ్రాహామును దన కుమారునితోఁగూడ వ్యాపారార్థము 'న్యూయార్లీన్సు, అను పట్టణమున కనుపనెంచెను. అబ్రాహాములింకను యొక్క తలిదండ్రులందులకు సమ్మతించిరి. పిదప నాబ్రాహామును, నతనియజమానుని తనయుఁడును నోడనెక్కి బయలుదేఱిరి. అట్టియెడ నాబ్రాహాము తనతోఁగూడఁ బారశాలలోఁ జదువుకొనిన యొక చెలిమికత్తెంగాంచి, యయ్యమతో సంభాషింపఁ జొచ్చెను. సూర్యుఁడు పశ్చిమ సముద్రమునఁ గ్రుంకు తరుణమాయెను. అప్పుడాపడఁతి యాబ్రాహాముతో "మనమున్నచోట నిల్చియున్నాము; సూర్యుఁడన్ననో, యస్తమించిపోవుచున్నాఁ" డనెను. అంతట నాబ్రాహాము "సోదరీ! సూర్యుఁడున్నచోటనే యున్నాఁడు. మనమే, భూచలనముచే నద్దానితోఁ బాటు బోవుచున్నా" మని నుడివెను. ఆమె యాపలుకును విశ్వసింపలేదు. కాని, తుదకాబ్రాహా మమెరికా రాష్ట్రాధిపతియైనపుడామె యతనింజూచుట తటస్థించెను.

అట్టియెడఁ జిన్నప్పటి యీప్రసంగమునుగూర్చి ప్రస్తావించుచు నతఁడుచెప్పినదే నిక్కువమనియుఁ దానపుడజ్ఞానముచే దాని నమ్మనైతిననియు వక్కాణించెను.

ఆబ్రాహామును, నతనియజమానుని తనయుఁడును న్యూయార్లిన్సునకు బయలుదేఱి పోవునపుడు, మార్గమధ్యమునఁ బలువిధములగు దృశ్యములం గాంచి మిగుల సంతసించిరి. మఱియు వారి ననేకాపాయము లెదుర్కొనినవి. వారు వాని నేమాత్రము సరకుసేయలేదు. ప్రయాణము మిగులకష్టసాధ్యముగనుండెను. ఒకనాఁడు వారొక రేవునకు నోడనడపి యట దానిలంగరువైచి తమపని జూచుకొనుటకు వెడలిరి. అత్తఱి నటకుసమీపమున నుండిన యొకతోఁపునందుఁ బని చేసికొనుచున్న నీగ్రోజాతీయులు గొందఱోడలోఁ బ్రవేశించి యందలి వస్తువులను గొల్లగొట్టయత్నించిరి. అప్పుడా నీగ్రోలకును, నోడలోనున్నవారికిని బోరాటము జరగెను. కడకు నీగ్రోజాతివారోడి పాఱిపోయిరి. ఆబ్రహాములింకను యొక్క మహాప్రయత్నములవలనను, నతనికిఁగల మనోధైర్యమువలనను నా యోడలోనుండిన వారు జయముం బొందఁగల్గిరి. పిదప నౌకలోనివారు తమ గమ్యస్థానముం జేరి, తమసరకులను విక్రయించి స్వస్థలోన్ముఖులయిరి. పై పోరాటమున నాబ్రాహాములింకనునకుఁ జాల గాయములు తగిలెను అయినను నతఁడు తన తరువాతికాలమున నీగ్రోలను ప్రేమబంధమునఁ జిక్కింప మిగులఁబాటుపడి వారి కావశ్యకములగు నుపకారముల నెన్నిఁటినో యొనర్చెను.

## ౬ ధనసంపాదనము

ఆబ్రాహాము లింకను జెంట్రికడఁబని సేయుటకుముందు తానే యొక చిన్నపడవను జేసి, యందు సరకుల నెత్తించుకొని పోయి యోడలోఁ జేర్చుపని నొనర్చుచుండెను. మొట్టమొదట నతఁడిరువురి పెట్టెలను గనపడవయందెత్తించుకొనిపోవుట కొకడాలరు పుచ్చుకొనుచుండెను. అంత మాత్రముతోనే యతఁడెంతయో తృప్తిపడుచుండెను. అనంతర మతఁడు తన యెఱిఁగిన యొకగౌరవస్థు నాశ్రయించి, తన కెక్కడనైన నొక యుద్యోగము నిప్పించుమని వేడికొనెను కాని యాతఁ డతని ప్రార్థనమును లక్ష్యపెట్టకుండెను. నాబ్రాహామాతని నాశ్రయించుట నిరర్థకమని యెంచి యాతనికడ కరుగుట మానుకొనెను. పిగప నతఁడడవికేఁగి, తనయింటిని బాగు చేయించుకొనుటకుఁ గావలసినకలపఁ దెచ్చుకొన నారంభించెను. పిమ్మట నతని కొకఘనునితో మైత్రికలిగెను ఆ పెద్ద మనుష్యునియొద్దఁ దనరాష్ట్రమునకు సంబంధించిన చట్టములు గల యొక పుస్తకమున్నదని యాబ్రాహామెఱింగి, యందలి విషయములను దెలిసికొనవలెనని కుతూహలపడుచుండఁగా, నాతనికద్దాని నాగృహస్థుఁ డిచ్చెను. ఆబ్రాహామా గ్రంథము నత్యంతాపేక్షతోఁ బఠించెను. దీనిం జదువుటకుముం దతఁడు "స్కాట్టు" వ్రాసినకథలను, "సింద్బాదుయాత్ర" లకు సంబంధించిన కథలను జదివెను. న్యాయస్థానమునకు వెడలి, యక్కడ జరుగు కార్యక్రమముం దిలకింపవలయునని యతని కొక యభిలాషముండెను. కావున నొకనాఁడు న్యాయస్థాన

మున కరిగెను. అప్పుడయ్యెడ నొక హత్యం గూర్చిన నేరము విచారింపఁ బడుచుండెను. దోషిపక్షమున వాదించుచున్న న్యాయవాది మిగుల సమర్థతతో నేరగానియం దే దోషము లేదని సిద్ధాంత మొనర్చుచుండెను. అబ్రాహా మప్పుడు, దాను నయిత మట్టి న్యాయవాది పదవిం గాంచవలయు నని యూహించెను. న్యాయసభ ముగియఁగనే యతఁడా న్యాయవాదిని గలిసికొని "ఆర్యా! తామత్యద్భుతముగ వాదించినందులకు నేను మిమ్మభినందించుచున్నాఁడ" ననెను. ఆ పలుకుల న్యాయవాది సరకు సేయనివానివలె నుదాసీన భావముతో నింటి కేఁగెను. తరువాత నాబ్రాహా మమెరికా సంయుక్త రాష్ట్రాధిపతి యయినప్పు డాన్యాయవాది సత్తముఁ డతనికడకుఁ గారణాంతరమునఁ దీసికొని రాఁబడెను. అయినను దానొకపరి యలక్ష్యభావమునఁ జూచినయాతఁడీతఁడేయని యతనికిఁ దెలియదు. అబ్రాహాము మాత్ర మాతనిఁ గుఱుతుపట్టి స్నేహ భావముతోనే మాటలాడెను.

న్యాయస్థానమునుండి తిరిగి వచ్చినవెంటనే యాబ్రాహామొక సంఘము నేర్పఱచి, తన్మూలముగ నుపన్యాస కౌశలమభివృద్ధి నొందింపఁదగు కార్యములఁ గావింప నారంభించెను. అబ్రాహాముయొక్క వాక్చమత్కృతిం గన్నయనేకు లతనిని గడుంగడుఁ బొగడుచుండిరి. అబ్రాహా మనేక పుస్తకముల మూలముగఁ దెలియరాని విషయములం గూడఁ దన బుద్ధిబలముచే గ్రహించుచుండెను. అతఁడత్యంత మేధా సంపన్నుఁడు.

## 2 గ్రామాంతర ప్రవేశము.

ఆబ్రాహాము లింకను యొక్క పెద్దవారు తామున్న గ్రామమునుండి మఱియొకయూరికి వలసవెడలఁ బ్రయత్నించుచుండిరి. అట్లువా రాయూరికి బ్రయాణమైరి. ఆబ్రాహాము మంచి యౌవనము పొందెను. ఆకాలమున నిప్పుడున్నట్లు బాటలును, బండ్లును బ్రయాణమున కేర్పడియుండలేదు. మార్గమధ్యమున నెన్నియో చిన్నయేళ్లను దాఁటవలసియుండెను. ఆబ్రాహాముతండ్రి తాను నూతనముగఁ జేరనెంచిన గ్రామ మాతఁ డున్నచోటికి రెండువందమైళ్ల దూరమున నుండెను. అనేకకష్టములకుఁబాల్పడి యాబ్రాహామున్నగు వారా క్రొత్తయూరు జేరిరి. ఆబ్రాహాము తనకాలము నక్కడఁగూడ జాలవిడువక గ్రంథములను బఠియించుట యందుఁ గడపుచుండెను. అప్పుడాబ్రాహాము వ్యాధిగ్రస్తుఁడై తరువాత సుఖముండెను. ఆ నూతనగ్రామమున వర్షకాలమధిక పీడకరముగ నుండెడిది. దాని నతని కుటుంబము వారు భరింపలేకపోయిరి.

ఆబ్రాహాము మిగుల మేధా సంపన్నుఁడని నుడివియుంటిమి గదా! అతఁడు తనయొక్క బుద్ధికౌశలముచే నొకధూమ నౌకనునిర్మించి, దానిని 'రిజష్టరు' చేయించెను. ఇట్లుండ నాబ్రాహాము నొకమల్లుఁడు తనతోఁ బోరాడుటకు రమ్మని చీరఁగా, నతని నెదిరించి యోడించెను. దానింజూచి యతని హితులు సంతోషించిరి. అప్పటినుండియు నాబ్రాహాముయొక్క భుజబల పరాక్రమములు సర్వత్ర వ్యాపించెను. అట్లతఁడు

నానాఁట వ్యాపారమునం దభివృద్ధిఁ బొందుచుండ "బ్లాక్ హాక్ వార్" అను యుద్ధము దేశమున సంభవించెను. అందుఁ బాల్గొన నెంచి యాబ్రాహాము వెంటనే రణరంగమునకుఁ జేరి తన దేశమునకు శక్తి వంచన లేక సేవసలిపి యెల్లర పొగడ్తలం బొందెను. ప్రజల కతనియం దమితానురాగ మేర్పడెను. అందుచే వా రతనిని శాసనసభకు సభ్యుఁడుగ నిలువఁగోరిరి. కాని యా పర్యాయమతఁ డెన్నుకొనఁబడలేదు. కొంద ఱతనిని న్యాయవాదిపదమునకుఁ దగు విద్య నభ్యసింపుమని ప్రోత్సహించిరి. కాని, యాబ్రాహామునకు వ్యాపారమునందే యెక్కువగ నభిరుచి యున్నందున, నతఁడు దానియందే మరలఁ బ్రవేశించెను. తరువాత నతఁడు భూపరిమాణశాస్త్రజ్ఞుఁడై యాశాఖయం (Surveyor) దుద్యోగము సంపాదించెను. అందతఁడు శ్రద్ధతోఁ బనిచేసి పేరు పొందెను. మఱియు నతఁడు గొన్ని సమయములలో గుఱ్ఱపుపందెములయందు మధ్యస్థుఁడుగ నియమింపఁబడెడివాఁడు. అందును నతఁ డెల్లరును మెచ్చఁదగినట్లే పనిచేయుచుండెడివాఁడు. ఇట్లుండ నతఁడు వార్తాహరకార్యాలయాధిపతి(Post-master)గా నియమింపఁబడెను. ఆపదవి యందుఁగూడ నతఁడు సర్వజనప్రీతి పాత్రుఁడాయెను.

## ౫. శాసనసభా సభ్యత్వము.

1834 సంవత్సరమున శాసనసభాప్రతినిధుల నెన్నుకొనుటకై ప్రభుత్వప్రకటనము వెలువడెను. ఆయెన్నికలలో నాబ్రాహాము లింకను సహితమొక యభ్యర్థిగ నిలిచెను. అతనిని

ప్రజలలో నెక్కువసంఖ్యగలవారు బలపఱచుచుఁ దమ ప్రతిని ధిగ నెన్నుకొనిరి. అందుచేఁ బ్రజల కాబ్రాహాము లింకను నెడఁగల గౌరవభావము పూర్తిగ వెల్లడి యయ్యెను.

ఎన్నికలయిన యనంతరము శాసనసభా సమావేశ మున కొక్కింతకాలము వ్యవధియుండెను. ఆకాలము నతఁ డు వ్యర్థపఱచక రాజ్యాంగ సంబంధములగు విషయములను గమనించి నేర్చుకొనుటలో వినియోగించుచుండెను. అందుచే రాజకీయవిషయములలో నతని కత్యంత ప్రవేశమేర్పడెను కాని, శాసనసభకు వెడలుటకు ధరింపవలసిన క్రొత్త యుడు పులును, వ్యయమునకుఁదగిన ధనమును నతనికి లేకుండెను.

ఆబ్రాహాము లింకనున కొకస్నేహితుఁడుండెను. అతని పేరు "మిస్టర్ స్మార్టు". ఆబ్రాహాములింకను ద్రవ్యము లేమి కెంతయుఁ గుందుచుండ, దైవవశమున నతనికడకు మిస్టర్ స్మార్టువచ్చెను. అతనిఁజూచి లింకను మిక్కిలి హృష్టుఁడై యతనితో "మిత్రమా! నాకుఁ బ్రస్తుతము రెండువందల డాల ర్లు కావలసియున్నది. ఈమొత్తమును మరల శాసనసభ ముగి యఁగనే యిచ్చివైచెద"ననెను. అందులకా మిత్రుఁడు సమ్మ తించి, వెంటనే యాబ్రాహామున కిన్నూఱుడాలర్ల నొసం గెను. ఆసొమ్ముతో నాబ్రాహాము తనకుఁ గావలసిన యుడు పులు మొదలగునవి విలిచికొనెను. తరువాతఁ దాఁ జెప్పినప్ర కారమప్పుగాఁగొన్న యిన్నూఱుడాలర్లను దిరిగి యాంనేస్తగా ని కిచ్చివేసెను.

ఇట్లుండగా జనులలోఁగొందఱు దేవునిగూర్చియు బైబి

లనఁబడు సత్యవేదముంగూర్చియు సంశయ హృదయులై వాని పైనున్న విశ్వాసము నంతకంతకు విడువఁజొచ్చిరి. సంసర్గదోషమున నీయవిశ్వాసవాసన లింకనునకును దగిలెను. కావున నతఁడును దక్కినవారివలెనే బైబిలునందును దేవునియందును నమ్మకములేనివాఁడై యావిషయము దన స్నేహితులకును జెప్పుచుండెను. అంతలోనిలువక యతఁడు తన యభిప్రాయములను బత్రికలలో బ్రచురించెను. కాని యవియన్నియు నూర్యునింగాంచి విఱియు నిరులవలె స్వల్పకాలములోనే తొలఁగిపోఁగా మరల నతనికి జ్ఞానోదయమయ్యెను. వెంటనే యాతఁడు దేవునియందును వేదమునందును నమ్మకముగలవాఁడాయెను.

అబ్రాహాము శాసనసభలో సభ్యుఁడైనప్పుడు తక్కిన సభ్యులచేఁ దేఁబడు తీర్మానములకు నతఁడెక్కుడుగ నెప్పుడును వ్యతిరేకుఁడుగ నుండలేదు. కాన నతఁడు మౌనముగ నుండియే యనేక కార్యములను జేయఁగలిగెను. ఎన్నియో యుపసంఘములలో నతఁడు పాల్గొని నియమిత కార్యములను దృప్తికరముగ నెఱవేర్చి యితరసభ్యుల స్తోత్రములకుఁ బాత్రుఁడాయెను.

అబ్రాహాము శాసనసభలో సభ్యుఁడుగ నుండినందున నతఁడు శాసనములకు సంబంధించిన విషయములనెల్లఁ జక్కఁగ గ్రహింప వీలేర్పడెను. గౌరవనీయుడగు "టి. స్టూవర్టు" అనునొక న్యాయవాదియుండెను. అతఁడాబ్రాహాము తెలివింజూచి సంతసించి, శాసనవిషయములలో నతని జితపరిశ్రమునిఁ జేసెను. అంతియగాక, అఁతడు తనవలననైన

యెల్ల సహాయములును జేయునట్లును, దన పుస్తక భాండాగార మునఁగల గ్రంథములలో నిష్టమున్నదాని నాబ్రాహాము తీసి కొని చదువవచ్చుననియుఁ జెప్పెను. ఇందుచే నాబ్రాహాము నకుఁ బ్రోత్సాహ మధికమయ్యె, తాను న్యాయవాది పదవిం బొందుటకుఁ దగినజ్ఞానము సంపాదించుకొనవచ్చునని తలం చెను. అతని చెలికాండ్రును నాబ్రాహాముయొక్క యభిప్రా యము నెఱింగి సంతసించి యతనికిఁదమవలననైన తోడ్పాటుఁ గావింప వాగ్దాన మొసంగిరి. ఆబ్రాహాము తనకుఁగావలసియు న్నగ్రంథములకై యొక్కొక్కప్పుడు మైళ్లకొలఁది దూరము నడువవలసి వచ్చుచుండెను. ఒకనాఁడతఁడొకపుస్తకము కొ ఱకై యిరువదిరెండుమైళ్లు నడచిపోయెను. పుస్తకము కొన్న తరువాత మరల నతఁడంతదూరమును దిరిగి నడచివచ్చెను. ఇట్లతఁడొక్కదినము నలువదినాలుగుమైళ్లు నడచెను. అతఁడు తనకాలమును నిరుపయోగపఱచుట కిష్టములేనివాఁడై, మిత్రు లతోసహిత మధికముగ మాటాడుటలేదు. అతఁడు రాత్రు లయందుఁ జాలప్రొద్దుపోవువఱకు మేల్కొని చదువుచుండు వాఁడు. దారినడచునప్పుడుకూడ నతఁడు పొత్తముం దాల్చి పఠించుచుఁబోవువాఁడు. ఇట్లతఁడు తనకాలమునంతయు విద్యా భ్యాసమునందే గడపెను.

ఆబ్రాహాము లింకను శాసన సభలోఁ జేరి ప్రజోప యోగకర కార్యములను జేయుచుండ, నతనిం బ్రజలు మర ల 1886 వ. సంవత్సరమునఁ దమ ప్రతినిధిగ నెన్నుకొనిరి. అతఁడు శాసనసభా సభ్యుఁడుగనుండియుఁ, దన జీవనమున

కై భూపరిమాణ శాఖా విలేఖకుఁడుగఁ బనిసేయుచుండెను. మఱియు న్యాయవాది పరీక్ష కేర్పడిన పాఠ్యగ్రంథములను జదువుచుండెను. ఒక్కొక్కప్పు డతఁడు కార్యభారము కారణముగ రెండుమూఁడు దినములవఱ కింటికి వచ్చువాఁడు గాఁడు. అప్పు డతఁడు తన పరీక్షా పాఠ్యగ్రంథములఁ జదువుట కవకాశము లభింపనందుల కెంతయు వగచువాఁడు. అయిన నట్టి సమయములందును నతఁడు రాత్రులందుఁ జాలసేపువఱకును జదువుచుండువాఁడు. తనతోడి శాసన సభ్యులు తమ కాలమును బలు విధములగు క్రీడల యందును, బనికిమాలిన విషయములయందును వ్యయపఱచుచుండ, నాబ్రాహాము తన కాలమును జదువుకొఱకు వినియోగించుచుండెను. అతఁడు తన శరీర సౌఖ్యమును సహితము సరకుసేయక చదివి యున్నత పదవి పొందుటయందే దృష్టియుంచి యుండెను.

అప్పు డొక రాజకీయ సభ జరిగెను. అందినవు రేదే నొక విషయముం గూర్చి వివాదపడిరి. ఆ సభయం దాబ్రాహాము సహిత ముండెను. ఆ వివాదము ప్రబలునట్లుండెను. కాన వెంటనే యాబ్రాహాము వారిగువురి వివాదకారణము గ్రహించి యేదో యొక విధముగ దానిం దీర్చి, వారి మనస్తాపముం బోగొట్టి, వారికి సమాధానముం గుదిర్చెను. రాజకీయవాది యొకఁడా సభలో నసూయత కారణముగ నాబ్రాహాము మనస్సు నొప్పింప నూహించి, యతని నోరార దూషింప నారంభించెను. అప్పు డాబ్రాహామతనికిఁ దగినరీతి బుద్ధిఁ గఱప నిశ్చయించి, యటఁ గూడియుండిన జనుల

కా రాజకీయవాదియొక్క యకృత్యములెల్ల వివరించిచెప్పి, తమ్ముంగూర్చి యీ జనులే తీర్మానింప వలయునని విన్నవించెను. ఆగ్రాహాము ప్రసంగము నాలించిన జనులారాజకీయ వాది వచించిన వానిని ఖండించి యతని నపహసించిరి. అటు తరువాత నారాజకీయవాది తన దోషమును గ్రహించి సిగ్గుచేఁ దలవంచుకొని నిలిచెను.

శాసన సభయందాగ్రాహాము వలెనే రాజకీయముల యందుఁ జెలుతవారైన యనేకులు సభ్యులుగనుండిరి.

అమెరికా వారిలో నొకపక్షమువారు బానిస వ్యాపారమును నిర్మూలించుటకై కంకణము గట్టికొని యందులకగు కార్యములనన్నిటిని జేసిరి. అందు మన యీగ్రాహాము మొకఁడు. అతని కండగ శాసనసభలో సభ్యులనేకులు నిలిచిరి. అందు ముఖ్యుఁడు "టాడ్ స్టోను" అను నతఁడు. అతఁడు మొదట బానిస వ్యాపారమును బోఁగొట్టుటకు విరోధముగఁ బ్రయత్నించి యుండెను. అయినను నతఁడు గ్రాహాముయొక్క యుపన్యాసములను విన్న పిదప బానిస వ్యాపారమును నణంపఁ దానును గంకణముగట్టికొని, యందులకగు ప్రయత్నముల నన్నిఁటిని జేసెను.

మన యీగ్రాహాము న్యాయవాది పరీక్షకయి చదువుచుండెను గదా! అతఁడా పరీక్షలో ను త్తీర్ణుఁడై 1837 సం॥ రమున న్యాయవాదిగాఁ జేర్చికొనఁబడెను. తరువాత 1838 వ సం॥రమున నతఁడు మరల శాసనసభకొక సభ్యుఁడు

నెన్నుకొనఁ బడెను. అతఁడు మద్యపాన బహిష్కారమున కై మిగులఁబాటుపడి యనేక కార్యములను జేసెను. అతఁడవకాశము దొరకినపుడెల్ల యువకులకు సద్బోధనలు సేయుచుండెను. అతఁడు యువకులకు స్వాతంత్ర్యముం గూర్చి పలుమాటలు బోధించుచుండెను. ప్రతియొక్కఁడును స్వాతంత్ర్యము నొందవలయుననియే యతని ముఖ్యోద్దేశము ఈ యూహతోడనే యతఁడు శాసన సభలో గానిస వ్యాపారమును నిర్మూలించుచట్టము నిర్మింప నెంతయుఁ బాటుపడెను. మరల నతఁడు 1840 సం॥రమున శాసన సభకు సభ్యుఁడుగ నెన్నుకొనఁబడెను. ఈ పర్యాయ మెన్నిక లత్యంత తీవ్రముగ జరగెను. ప్రజలలోఁ బక్షములేర్పడి యొకరితో నొకరు కోపావేశము తోడను నుద్రేకముతోడను బోరాడఁజొచ్చిరి. ఇట్టి యొక సమావేశమున నాబ్రాహాము ప్రాంగాని జనుల కోపావేశమును గమనించి వారిలో వారికి సమాధానము చేయవలసివచ్చెను.

అమెరికా శాసన సభలో నొక సభ్యుఁడుండెను. అతఁడే విషయమునైన నెదిరింపఁ గంకణముఁ గట్టికొన్నవాఁడు. ఆబ్రాహాము తన్నెన్నుకొనిన ప్రజలకుఁ బ్రయోజన కరమగు నొక విషయముం గూర్చి సభలో నొకనాఁడు ప్రసంగించుచుండెను. అట్టియెడఁ బైఁజెప్పిన సభ్యుఁ డబ్రాహాము వచించిన దానిం బ్రతిఘటించి మాటలాడెను. వెంటనే యాబ్రాహామన్యాపదేశముగ నొకకథఁ గల్పించి చెప్పి యతనికి వాగ్బంధనముం గావించెను. ఇది జరగిన తరువాత

నాసభ్యుఁడు తక్కిన యేవిషయ మందుఁగాని యంతగా జోలిఁ గలిగించుకొనకుండెను.

న్యాయవాది యైనపిమ్మట నాబ్రాహాము లింకను "స్టూవర్టు" అను నతనితోఁగూడఁ గలసి కొన్నాళ్లు పనిచేసెను. తరువాత నతఁడు "లోక" నను నతనితోఁగూడఁ జేరి వృత్తి నడపుచుండెను. అతఁడు ప్రబల న్యాయవాది కాఁగానే ప్రశస్తిఁ గాంచ మొదలిడెను. అతఁడు 1842 వ సంవత్సరమున "మిస్ మేరిటా"ట్టను నామముగల యొక కన్యకను వివాహమాడెను. ఈమె మూలముగ నతనికి నలువురు పుత్త్రులు జన్మించిరి. అందు మువ్వురు కొంతకాలము పెరిగి చనిపోయిరి. "రాబర్ట్సు" అను పుత్త్రుఁడు మాత్రము జీవించియుండి వాషింగ్టనులో యుద్ధకార్యదర్శిగఁ బనిచేయు భాగ్యముం గాంచెను.

ఆబ్రాహాము లింకను తన స్నేహితులను మఱువక వారిపై నత్యంత విశ్వాసముం గలిగి వెలయుచుండెను.

---

## ౯ ప్రబల న్యాయవాది

న్యాయ వాదులకుఁ బ్రప్రథమమునఁ బ్రసిద్ధిరాదు. కావున, నాబ్రాహాముకూడ న్యాయవాది వృత్తి నవలంబించిన తరువాతఁ గొంతకాలమువఱకును నంతగాఁ బైకి రాకుండెను. కావున, నతఁడు చోటనే యుండవలసి వచ్చెను.

జీవనమునకు సయితము చాలని వచ్చుబడియే, అబ్రాహా ము లింకను ప్రసిద్ధి వహించిన న్యాయవాదులలోఁ దానొకఁ డగువఱకును సంపాదించుచుండెను.

అకాలమున న్యాయస్థానము లిప్పటివలె నేఁ డొక నియమిత స్థానమున నుండినవి కావు. న్యాయాధిపతు లూరూరికిఁబోయి వివాదములను బరిష్కరించు చుండిరి. కావున న్యాయవాదులు నట్లే యూరూరికిఁ దిరుగవలసి యుండెడిది. వారట్లు పోవుట కశ్వములును, దానికిఁ దగిన పరికరములు నత్యావశ్యకములుగ నుండెను. అబ్రాహామునకుఁ గుటుంబ పోషణమునకు సహితము చాలినంత వచ్చుబడి లేనందున, నతనికి గుఱ్ఱమును గొనుటకు వీలు లేకుండెను. అయినను నూరూరికిఁ దిరుగుటయున్న గష్టసాధ్యమగు కార్యమగుటచేఁ దురగము తప్పక యుండవలయునని యతనికిఁ దోఁచెను. కావున నతఁ డొకానొక స్నేహితునికడ గుఱ్ఱమును, సవారి చేయుటకుఁ గావలసిన సామానులను గొంతకాలమువఱ కెరువు పుచ్చుకొని రాకపోకల జరుపుచుండెను. ఒకానొక ప్పుడు లింకను మూఁడు నాలుగు మాసముల వఱ కన్య గ్రామ ములయందే యుండవలసిన ట్లేర్పడెడిది. ఇట్లతఁ డొకసారి బయటి గ్రామములలో సంచరించుచుండఁగా నతని భార్య స్వగృహము నొకింత పెంచి విశాలముగఁ గట్టించెను. అబ్రా హా మరుదెంచి తనయింటిని జూచి, తన సతీమణి చేసిన కార్యమున కెంతయుఁ బ్రశంసించెను. అతనికి దిన క్రమము గ వచ్చుబడి యధికమగుటయు, నతఁడు స్వయముగ నొక

గుట్టమును, దానికిఁ గావలసిన సామానులను గొనఁ గలిగెను.

అతఁడు వినయము, ఉత్సాహము, శ్రద్ధ, కార్యదీక్ష, నీతి తప్పకుండుట మొదలగు సద్గుణముల కాకరముగ నున్నందున నతనియందుఁ బ్రజలకు మిగుల గౌరవ మేర్పడెను. అతఁడు న్యాయమార్గమును వీడిన పక్షమునఁజేరి యెప్పుడును వాదించిన వాఁడు గాఁడు. అమెరికా సంయుక్త రాష్ట్రములలోని కొన్ని మండలములలో మాత్రమే బానిస వ్యాపారము నిలుపఁబడెను. మఱి కొన్నిట మాత్ర మెప్పటివలెనే యయ్యది సాగుచుండెను. బానిస వ్యాపారము సమూలముగ నాశము చేయఁబడిన మండలములలోని నీగ్రోజాతివారెవరేని బానిస వ్యాపారము జరుగుచుండు మండలములఁ బ్రవేశించినచో నచటివారు వారిం బట్టుకొనుచుండిరి. అట్టియెడ నానీగ్రోలు తమ్ము విడిపించుకొనుటకై వారికి ధనమీయవలసి వచ్చుచుండెడిది. వారట్లిచ్చుటకసమర్థులైనచో వారి నా మండల వాసులు విక్రయించుచుండిరి. ఒక పర్యాయము స్వాతంత్ర్యముఁగన్న యొక నీగ్రోజాతివాఁడు బానిస వ్యాపారము జరుగునట్టి ప్రదేశముం బ్రవేశించి యట నొకనిచేఁబట్టుపడెను. అప్పు డతని తల్లి యాగ్రామము కడకుఁ బఱువెత్తి తన కుమారునకుఁ గలిగిన యవస్థనుగూర్చి మొఱ పెట్టుకొనెను. లింకను చెఱపట్టఁబడిన నీగ్రోయువకుని విమోచనమునకు ధనముఁ జెల్లించి యతని, నతని తల్లి కప్పగించెను. లింకను నీగ్రోలకు సహాయమొనర్చుటలో వెను

దీయ లేదు. ఆతని సద్గుణములంగూర్చి న్యాయవాదు లనేకు లు తలచుకొని యూరకుండెడివారు. ఒకసారి యాబ్రాహాము తనకుఁ దెలియని విధముగ నొక యవినీతి కార్యమున కగ్గమాయెను. పిదప నది యవినీతియని తెలియఁగనే యతఁడద్దానింగూర్చి వాదించుటను మానివేసెను. అతఁడు తన బుద్ధికి నింద్యమని తోఁచిన విషయములలోఁ బ్రవేశించువాఁడు గాఁడని యిదివఱకే చెప్పియున్నాము గదా! ఇనుపదారి సంబంధమైన జయింపఁదగిన యొక వ్యవహారములో నాతఁడు పాల్గొని గెలుపునందెను. కాని, యతఁడా విజయమునకై మనస్సున సంతసింపక చక్కఁగా నీతియం దభ్యాస పడవలయుననుటకే తానా వ్యవహారమును జేకొనినట్లును, దనకా నష్ట పరిహారము వలదనియు వచించెను.

ఒండొక పరి యొక కాంత లింకను కడకువచ్చి, తన వ్యవహారముంగూర్చి వాదింపవలయుననియు, నందులకై తా నిన్నూట యేఁబది డాలర్లు ముందుగనే చెల్లించెదననియుఁ జెప్పి, యతనికా ధనము నొసంగెను. దానింగైకొని లింకను ఆయువతింగాంచి "నీవు రేపటిదినము వచ్చినచో నీ వ్యవహారమున నేను బ్రవేశించి పనిచేయునదియు లేనిదియుఁ జెప్పెద" నని పలికెను. అట్లే యా యబల మఱునాఁడు రాఁగానే యామెతో నతఁడు "నీ వ్యవహారముం గూర్చి మాటలాడుటకుఁ దగిన యాధార మేదియు నాకుఁ గనఁబడలేదు. కావున నీ వ్యవహారముం జక్కఁబెట్ట నావలనఁగాదు.

ని రెండువందల డాలర్లను నీవు మరలఁ గైకొను" మని చెప్పి, యామె కాసొమ్ము నిచ్చివేసెను.

అబ్రాహాము లింకను తన పక్షమందలి వ్యవహారము చెడినను సమ్మతించును, గాని యన్యులు చెడిపోవు వ్యవహార మసత్యము మూలముగఁ జక్కఁబడునను నమ్మకమున్నను నతఁడట్టి మార్గమందెప్పుడును బ్రవర్తింప సమ్మతింపలేదు. అతనితోడి న్యాయవాదు లనేకు లతని గుణాతిశయములం గూర్చి పలువిధములుగఁ బొగడియున్నారు. అతఁడు సత్ప్రవర్తనమునే ప్రధానమని యెంచియుండెను. అతఁడు సన్మార్గమునందుఁ బ్రవర్తించుటయే తన జీవిత ఫలమని భావించి, మరణించు వఱకును జ్ఞాన సంపాదన విషయములో శ్రద్ధ వహించియుండెను.

ఆ బ్రాహాము లింకను పసితనమునఁ గష్టపడుచుండినప్పుడు "జేక్ ఆరమ్ స్ట్రాం" గను నొక ఘనుని సతీ తిలకమతనికి మజ్జన భోజనాదుల విషయమున మిగుల సౌకర్యముం గలిగించి, ప్రేమతోఁ జూచు కొనుచుండెను. ఆమె చేసిన సహాయము నాబ్రాహాము మఱువలేదు. ఇట్లుండ 'జేక్ ఆరమ్ స్ట్రాంగు' యొక్క కుమారుఁ డొకప్పుడు నేరము మోపఁ బడకయే మరణదండనకుఁ బాత్రుఁడాయెను. అప్పు డతని జనని మిగుల దుఃఖించి, తన పుత్రునిఁ గాపాడఁ దగినవాఁ డెవఁడును లేకపోయెఁ గదా యని వ్యసనపడుచుండెను. అట్టియెడ నామె కాబ్రాహాము జ్ఞప్తికిరాఁగా వెంటనే యతనికడ కామె వెడలి విషయ మాద్యంత మతనికి నివేదిం

చెను. అతఁడును నామె మొఱ సావధానముగ నాలించి, తన వలననైన సహాయ మొనర్చెదనని వాగ్దాన మొసంగెను. తరువాత లింకను తన కుపకార మొనర్చిన యాపడఁతి కొడుకును రక్షించు మార్గమేదియా యని యనేక విధముల నాలోచించి, తుద కా నేరము విచారించుటను గొంత కాలము వఱకును నిలిపియుంచి, తరువాతఁ దీసికొనినచో నేడైన నొక్కింత మేలొనర్చ ననువుగ నుండునని యూహించి, యానాఁడే యాదోషి విచారణ మాలస్య మొనర్పఁ బడుటకుఁ దగు ప్రయత్నములఁ గావించెను.

ఇట్లు తాఁను చేయఁగా జనుల కాదోషి విషయమునఁ గలిగియుండిన దురభిప్రాయము క్రమక్రమముగ మాఱఁ జొచ్చెను. మరల నా నేరము విచారణకు వచ్చెను. ప్రథమ సాక్షి నిందితుఁడు హత్యఁగావించు చుండఁ దాను గనులారఁ జూచితి ననియు, నతఁడట్టి నేర మాచరించె ననుట యందించుకయు సంశయింప వలసిన పని లేదనియు నొక్కి వక్కాణించెను. ఆ సాక్షిని విచారించుచు లింకను "హత్య దాదాఁపెన్ని గంటలకు జరిగియుండు" నని యడిగెను అందులకాసాక్షి "రాత్రి పదిన్నఱ గంటలకుఁ బైఁబడియుఁ బదునొకండు గంటలకు లోపలను జరిగియుండు" నని చెప్పెను. లింకను "తాము హత్య జరిగిన కాలము రాత్రియని కదా చెప్పితిరి?—అయినచో నా రాత్రి కాలమం దీతఁడే నేరమొనర్చెనని యెట్లు కనిపట్టఁ గలిగితిరి?" యని యడిగెను. అప్పుడా సాక్షి తడఁబడక "చంద్రకిరణములు స్పష్టముగఁ

ప్రకాశించుచుండినందునఁ బట్టపగటివలె నుండెను. అందుచే నేనితఁడే నేర మొనర్చిన వాఁడని చూచి కనిపట్ట గలిగితి" ననెను. తరువాత లింకను అతనితో "రాత్రి కాలమున పదిన్నర మొదలు పదునొకండు గంటలలోపునఁ గదా హత్య జరగినది? తాము వచించునది ముందుఁ జెప్పినదానికి విరోధముగ నుండదా" యనెను సాక్షియు "హత్య రాత్రి పదిన్నర గంటలమీఁదను బదునొకండు గంటలలోపుననే జరగిన" దని వక్కాణించెను. అనంతరము లింకను తన పక్షముననున్న సాక్షులనుగూడ విచారించి, న్యాయాధిపతింగాంచి "ప్రథమసాక్షి, హత్య రాత్రి పదిన్నరగంటల మీఁదను బదునొకండు గంటలలోపలను జరగినదనియుఁ, జంద్రుఁడప్పుడు ప్రకాశించుచుండెననియు వచించెను. కాని, పంచాంగముం జూచినచో హత్య జరగినట్లుగాఁ జెప్పఁబడిన దినమునఁ జంద్రుఁడు రాత్రి పండ్రెండు గంటలకుఁ బైననే యుదయించునని తెలియ వచ్చుచున్నది. కావునఁ బ్రథమ సాక్షి వచించు విషయము న్యాయ దూరముగ నున్నయది. అంతియగాక, యతఁడు నేర మొనర్చిన వాని కాఁకన్న శత్రువనియుఁ దెలియుచున్నది. నిందితుని కాహత్య గావింపఁబడిన యతఁడు పరమ మిత్రుఁడనియుఁ దెలియుచున్నది. కావున నీ నిందితుఁ డతని హత్య యొనర్పఁ గారణము గానరాదు. ఇందుచే నిందితుఁడు నిరపరాధిగఁ గనఁబడుచున్నాఁడు" అని చెప్పెను. న్యాయాధిపతి యీ విషయముల నన్నిఁటిని న్యాయ విమర్శకులకు (Jurors) నివేదించెను. వారును దీర్ఘా

లోచనము సలిపి దండితుఁడు నేరము చేసినవాఁడు గాఁడని యేక గ్రీవముగఁ దీర్మానించిరి. వారి యభిప్రాయముతో న్యాయాధిపతియు నేకీభవించి నిందితుని విడుదల యొనర్ప నాజ్ఞాపించెను. తన పుత్రుఁడు కారాగార విముక్తిం బడసి నందులకు, శ్రీమతి ఆరమ్ స్ట్రాంగ పరిమితానంద మంది యాబ్రాహాము లింకనునకుఁ గొంత ద్రవ్య మొసంగ వచ్చెను. ఆబ్రాహాము దానిం గైకొనక, తాను దన కర్తవ్యము నెఱవేర్చితి ననియుఁ, దా నింకను నామెకుఁ జెల్లింప వలసిన ఋణము మిగత యున్నదనియుఁ జెప్పెను. శ్రీమతి ఆరమ్ స్ట్రాంగు సొత్తులను గొంద ఱపహరింపఁ బ్రయత్నించిరి. ఆవిషయ మాబ్రాహామునకుఁ దెలియఁ గనే యతఁ డారమ్ స్ట్రాంగున కొక యుత్తరము వ్రాసెను. అందాతఁ డామెకుఁ గావలసిన సర్వవిధ సహాయముల నొన ర్చెదనని వాగ్దాన మొనరించెను.

లింకను సహాయసంపదచే విడుదలం గనిన విల్లియం ఆరమ్‌స్ట్రాంగు అమెరికాసైన్యమునఁ జేరియుండెను శ్రీమతి ఆరమ్‌స్ట్రాంగు తనకుమారుని సహాయ మత్యావశ్యకముగ నుండినందున నామె యప్పుడధ్యక్షుఁడుగ నుండిన లింకనున కొక లేఖమూలముగఁ దనసుతుని సేనలోనుండి విడుదలచేసి యింటికంప విన్నవించుకొనెను. ఆబ్రాహా మామె కోరినట్లె యొనర్చెను

ఆబ్రాహాములింకను న్యాయవాదివృత్తికి సంబంధిం చిన పనులకై వ్యయించిన కాలమునోఁగాఁ దక్కినసమయముల

యందనేక పుస్తకములను జదువువాఁడు. షేక్స్పియరు మహా
కవి వ్రాసినకావ్యములయందతని కమితప్రీతి. అందతఁడనేక
భాగములను గంఠస్థము లొనర్చెను. తాను జదివిన విషయ
ములను బ్రజలకు బోధించి వారిని సయితము సంతోషపెట్టు
వాఁడు. గుఱ్ఱముపై నెక్కి యెటకేని వెడలునప్పుడును నతఁడు
జదువుచుఁ బోవువాఁడు. "పుస్తకంహస్తభూషణ" మ్మనుట
అతనియందు సార్థకమయ్యెను.

లింకను న్యాయవాదివృత్తిలోఁ దనకు ద్రవ్యలాభము
సేకూరఁగోలఁది, నతఁడు దనజనకునికిఁ దనకుసాధ్యమని తోఁచి
నంతవఱకు ధనము నంపుచుండెను. తనతండ్రి యనంతరము
సయితము నతఁడు గనపినతల్లి విషయమున నెక్కుడు భక్తిశ్రద్ధ
లతో మెలఁగుచుండెను. ఆగ్రామమున నొకనేరమునందు వా
దించఁగా నేనూఱుడాల్లు లభించెను. దానితోఁగూడ నతఁడు
మఱిరెండువందల యేఁబది డాలర్లనప్పుదీసి. యేడునూర్ల
యేఁబది డాలర్లకును దనపినతల్లి కొకభూమిం గొనెను. ఆగ్రా
మమునలింకనున కొక సహోదరుఁడుండెను. అతనికిని నతఁడు
ధనవలసినప్పుడు సాయమొనరించుచుండెను. అతఁడు దనతండ్రి
చేఁ జేయఁబడిన ఋణములను గూడఁ దీర్చివైచి. పిత్రార్జితమగు
భూస్థితి నక్కునకొనర్చెను.

ఆగ్రామమునలింకనున కొకనాఁడు తనతండ్రి మరణ
శయ్యపై నున్నాఁడనువార్త యాకస్మికముగఁ దెలిసెను.
వెంటనే యతఁడు దనసహోదరున కొకజాబు వ్రాసెను.
అందు "సోదరా! దైవముపై భారమువైచి ధైర్యముతో

నుండుము. నీవు మంచి చెడ్డల గుర్తింపఁగల బుద్ధిమంతుఁడవు. కావున దేనినిగూర్చియు విచారము నుంచుకొనకుము. ఎల్లరు నెన్నఁడో యొకనాఁడు మరణింపవలసినవారే. మరణింపక యెవ్వఁడును స్థిరముగ నీప్రపంచమున నిలువఁబోఁడు. కావున భగవద్భక్తితోఁ గర్తవ్యము నొనర్పుము. తక్కినవారును ద్వరలో భగవత్సన్నిధిని గలసికొందురు'' అని వ్రాసెను. ఈ యుత్తరమును వ్రాయునపు డబ్రాహామునకుఁ బనులు మిక్కుటముగ నుండుటయగాక, యతని యర్ధాంగి ప్రబల వ్యాధి పీడితురాలై యుండెను.

---

## ౧౦ అబ్రాహాము ప్రసిద్ధి.

అబ్రాహాముయొక్క విజ్ఞానసంపదం బరికించి యమెరికా ప్రజలతనిని సంయుక్తరాష్ట్రముల శాసనసభకు సభ్యునిగ 1846-వ సంవత్సరమున నెన్నుకొనుటకు సిద్ధపడియుండగా, నతనిపక్షమువారిలో నొకఁడాతనిం జూచెను. అప్పుడాతఁడు మిక్కిలి బీదవాఁడుగను నంగహీనుఁడుగను నుండెను. అబ్రాహాము లింకను వాని పరితాపకరస్థితికిఁ జాల వగచి, వానికిఁ దనవలననైన సహాయముం జేసెను.

అబ్రాహాము లింకను అమెరికాశాసనసభలో సభ్యుఁడుగ నున్నప్పుడు, బానిసవ్యాపారమును బలపఱచుటకై మెక్సికోలో నొక గొప్పపోరాటము జరిగెను. మఱియు టెక్సాస్ రాష్ట్రమును బానిసదేశములతోఁ జేరఁ బ్రయత్నించెను. వీని నన్నిఁటి నాబ్రాహాము తీవ్రముగా ఖండించెను. అతని

ప్రసంగముల నాలించిన శాసనసభ్యులు బానిసవ్యాపారము వలనఁ గలుగు కీడులంగూర్చి స్పష్టపఱచిరి శాసనసభలో నాబ్రాహాములింకను తెచ్చువిషయము లనేకులు బలపఱచు వారుండిరి. వారాబ్రాహాముతోఁ జేరి బానిస వ్యాపారమును దమచే నైనవఱకు ఖండించి మాటలాడిరి. శాసనసభా సభ్యుఁడుగఁ బనిసేయుచునే యాబ్రాహాము కావ్యములను లక్ష్య గ్రంథములను జదువుచుండెను.

1818-వ సంవత్సరమున శాసనసభలోని యాబ్రాహాము స్థానము నిర్ణామకము(కాలి)గ నిలిచెను. అయినను నతఁడు ధైర్యగిగ నిలువలేదు. 1850-వ సంవత్సరమునను శాసనసభలో నొకస్థానము కాపఱెను. అప్పుడుఁగూడ నతఁడందులకై ప్రయత్నింపలేదు. అతఁడు శాసనసభలో నుండినపుడు మద్యపాన నిరోధముంగూర్చి యెక్కుడుగఁ బాటుపడెను. అతని నిరంతర ప్రచారఫలితముగ నది చాలవఱకుఁ దగ్గిపోయెనని చెప్పవచ్చును, అతఁడు మిత్రులకుఁ బ్రోత్సాహకరముగఁ దఱచు రాజకీయసభల కరిగి. వారికిఁ దెలియని యనేక విషయములఁగూర్చి ప్రసంగించుచుండెను.

1820 సంవత్సరమున నేర్పడిన నియమము ప్రకారము మెరికాఖండముయొక్క యుత్తరభాగమునందలి ప్రదేశములగు కాన్సాసు, నెబ్రాస్కా రాష్ట్రములలో బానిసవ్యాపారము బ్రవేశింపకుండ నట్లాటంకపఱచఁబడెను. కాని. 1854 వ సంవత్సరమున నా నియమము తొలఁగింపబడెను. ఇందులకుఁ గారణభూతుఁ డాబ్రాహామునకుఁ బ్రతిపక్షుఁడగు "డగ్లసు" అను

నతఁడు. డగ్లసు తనకార్యమును బ్రశంసించుకొనుచు, నట నట నుపన్యాసములొనర్చెను అట్టి యుపన్యాసముల నాలించిన యబ్రాహామెంతయు మండిపడెను అతఁడిఁక నూరకుండరాదని భావించి డగ్లసు ప్రసంగము లొనర్చిన ప్రదేశములకెల్ల వెడలి యతఁడు వచించినవానిని ఖండించెను. బానిసవ్యాపారమువలనఁ గలుగునట్టి యనర్థములను వినువారి హృదయములు కరఁగునట్లు నతఁడుపన్యసించెను. అందుచే జనులకు బానిసవ్యాపారము నెడ నొకవిధమగు నుపేక్షాభావము గలిగెను. ఇట్లుండఁ బ్రజలు శాసనసభకు నాబ్రాహాము లింకను నొక ప్రతినిధిగ నెన్నుకొనిరి. కాని, కార్యాంతర వ్యాసంగములచే నతఁడు తనసభ్యత్వమును శీఘ్రకాలముననే వదలుకొనెను.

అమెరికా సంయుక్తరాష్ట్రముల విశ్వవిద్యాలయము సభకొకసభ్యుని నెన్నుకొనవలసిన యవసరము లేర్పడెను కావున లింకను పక్షమునకుఁ జేరినవారిలోనే నిద్దరు రెండుల కభ్యర్థులుగఁ బోటీ చేసిరి. అందు ముఖ్యమైనవారు లింకనును 'టరంబు' ల్లను నతఁడును. ఒకపక్షమునకే చేరిన యిరువురభ్యర్థులొక స్థానమునకే పోటీచేసినచో ''ఓట్లు'' సరిగా రావనియుఁ బ్రతిపక్షుఁడు సులభముగ స్థానమును బొంది నవకాశము లభించుననియు దెలిసినది. కావున నాబ్రాహాములింకను తనపక్షమున భేదముఁ గల్పింపఁ గూడదని భావించి, తనపక్షస్థుఁడగు టరంబుల్లునకే తనపక్షమువారి యోట్లన్నియు లభింపవలయునని తలంచి తనయభ్యర్థిత్వమును మానుకొ

నెను. అతని త్యాగబుద్ధి మెచ్చఁదగినదిగదా! ఆబ్రాహాము లింకను యొక్క ప్రయత్నముచేతను, బలుకుబడి చేతను టరణ్ బుల్లో విశ్వవిద్యాలయ సభకు సభ్యుఁడుగ నెన్నుకొనఁ బడెను.

తరువాత నధ్యక్షపదవికిఁ దనపక్షమువా నొకని నధ్యక్షునిగ నిలుప వలయునని యాబ్రాహాము తీర్మానించెను. అప్పుడతని పక్షమునకుఁ జేరినవా రతని నుపాధ్యక్ష పదవి (Vice President) కొక యభ్యర్థిగ నెన్నుకొనిరి. ఆబ్రాహాము లింకను తనపక్షమున అమెరికాలోని బానిసవ్యాపారమును నిర్మూలించుటకు దీక్షఁబూని పనిచేసెను.

"మిసౌరి" నియమమును దొలఁగించినఁ బ్రజలస్వాతంత్రమే సమూలముగ నాశనమగుననియు, నీ కారణముచే నమెరికాయందలి యుత్తరదేశములకును దక్షిణదేశములకును పోరాట మేర్పడుననియు దీర్ఘదర్శియగు నాబ్రాహాము కనిపెట్టి ప్రకటించెను కాని యతని యభిప్రాయము గ్రహింపక మిసౌరి చట్టమును దొలఁగించిన తత్క్షణమే, యమెరికాలోని యుత్తర దక్షిణదేశముల కభిప్రాయభేదము కలిగి, యది నానాఁట నభివృద్ధి కాఁజొచ్చెను. బానిసవ్యాపారమును స్థిరముగ నిలుప బద్ధకంకణుఁడైన డగ్లసు ఇంకను నట్టిప్రయత్నములలోనే యున్నచోఁ, దనప్రాణమునకే యాపద సంభవించునని యెఱిఁగి తానుదెచ్చిన తీర్మానమునకు విరోధముగఁ దానేఁ 'యోటు' జేసెను. పిదప నతఁ డాబ్రాహాము లింకను యొక్క పక్షమునఁజేరి విశ్వవిద్యాలయ సభాసభ్యత్వమునకుఁ

ప్రయత్నించెను. జనుల కతని గుణములయందును గార్యము లయందును ననిష్టము జనించుటంజేసి యతని ప్రయత్నములు సఫలీకృతములు గాలేదు.

"సూకు' ప్రదేశమునకుఁ జేరినప్రజ లమెరికా విశ్వ విద్యాలయసభ కాబ్రాహాము లింకను దమప్రతినిధిగా నియ మించిరి. అప్పుడతఁడు తనపక్షమువారి నుద్దేశించి యొకయుప న్యాసమొసంగెను. అందతఁ డొకపక్షమునందే భేదము లుండఁ గూడదనియు, నొకపక్షమునకుఁ జేరినవారు తమలోఁ దాము గలసి మెలసి యుండవలయుననియు వచించెను. అసూయతచే నతని పక్షమువారే యతని దూషింప నారంభించిరి. కాని, వాని నాతఁ డేమాత్రము లక్ష్యపెట్టలేదు. తన మనస్సునకు విరుద్ధముకాని విషయములను సంకోచింపక బయలుపఱచు నుత్తమగుణ మతనియందు వెలయుచుండెను అందుచే నతఁ డితరుల దూషణ భూషణములను సరకుచేసినవాఁడు కాఁడు. పిదపఁ గొన్నాళ్లకతని పక్షమువా రతఁడు వచించునదెల్ల సక్రమ మనదని గ్రహింపఁగలిగిరి. తనపక్షమునఁ జేరిన వారు త న్నాదరించి తన నాయకత్వమును గ్రహింపకపోఁగా, దాసవ్యాపారమును స్థిరముగ నిలుప వలయునని ప్రయత్నించుచున్న డగ్లసు మరలఁ జెలరేఁగెను. అప్పు డాబ్రాహాము లింకను అతఁడు ప్రసంగముచేయు గ్రామములకెల్ల నేగి దాని సవ్యాపారము వలని కీడులను స్పష్టముగ నుపన్యసించెను. కావున జనులకు లింకనుచెప్పిన విషయములే నిశ్చయములని బుద్ధికిఁ దట్టినది. ఆబ్రాహాము నెడ జనులకుఁ గల గౌరవమున

కొక చిహ్నముగ నతని నొకప్పుడు వాఁ గతఁడు ప్రసంగము సేయఁగనే తమ మూఁపులపై నతని నెక్కించుకొని స్వల్పాహారశాలకుఁ గొనిపోయి యతని సత్కరించుట మన మిట గమనింపఁదగిన విషయము!

అబ్రాహాము లింకను, డగ్లసు నొకప్పు డెన్నికలలో నొక స్థానమునకే యభ్యర్థులుగఁ బోటిచేసిరి. అబ్రాహాము లింకనున కతని ప్రతిపక్షుఁడగు డగ్లసునకు వచ్చినవాని కన్న నెక్కుడగ నోట్లు వచ్చినను, శాసనసభకుఁ బ్రతినిధులను నెన్నుకొన నర్హతగల మండలములలోనివారు తమ కర్తవ్యమును సరిగా నెఱవేర్చనందున డగ్లసునకే యమెరికా విశ్వవిద్యాలయ సభ్యత్వము లభించినది.

అబ్రాహాము లింకను డగ్లసునకు విరోధముగఁ జేసిన ప్రసంగములలో నొకదానియం దమెరికా స్వతంత్రమును గూర్చి ముచ్చటించెను. అమెరికావాసులు 1776 వ-సంవత్సరము జూలైమాసము 4-వ దినమునఁ దమకును బ్రిటీషు వారికిని నెవ్విధమగు సంబంధ ముండఁబోదని తీర్మానించి యట్టి కార్యముల నెఱవేర్చుచు, నాఁటిమొదలు స్వాతంత్ర్యము నొందినవారైరి. అమెరికావారు స్వాతంత్ర్యముఁ బడయుటకై యొనర్చిన త్యాగము సామాన్యమైనది కాదు. వారడుగులకుఁ బాదరక్షలు సయితము లేక బ్రిటిషుసేనలతోఁ బోరాడిరి. కొన్ని సమయములలో వారాహారాదులు గూడ లేకుండ యుద్ధముచేసిరి. ఇట్టి కష్టముల నన్నిఁటిని వారు స్వాతంత్ర్యము నెట్లయిన గడింపవలయు ననునుద్దే

శమునోడనే సహించిరి. అమెరికావారు స్వాతంత్ర్యమును ప్రధానముగఁ దలంచిరే కాని, యుద్ధమున సౌకర్యములను గమనించినవారు కారు. అట్టి స్వాతంత్ర్యము నడంచునట్టి ప్రతిపక్షుల ప్రయత్నములను వాషింగ్టను సహింపలేక పోయెను. కావున నతఁడు తన ప్రసంగములలో నొకదాని యందు నమెరికావారు సంపాదించిన స్వాతంత్ర్యమును శాశ్వతముగ నెలకొల్పవలసిన యావశ్యకతం గూర్చి యీరీతి నుపన్యసించెను.

"నన్నుఁగన్న మ్యుత్రికకు మరల నన్నుఁ బూడ్చివేయవలయు నన్నను మీరట్లు చేయవచ్చును. మీరు గాక అమెరికా విశ్వవిద్యాలయము సభ్యత్వము లభింపకుండునట్లు ప్రయత్నించినను ప్రయత్నింపవచ్చును. నన్ను హత్యగావించినను గావింపవచ్చును. నాకు బహుపులు పట్టములు ఉద్యోగములు ఏవియు నాసలేదు. "పేరు జయింపవలెను, వారు గెలువవలెను" అను తలంపును వదలిపెట్టుడు. మానవులకును 'ఉద్యమము' స్వాతంత్ర్యము మనకును గలదను విషయమును మాత్ర మమెరికా ప్రజలను మీరు మఱువకుఁడు."

మనము పై వాక్యములవలన వాషింగ్టను కమెరికా స్వాతంత్ర్యము నెడల నెంతటి యభిమానము గలదను విషయమును సులభముగ గ్రహింపఁ గలము.

## ౧౧. రాష్ట్రాధ్యక్ష పదవి

ఆబ్రాహాము లింకను పక్షమువారు డికేడరను ప్రదేశమున 1860 సంవత్సరమున సమావేశమైరి. ఆ సభ కాబ్రాహాము లింకను సభ్యత మరిగియుండెను. ఆ మహా సభయం దాబ్రాహాము లింకను నమెరికా సంయుక్త రాష్ట్రాధిపతి పదవి కొరకు నభ్యర్థిగ నియమించఁ దీర్మానించిరి. మరల నీ పక్షస్థులు 'చికాగో' నగరమున సమావేశమై తమ పక్షమున నమెరికా రాష్ట్రాధ్యక్షపదవి కాబ్రాహామును దక్క మఱియొకరిని నియమింపరాదని తీర్మానించి, యీ విషయ మాబ్రాహామున కెఱుకపఱచిరి. ఆబ్రాహా మధ్యక్షపదవి కభ్యర్థిగ నిలుపఁబడుటకు మిగుల సంతోషించి, యనేకులు తమ సానుభూతిం దెలుపుచు, నతని చే కాలపు పలవారు నభినందించి యమూల్యోపాయనముల నతనికిఁ బంపిరి. వారికిఁ దనయందుఁ గల యనురాగము, కాబ్రాహాము కృతజ్ఞతం దెలుపుచు, (తన ప్రయత్నములకు ముఖ్య బహూకార మొకటియగుట) వారంపిన 'సారాయి సీసాల'ను త్రిప్పి పంపివేసెను. ఇట్టే యొక సంఘమువారు తన్ను సత్కరింపరాఁగా, వారి ప్రేమపూర్వకమగు సానుభూతి కాబ్రాహాము మనేక నమస్కృతు లర్పించుచు వారితో — "భగవంతునిచే నొసంగఁబడిన స్వచ్ఛ జలముం గ్రోలుటయే యాయనకుఁ బ్రీతికరము" అని పలికెను. అతఁడు 'చెప్పున దొకటియుఁ జేయున దొకటియుఁ' గా మెలఁగు

నాయకమ్మన్యుల వంటివాఁడు గాఁడని ప్రజ లాతనియం
దత్యంత గౌరవ ముంచి యుండిరి.

బానిస వ్యాపారము నాదరించు దక్షిణదేశము
లాబ్రాహా మమెరికా యధ్యక్షపదవి కభ్యర్థిగ నిలువఁబడు
టం గాంచి యోర్వక తాము వేఱుపడునట్లు బెదరించెను.
అట్లే కొన్ని దేశము లమెరికా సంయుక్త రాష్ట్రములనుండి
వేఱుపడినవని యే చెప్పవచ్చును.

1860 సంవత్సరాంతమున నాబ్రాహా మమెరికా
కధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడెను. అతనికిఁ బ్రతిపక్షుఁడగు
డగ్లసు ఓటమి నందెను ఆబ్రాహా మెప్పుడును దాను గెలు
తు నను నమ్మకము తోడనే యే యుద్యమమునుగాని యారం
భించెడివాఁడు. అతఁడు క్రైస్తవ వేదమగు బైబిలు నం దమి
త విశ్వాసముఁ గలిగియుండెను బైబిలు జనులను సన్మార్గ
మునకుం ద్రిప్పునదనియు, సత్ప్రవర్తనము గలిగి జీవించుట యే
మానవులకు ముఖ్య ధర్మమనియు, నది లేనివారు మానవ
పద వాచ్యులు గాఁజాలరనియు నతని యభిప్రాయము.

ఆబ్రాహాము లింకను నీగ్రోల విమోచనమునకుఁ గా
లుపడ ముందంజవైచుటం జూచి యనేకు లతనికిఁ బ్రతిపక్షు
లైరి. వారి దురాలోచన మాబ్రాహామునకుఁ దెలియవ
చ్చెను. కాని, యతఁడు తనయుద్యమమునుండి లేశమైనను
జాఱకుండెను. లింకను అధ్యక్షపదవి వహించుటకై వాషిం
గ్టను నగరమునకు వెడలునప్పుడు మార్గమధ్యమున ననేకు ల
తని నెదుర్కొని సత్కరించిరి. అతఁడును నుచితరీతి నటనట

నుపన్యాసము లిచ్చుచు నరిగి వాషింగ్టను నగరముం జేరెను. 1861-వ సంవత్సరము మార్చిమాసము 4-వ దినమున నతఁ డమెరికా సంయుక్తరాష్ట్రాధ్యక్షపదవిం బొందెను.

అతఁడధ్యక్షత వహింపఁగనే, యమెరికా స్వాతంత్ర్యమునకు విముఖులగు ప్రజల నణంప మిగులఁ బ్రయత్నించెను. సేనల నభివృద్ధి నొందించెను. నౌకాసైన్యమునుగూడఁ బెంపొందించెను. నాలుగులక్షల బానిసలను బానిసతనము నుండి విముక్తిఁ గావించెను. ప్రజలకుఁ బ్రభుత్వమునందు విశ్వాసము గలుగుట కనేక కార్యము లొనరించెను. అతనిఁ బలువురు "సీజరుతుల్యుఁ" డని పొగడిరి.

అబ్రాహాము తన మంత్రాలోచనసభకు యోగ్యులగువారిని సభ్యులనుగ నెన్నుకొనెను. వారేకార్యమునుగాని దేశాభిమానపూరితులై యొనర్చుచుండిరి. వారు తమ ప్రతిపక్షులయెడలఁగూడ నెక్కుడు గౌరవముచే చూపుచు వచ్చిరి. జనులయందు దేశభక్తి యుదయింపఁజేసిననేగాని దేశాభివృద్ధికర కార్యములు సలుప వీలుండదని వారు గ్రహించి, యందులకై విశేషముగఁ బాటుపడిరి. వారికి ముందుండిన కార్యనిర్వాహక సభ్యులాబ్రాహాము మధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడునని ముందే యెఱిఁగినవారగుటచే, నతనికిఁ గష్టములు గలిగింప నుద్దేశించి, ప్రభుత్వమునందుఁ బెక్కుచిక్కులు కల్పించి యుండిరి. వారి దుస్తంత్రములకు ఫలితముగ నాబ్రాహాము మధ్యక్షుఁడగునప్పటికిఁ బ్రభుత్వకోశాగారము 'Treasure' న ధనమభావముగ నుండెను.

మఱియు నమెరికా సంయుక్తరాష్ట్రములకు సంబంధించిన దక్షిణభాగముల వసించువారు నీగ్రోల బానిసతనము నుండి విమోచించినందుల కాగ్రహావేశపరవశులై లింకనునకు విరోధముగ యుద్ధమొనర్ప సిద్ధపడిరి. లింకను అందులకు వెనుదీయలేదు. అతని జన్మశత్రువగు డగ్లసట్టి సమయమునఁ బ్రజాభిప్రాయములు గుర్తెఱింగి యబ్రాహాము పక్షమునఁ జేరెను. అబ్రాహాము దేనినిగాని వెంటనే నమ్మువాఁడుగాఁడు. తొందరపడియే కార్యమును జేయఁ బూనుకొనఁడు. తనస్వాంతమునఁ బ్రతివిషయమును జక్కఁగ నాలోచించి, సరియని తోఁచిన యెడలఁ జేయఁ బూనుకొనెడివాఁడు. తన క్రిందఁ బని చేయువారికిఁగూడ నతఁడు సమయోచితముగ సలహాలొసంగుటకుఁ గడు నేర్పుఁ జూపుచుండెను. అతని సలహా ననుసరించి యొనర్పఁబడిన కార్యములు తప్పక ఫలవంతములగుచుండెడివి.

అబ్రాహాము లింకను పరమేశ్వరుని యెడ మిగుల భక్తిఁగలవాఁడు. ప్రజల కతఁడెన్నఁడు నెట్టికీడుఁ గలఁచినవాఁడు గాఁడు. తనజన్మవిరోధిని గూడ నతఁడు దూలనాడి యెఱుఁగఁడు. ఎంతటి పగవాఁడైనను మిత్రునివలెనే యతఁడు భావించి సత్కరించెడువాఁడు. బైబిలులోని బోధనములయం దతని కెక్కుడు విశ్వాసముండెడిది. తన తల్లిచే దనకొసఁగఁబడిన బైబిలు నతఁడు పలుమాఱు పఠించెడువాఁడు. ఆగ్రంథము నతఁడు ధనపేటికవలె భావించెడివాఁడు. దేవునిఁ బ్రార్థించుటలో నెంతయో మేలు కలదని యతని నమ్మకము. కష్టములు సంభవించినప్పుడెల్ల

నతఁడు దైవప్రార్థనముచేతనే మనస్థైర్యముం గాంచుచుండెడి వాఁడు. భానువారము నాతఁడతి పవిత్రవంతమగు దినముగ భావించెడివాఁడు. ఆనాఁడతఁడు క్రీడలు, విహారములు, వినోదములు మొదలగువానిలోఁ బాల్గొనువాఁడు గాఁడు. మత్తు వస్తువుల నుపయోగించువారి నాతఁడు తీవ్రముగ ఖండించువాఁడు.

లింకను గావ్యపఠనమునందును నెక్కు డుత్సాహముం గలవాఁడు. అతఁడు 'షేక్స్పియరు' మహాకవియెడ నెక్కుడు గౌరవభావముం గలవాఁడు. అతఁ డా కవీంద్రు కృతుల నప్పుడప్పుడుఁ జదివెడువాఁడు.

---

## ౧౨. అబ్రాహాము లింకను యుద్ధవీరులు

అమెరికావారు సంపాదించిన స్వాతంత్ర్యమును స్థిరముగ నిలుపుటకు యుద్ధభటుల సహాయ మత్యావశ్యకమని యాబ్రాహాము లింకను గ్రహించెను. కావున, నతఁడు యుద్ధభటుల సంఖ్య నభివృద్ధిపఱుపఁ బ్రయత్నించెను. దక్షిణ రాష్ట్రములలోనివారు బానిసవ్యాపారమునుగూర్చి యాబ్రాహాము వెలువఱచిన ప్రకటనమును ఖండించి పోరాడ సంకల్పించిన కాలమున నతఁ డెనుబదియైదువేల యుద్ధవీరులు గావలెనని చెప్పెను. కొన్నాళ్ళలోపలనే చాలమంది జనులు సేనలోఁ జేరిరి. అమెరికా దేశీయులలోని ప్రతికుటుంబమున నున్న యువకులందఱును రాఁబోవు యుద్ధమునఁ బాల్గొనుట

కై యుద్ధభటులుగాఁ జేరిరి. అమెరికాలోని వీరమాతలు రణ మొనరింప యోగ్యతగల తమ కుమారుల సేనలోఁ జేరఁ బ్రోత్సహించిరి. తమవారు స్వదేశ స్వాతంత్ర్యము కొఱకై పోరాడి మడిసిరను వార్త వినియుఁ గొన్ని కుటుంబ ములవారు కలఁతనొందక తాము వారి ననుసరించిరి. అమె రికాలోని వీరవనితలు తమ వల్లభులఁ బ్రోత్సహించి సంతో షముతో సంగ్రామమున కంపిరి. ఇందుచే నమెరికావారు తమ దేశమెప్పుడును స్వాతంత్ర్యమును బుష్కలముగ ననుభ వించుచుఁ దోడి దేశములతోఁ గలదూఁగుచుఁ గీర్తి నార్జిం పవలయునని వాంఛించుచుండినట్లు తెలియవచ్చుట లేదా? ఒకప్పు డమెరికా శాసనసభా సభ్యులును, యుద్ధవీరులును నొకయెడఁ జేరియుండ, లింకనట కరుదెంచి శాసనసభా సభ్యులందఱి నొకవందనముతో సత్కరించి, యుద్ధవీరులలోఁ బ్రతి యొక్కని కరమును దన కరముతో స్పృశించుచు వంగ నమొనర్చెను. హత్య లొనరించినందులకై కాల్చి చంపఁబడ వలసిన పలువురు యుద్ధభటుల నతఁడు క్షమించెను. సేనా వీరుల విషయమై రాత్రిపండ్రెండు గంటల వేళ యందైన నేరేని వచ్చి తన్ను మేల్కొలిపినచో నతఁడు శ్రమయని భావించక లేచి వారికార్యము నెఱవేర్చువాఁడు. తనకుఁ బ్రతిపక్షులుగ నిలిచి యుద్ధమొనర్చిన వీరు లసువులు వీడినప్పుడుఁగూడ నతఁ డు తన సానుభూతిం దెలిపి వారికుటుంబములకుఁ దనచే నైన సాయముం బొనర్చెడివాఁడు అతఁడొకపర్యాయము. గాయ ములొందిన యైదువేల సైనికులంగాంచి ప్రత్యేకముగ నొక్కొ

క్షుని విచారించి కరస్పర్శ మొనరించి వారికి సంతోషముం గలిగించెను. సేనావీరులకు సంభవించు కష్టసుఖము లన్నిఁటి లోను నతఁడు బాల్గొనుచుండెను. వారికొఱ కతఁడు వైద్య శాలల నెలకొల్పెను. "జనరల్ కార్ఫిల్డు"ను సైనికోద్యోగి యమెరికాంతర్గత రాష్ట్రకలహములలో మెచ్చఁదగిన సేవ చేసినందున, నతని నాబ్రాహాము లింకను మిగులఁ గొని యాడెను. పాస్టన్ నగరమున వసించు నొకవీరమాత తన పుత్త్రపంచకమును రణరంగమునకు బలియిడెను. అప్పు డా బ్రాహాము మామె కొక సానుభూతిలేఖను వ్రాయుచు, నా వీర పురుషుల సాహసాదులను వర్ణించుచుఁ బ్రసంగించెను. యుద్ధ వీరులు లింకనును "నేసునాథు" నపరావతారమని ప్రశం సించెడివారు.

1863–వ సంవత్సరము జనవరిమాసము మొకటి దిన మున నాబ్రాహాము బానిసవ్యాపారమును బూర్తిగ నంత మొందించి నశ్లోక ప్రకటనముం గావించెను.

---

## ౧౩ అవసాన కాలము.

1865–వ సంవత్సరము మరల నాబ్రాహాము లింకను అమెరికా కధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడెను. యుద్ధము సంభ వించినచో నైదులక్షలమంది యుద్ధభటులు గావలసి యుం దురని యతఁడు ప్రకటించెను. దానింగూర్చి వాగ్వాదములు బలముగఁ జెలరేఁగినవి. తుట్టతుద కాబ్రాహాము ప్రకటనమే స్థిరపడెను, అతఁడు "సివిల్ సర్వీసు" సంబంధ విషయములను

జక్కపఱచెను. ఆబ్రాహామున కప్పుడును బ్రతిపక్షులు లేకపో లేదు. అతని ప్రతిపక్షులు సమయము దొరకినప్పుడెల్లఁ బ్రభుత్వ (లింకను) పక్షమును బ్రతిఘటించుచు వచ్చిరి. కావున, నాబ్రాహాము తఱచుగా వారితోఁ బోరాడవలసిన యావశ్యక మేర్పడెను. ఆబ్రాహాము వారి నందఱను సులభముగ నణఁచివేయఁ గలిగెను.

ఆబ్రాహామునకు షేక్స్పియరు నాటకముల యందత్యంతాదరమని మున్నే చెప్పియుంటిమిగదా! తదనుసారముతఁడు దనకుఁ దీరినప్పుడెల్ల షేక్స్పియరు నాటకములను జదువుచుండెను.

ఆబ్రాహాము లింకనునకు విరోధముగఁ బ్రవర్తించిన 'జనరల్ లీ' యనునతఁ డతనితోఁ బోటిగ నిలువఁజాలక, కొన్నాళ్లకుఁ దన దోషమును గుర్తెఱిఁగి యాబ్రాహాము లింకనును క్షమింపఁ బ్రార్థింపఁగా నతఁ డట్లే యొనర్చెను.

ఆబ్రాహాము లింకనుయొక్క మహోద్యమములఁ గాంచిన జను లాతని ననేకవిధములఁ బ్రస్తుతింపఁ దొడంగిరి. అతఁడు జనరల్ వాషింగ్టనునకుఁ దుల్యుఁడని చాలమంది రాజకీయ నాయకు లభిప్రాయపడుచుండిరి. జనరల్ వాషింగ్టను వదలిపోయిన యనేక కార్యముల నాబ్రాహాము లింకను నెఱవేర్చెను.

ఆబ్రాహాము లింకనుయొక్క పగవా రతని హత్య గావించుటకుఁ బ్రయత్నించుచుండిరి. వా రతని కనేక లేఖలను వ్రాసి, యందుఁ దమ యభిప్రాయమును స్పష్టపఱచిరి.

అంపులకై యతని కంగరక్షక వర్గముగఁ గొంతసేన యేర్ప
఩ఱుపఁబడెను. కాని యట్టిది తన కవసరము లేదని యాతఁడు
నిరాకరించెను. అబ్రాహాము లింకను, నతని పక్షమువారు
ను 1865 సంవత్సరము ఏప్రిల్ మాసము 14 దినమున 'సాక్
స్తాను ప్రదేశమునకు వెడలి, యట నారాత్రి 'ఫోర్డు' నాటక
శాలలో నొక నాటకమును జూచుచుండఁగా, 'జాన్ విల్కిన్స్
బూత్' అను గురాత్ముఁడు లింకనును దుపాకితోఁ గాల్చెను.
వెంటనే యతని భిషగ్వరులు నింటికిఁ దీసికొనిపోయి సమస్త చికి
త్సలు చేసిరి, గాని యతఁడు మఱునాఁ డుదయమున నేడుగం
టలకు విగతజీవుఁ డాయెను. విల్కిన్ బూతును, నతని సహా
యులును దండింపఁబడిరి.

అబ్రాహాము లింకను హత్య గావింపఁబడెనను
వార్త దేశమునం దంతటను వ్యాపించి జనులను దుఃఖసాగ
రమున ముంచివైచెను. న్యూయార్కులోని ప్రజలు లింకను
విరోధులనెల్ల వెదకి చంపుటకు బయలుదేఱిరి కాని, జన
రల్ కార్ఫీల్డు వారి యుద్రేకమును శాంతింపఁ జేసెను. అమె
రికా వాసులే కాక తక్కిన దేశములకుఁ జేరినవారును
నాబ్రాహాము హత్య గొనర్పఁబడినందులకు మిగుల సం
తాపించిరి.

అబ్రాహాము లింకను కాల్చి చంపఁబడుట నాగిం
చిన స్త్రీలు లమిత దుఃఖాక్రాంతులయిరి. విక్టోరియా మహా
రాణియుఁ, దక్కిన యనేక రాజ కుటుంబములవారును దమ
యనుతాపము నమెరికా ప్రభుత్వమునకుఁ దెలిపిరి. ఫ్రాంసు,

ఇటలీ, బెల్జియము మున్నగు దేశములలోని వారును దమ విచారమును వెల్లడించిరి.

అబ్రాహాము లింకను హత్యాసందర్భమును గుఱించి వ్రాయుచు నొకఁడు "నాలేఖిని వ్రాయ శక్యముగానంతగాఁ గంపించుచున్న" దని వ్రాసెను. ఇందుచే నాబ్రాహాము లింకనునెడ జనుల కెంతటి పూజ్యభావ ముండినదో మనము గ్రహింపవచ్చును.

పాఠకులారా! కుటీరమున జన్మించి, తన నిరంతర పరిశ్రమముచేతను, నుత్సాహముచేతను, సద్గుణములచేతను నమెరికా సంయుక్త రాష్ట్రాధ్యక్ష పదవిం గాంచిన యాబ్రాహాము లింకను యొక్క చరిత్రము మన కత్యంత మార్గదర్శకము గాదా!

# 3. జేమ్సు అబ్రాహామ్ కార్ఫీల్డు.

౧. బాల్యము

అమెరికాను గనిపెట్టినయతఁడు కొలంబసు. ఆఖండ మును గనిపెట్టినపిదప నింగ్లాండునకుఁ జేరిన యనేకులు మత కలహములు కారణములుగా, నింగ్లాండును వదలి, యమెరికా దక్షిణ సముద్రతీర ప్రదేశములలోఁ గాపురము లేర్పఱచు కొనిరి. అందు "థామస్ కార్ఫ"ల్డను నతఁ డొకఁడు. ఇతఁ డు న్యూయార్కు రాష్ట్రమునకు సంబంధించిన "ఉర్సెస్టర"ను నూర కర్షకవృత్తితో జీవించుచుండెను. ఇతని "కాబ్రాహా" మను కుమారుఁ డొకఁడు 1799-వ సంవత్సరమున జనించెను. ఇతఁడు కాలక్రమమునఁ బెద్దవాఁడై పెండ్లి చేసికొనెను. ఇతి నికి 1831-వ సంవత్సరమున ఫెబ్రవరిమాసము 19-వ దినమున మన కథానాయకుఁడగు "జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డు" ప్రభవించెను, ఇతఁడు తనకు ముప్పదియేండ్లు గడచిన తరు వాత, ననఁగా 1880-వ సంవత్సరమున నమెరికా సంయుక్త రాష్ట్రాధిపత్యమున కెన్నుకొనఁబడెను. ఈతని జనని నామ "మెలీజా".

జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డు తండ్రి, తన ప్రపితా మహుఁడు వసించుచుండిన గ్రామమువిడిచి, న్యూయార్కు"

అను ప్రదేశమునకుఁజేరి, యట నొక కుటీరమును నిర్మించుకొని కాపురముండెను. జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డున కొక సహోదరుఁడును, నొక సహోదరియు నుండిరి. సహోదరుని పేరు "థామసు", సహోదరి పేరు "మెగతపల్లి".

మన కథానాయకుని తండ్రియగు నాబ్రాహాము కార్ఫీల్డు వ్యాధిపీడితుఁడై యుండి మరణించెను. అతఁడు చనిపోవునప్పటికి జేమ్సు పదునెనిమిది మాసముల శిశువుగ నుండెను. తన భర్త విగతజీవుఁ డగుటయు, నెలీజా తన సంతానము సంరక్షించు మార్గముం గానక మిగులఁ జింతించుచుండెను. అట్టియెడ నిరుగుపొరుగువా రామెంజూచి "మీకు గల భూస్థితిలో నొక కొంతభాగమును విక్రయించి ఋణములు దీర్చివైచి, మిగిలినదానిని సాగుబడి చేసికొనుచుఁ గాలక్షేపముసేయుఁ" డనిరి. వారు చెప్పిన మార్గమే మంచిదని యామె తలంచెను. ఆయమ ప్రథమసుతుఁడగు థామసు భూములను గమనించుచు వ్యవసాయముం జేయుచుండెను. ఇట్లుండ, క్షామ మేర్పడునట్లుండెను. అప్పు డెలీజా తన బిడ్డలకు సరిగా తిండి లేకపోవునేమోయని యెంచి, తానుమాత్ర మొకపూట భుజించుచు, తన సంతానమునకు రెండుపూటలును గడపుచువచ్చెను. ఆమె తన బిడ్డలకుఁ జిన్నతనము నుండియే సత్ప్రవర్తనముం గఱపుచుండెను. అందుచే నామె బిడ్డలు తరువాతికాలమున సత్కార్య నిర్వహణమునం బేరుఁ గాంచిరి.

తనతండ్రి గతించునప్పటికి జేమ్సు అబ్రాహాము కార్

ఫీల్డు పదునెనిమిది మాసముల శిశువుగ నుండెనని వక్కాణించియుంటిమి గదా! అతనికి యుక్తవయసు రాఁగానే యతనితల్లి యతని నొకపాఠశాలకు విద్యాభ్యాసము నిమిత్త మంపెను. అతని సహోదరియగు మెగతపల్లతనిఁ దన భుజమున నిడికొని బడికిఁ దీసికొనిపోయెడిది. జేమ్సు కార్ఫీల్డు పసితనమునుండియే యెవిషయమును గూర్చిగాని చక్కఁగాఁ బరిశీలించి తెలిసికొనవలయునను కుతూహలముఁ గలవాఁడుగ నుండెను. అతనికిఁ గ్రైస్తవ వేదమగు బైబిలునం దెక్కుడు విశ్వాసముండెను. అతఁ డపరిమిత జ్ఞాపకశక్తి గలిగియుండెను. అతఁడు పాఠశాలకుఁ బోవుచుండ నొకసమయమున వర్షము తటస్థించెను. అందుచే నతఁడు బడికేఁగక యింటనే నిలువవలసి వచ్చెను. అతని తల్లి తనకుటుంబ సంరక్షణార్థము నాలు వడకు కాలమునఁ దక్కఁ దక్కిన వేళలయందుఁ దన బిడ్డలకు విద్య నేర్పెడిది. సాయంతన సమయములలోఁ జిత్రవిచిత్రములగు కథలుచెప్పి వారిని సంతోషపెట్టెడిది. అట్టి కథలలోఁ జాలవఱకు వారి పూర్వులమెరికాకు వలసవచ్చినప్పుడు వారికిఁ గలిగిన కష్టములకు సంబంధించినవయి యుండెడివి. వాని నాలించిన యాబ్రాహాము కార్ఫీల్డును, నతని సహోదరీ సహోదరులును, తమ పూర్వుల సాహసముం గూర్చియుఁ, త్యాగముంగూర్చియు మెచ్చుకొనుచుఁ దామును వారివలె మెలఁగి కీర్తి నార్జించవలయునని యుత్సాహపడెడివారు. జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డునకుఁ జిన్నప్పటినుండియే గ్రంథపఠనమునం దెక్కుడుగ నభిలాషముండెడిది.

తరువాత జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డు నతని జనని మఱియొక పాఠశాలకుఁ బంపసాగెను. అప్పారాలయోపాధ్యాయుఁడు తన బడిలోని విద్యార్థుల గృహములలో భుజించుచుఁ బాఠశాలను నడపుచుండెను. మన జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డు ఆ పాఠశాలలోఁ జదువుచుండఁగా, నతని బుద్ధి చాతుర్యముం గాంచిన యుపాధ్యాయుఁడు ఒకనాఁడు జేమ్సును జూచి, "జేమ్సూ! నీవు భావికాలమున 'జనరలు' పదవి నందఁగల" వనెను. జేమ్సునకు 'జనర' లను పదమున కర్థము తెలిసినదికాదు. అప్పు డతఁ డూరకుండి యింటికి వచ్చినపిదపఁ, దనతల్లిం గాంచి "అమ్మా! జనరలనఁగా నేమి?" యని యడిగెను. అతని తల్లి కుమారుని ప్రశ్నకుఁ దగు ప్రత్యుత్తర మొసఁగి, యతని పూర్వులలో నొకరు జనరలుపదవి నధిష్టించి యుండిరనియుఁ జెప్పెను. జేమ్సామాట లాలించి యానందమునఁ [illegible]ంగిపోయెను, జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డు "అదియేమి? ఇదియేమి? అదియెట్లు? ఇదియెట్లు" అని యీరీతిఁ దనకు సంశయకారణములగు విషయములంగూర్చి యెవ్వరినేని ప్రశ్నించుచుండువాఁడు. ఉపాధ్యాయుని కిట్టి ప్రశ్నలచేఁ దల కంటగించెడిది. కావున నతఁడు జేమ్సు నిక నెన్నఁడు నట్టి ప్రశ్న లడుగవలదని మందలించెను. జేమ్సు స్వభావమున కుపాధ్యాయుని యాజ్ఞ మిగుల నాటంకముగ నుండినందున, నద్దాని నెఱవేర్ప నాతనికి వీలుగాకపోయెను. కట్టకడ కుపాధ్యాయుఁడు జేమ్సు నిష్టాను సారమే వదలిపెట్టవలసి వచ్చెను. అనంతర ముపాధ్యాయుఁడు

జిజ్ఞాసా లాలసుఁడగు జేమ్సు గుణాతిశయములను జక్కఁగ గ్రహించి యతనిని మునుపటికంటె నెక్కుడుగఁ బ్రేమింప సాగెను. అప్పటినుండియు జేమ్సును నుపాధ్యాయుఁడును నేకాభిప్రాయులై యెంతయు మైత్రితో మెలఁగుచుండిరి. తన సహాధ్యాయులకంటె నెక్కుడు శ్రద్ధతో జేమ్సు తన పాఠములం జదువువాఁడు. పాఠశాలలోని బాలురయం దెవఁడు శ్రద్ధగాఁ దన పాఠముల నేర్చికొనునో, యతనికి రాఁబోవు తరగతికిఁ గావలసిన పుస్తకముల నుచితముగఁ గొని యిచ్చు నట్లుపాధ్యాయుఁడు విద్యార్థుల కెఱుకపఱచెను. జేమ్సుచక్కఁగాఁ జదివి యీ పుస్తక బహుమానము నార్జించెను. ఆ పాఠశాలలోని విద్యార్థు లొకటిగఁ గూడి యొక సంఘముగ నేర్పడి, వ్యాసరచనమును, నుపన్యాస సామర్థ్యమును నలవఱచుకొనుచుండిరి. ఆ సంఘమునను జేమ్సే ప్రథముఁడుగ నెన్నఁబడుచుండెను.

ఈ రీతిగ జేమ్సు ఆబ్రాహాము కార్ఫీల్డు కాలము గడపుచుండ నతని తల్లియు, సహోదరులును, దమ వ్యవసాయ కార్యములలోఁ దోడ్పడవలయునని యతని కాదేశించిరి. అట్లే యతఁడు వారికిఁ దనవలననైన సహాయ మాచరించుచుండెను. వారి కుటుంబపోషణమునకు భూములనుండి వచ్చు నాదాయము సరిపోయెడిది కాదు. కావున వా రేదే నొక చేతిపనికూడఁ జేయవలసిన వారుగ నుండిరి. వారి తల్లి తనకుఁ దీరుపాటు కలిగినప్పుడెల్ల నూలువడకి, యందుచే లభించిన ధనముతోఁ దన కుటుంబమున కవసరములగు కార్య

ములను నెఱవేర్చుచుండెను. జేమ్సు కార్ఫీల్డే కార్యము నేని తాను సాధింపఁగల నను నమ్మకముఁ గలవాఁడు. అతఁ డేపని నిగాని తనవలనఁ గాదనువాఁడు గాఁడు ఇవ్విధమగు సత్య భావమువలననే యతఁడు వెనుకటి కాలమున మహోన్నత దశ నందఁగలిగెను. ఒకనాఁడు బాలురలో నొకవిధమగు పోటీ యేర్పడినది. అక్కారణమున జేమ్సుకార్ఫీల్డొక గ్రుడ్డు నల్లే యమాంతముగ మ్రింగవలసినవాఁ డాయెను. అతఁ డాత్మవిశ్వాసమున నందఱకన్న నధికుఁడగుట, జంకక, గ్రుడ్డును మ్రింగివైచెను. అద్దాని గాంచి, తక్కిన బాలు రెల్ల రాతని మనోదార్ఢ్యమునకును, నమిత సాహసమునకును నాతని నత్యంతము శ్లాఘించిరి. జేమ్సు ఆబ్రాహాము కార్ఫీల్డు నిగర్వ చూడామణి. "ఇష్టమున్న మానవు డొనర్పఁజాలని కార్యమే లే" దనుటయం దెక్కుడు నమ్మకముంచి, యాతఁడు కార్యములు నలుపుచుండెను. మఱియు "భగవంతుని నమ్మి కొల్చినచో నాతఁ డుపేక్షింపఁ" డను వాక్యము నాధారముగఁ జేసికొని యాతఁడు పను లొనర్చుచుండెను.

జేమ్సొకనాఁడు పాఠశాలలో నొక పిల్లవానితోఁ జేరి యాడుకొనుచుండెను. అపు డుపాధ్యాయుఁడు గినుకవహించి బడివిడిచి పొండని వారిరువురకు నాజ్ఞాపించెను. జేమ్సు వెంటనే యా ప్రదేశముం బాసిపోయి, కొంతసేపయిన తరువాత వచ్చెను. మఱియొకపిల్లవాఁ డన్ననో, యట్లుచేయక, పాఠశాలావరణముననే తిరుగుచుండెను.

జేమ్సు తన యాజ్ఞానుసార మొనర్చునందుల కతనిపై నుపాధ్యాయుఁడు మరింతపక్షము వహించెను.

ఆకాలమున, నమెరికాలో నిప్పు డుండునట్లు దేవాలయము లెక్కడను లేవు, క్రైస్తవ మతాచార్యులును నంతగ లేకుండిరి. ఉన్న యే కొలఁదిమందియో, యూరూరఁ దిరుగుచు జనుల కేసునాథుని యుపదేశములను బోధించుచుండిరి. జేమ్సునింట నపుడపుడు మతప్రసంగములు జరుగుచుండు టలవాటు. అట్టి సమయములలోఁ జుట్టుపట్లనుండువారు కూడవచ్చి, యాబోధనము లాలించి భగవంతుని గొలిచెడివారు. జేమ్సు తల్లికిఁ బరమేశ్వరునిపై భక్తి విశ్వాసములు మెండు. కాన, నామె బైబిలు నధిక శ్రద్ధతోఁ జదివెడిది, తన కుమారులు నట్లే నడుచుకొనున ట్లామె చేసెను. జేమ్సునకు బైబిలులోని కొన్ని సందర్భములలో సందేహము లేర్పడినవి. అట్టి సందేహముల నామె తొలఁగింపఁ గలిగినది. కాలక్రమమున జేమ్సునకు బైబి లుత్తమోత్తమ పరమగ్రంథమని మనసునకుఁ దట్టెను. జేమ్సుతల్లి మద్యపానమును ఖండించుచు వచ్చెను. అనేకుల నీదురభ్యాసమునుండి యామె మరలించెను. జేమ్సును దల్లితో నేకీభవించి యీ విషయమునఁ బాటుపడ నారంభించెను. జేమ్సున కతని మాత, యతని పూర్వులనుగూర్చియు, వారు దేశమున కొనర్చిన సేవంగూర్చియుఁ, బ్రతి మానవునకును దేశాభిమాన ముండవలసిన యావశ్యకతంగూర్చియు, మనస్సాక్ష్యమునకు విరోధము గాని కార్యము లొనరించుటలో నిజదేశభక్తుఁడు వెను

కాఁడుఁగూడ దనుటం గూర్చియు, సమస్తోద్యమములలోను ధైర్యమే ప్రధానమనుటంగూర్చియు, నప్పుడప్పు డుపదేశించుచుండెడిది.

---

## థామసు కార్లైలు యొక్క యుద్యోగ ప్రయత్నము

జేమ్సు ఆబ్రాహాము కార్లైలు యొక్క జ్యేష్ఠ సహోదరుఁడగు థామసు కుటుంబపోషణార్థ మెటకేని చని, ద్రవ్యార్జన మొనర్పఁదలఁచి, తన యభిప్రాయముం దల్లి కెఱింగింప నామెయు నందుల కంగీకరించెను, పిదప థామసు "మిచిగా" నను ప్రదేశమునకుఁ బదికొఱ కరిగెను థామసు వెడలఁగనే జేమ్సు ఆబ్రాహాము కార్లైలు తమ భూస్థితులకు సంబంధించిన సర్వ విషయములను, దానే చూచుకొనవలసిన కేర్పడెను. జేమ్సు ఆబ్రాహాము కార్లైలు వ్యవసాయకార్యము నమిత సంతోషముతోఁ జేయువాఁడు. కష్టముల నాతఁ డేమాత్రము గణించినవాఁడు కాఁడు. జేమ్సు కార్లైలునకుఁ గల కార్యశక్తిను గస్తి సమానమునుగాంచి, తోడి కృషీవలు రాతని మెచ్చుకొనుచుండిరి. వ్యవసాయవృత్తిలోఁ బ్రవేశింపఁగనే, యాతఁ డందుఁగల యనేక విషయములను గ్రహింపఁ గలిగెను.

పై జెప్పినరీతి థామసు, మిచిగానుకుఁ జేరి, యొక యుద్యోగమును సంపాదించుకొని, తన తల్లిని సహోదరునిఁ జూచుటకు స్వగ్రామమున కేతెంచెను. అట్టియెడ నాతఁడు, దాఁ దెచ్చిన బంగారు నాణెములఁ దల్లిచేతఁ బెట్టెను. వాని

నాలోకించి జేమ్సు విస్మయ పూరిత చేతస్కుఁడాయెను. అనంతరము థామసును, జేమ్సును, దమ కుటీరమును బాగు చేసికొనుటకుఁ గావలసిన దోర్పాటుల నొనరించిరి. మును పటికన్న, నద్దాని నెక్కుడు విశాలముగను నందముగను వారు నిర్మించిరి. స్వ భవన నిర్మాణానంతరము మరల థామసు తన యుద్యోగముం జూచుకొనుట కేఁగెను. జేమ్సు, నతని తల్లియు మాత్ర మింట నుండిరి.

థామసు వెడలినపిదప, జేమ్సూరకుండక తన సేద్య ప్రుఁబనితోఁగూడఁ, దన యింటి సమీపముననే వసించుచుం డిన యొక వడ్రంగి నాశ్రయించి, తన కేదైన నొకపని యిమ్మని వేఁడెను. అతని వేఁడికోలు నంగీకరించి యా తక్షకుఁ డతనిని ద్రూనిపలకల నుద్దముగఁ దీర్చు నుద్యోగమున నియమించెను. ఆ పనిని జేమ్సు శ్రద్ధతోఁ జేయుచుండెను. ఒక్కొక్కనాఁ డతఁడు నూఱుపలకలను సుద్దము చేయువాఁడు. దీనింగాంచి యాదారుకర్మకారుఁడు జేమ్సునెడ నమిత విశ్వాసముగలవాఁడై, యతఁ డొనర్చినపనికిఁ దగిన భృతి నొసఁగెను. అట్టి భృతింగాంచి యమితానంద మంది యతఁ డద్దానిఁ దన తల్లికిచ్చెను. ఆమె సంతసమున కిఁక మేరయుం డునా? మఱియు నామె, తన పుత్రులు దనయెడఁ జూపు చుండు భయభక్తి విశ్వాసముల కుప్పొంగి, వారెల్లపు డభి వృద్ధిఁ గాంచవలయునని యాశీర్వదించుచుండెడిది. జేమ్సు తనకుఁ దీరుబడియైనప్పుడెల్లఁ దనకడ కరుదెంచి పనిచేయ వచ్చునినియు, నందులకగు వేతనము నొసఁగుటకు దాను సం

సిద్ధుఁడననియు, నా వడ్రంగి వక్కాణించెను. కావున, జేమ్సు తనకు వ్యవధి కలిగినపుడంతయు నతని యింటి కేఁగి, యతఁ డిచ్చుపని నెఱవేర్చుచుండెను.

ఇట్లుండ నా తక్షకునియింట ధాన్యముం జేర్చి యుంచుటకయి కఱ్ఱలతో నొక గరిసెను జేయవలసివచ్చెను. అట్టియెడ నాతఁడు జేమ్సు తోడ్పాటు నపేక్షించెను ఏపనినిగాని జేమ్సు శ్రద్ధతో నొనర్చు స్వభావముం గలవాఁడు, కాన తక్షకునికి సహాయముగ నా కార్యమును నిపుణముగ నిర్వహించెను. ప్రతి పరిశ్రమయందును బుద్ధి నుపయోగించి పనిచేయుచుండి నందున జేమ్సున కే కార్యమును గష్టముగఁ దోఁపకుండెడిది. వడ్రంగమున ననుదినమును జేమ్సు పఁదిసెంట్లకుఁ దక్కువ లేకుండ సంపాదించుచుండెను. అతఁడు కుటుంబ భరణార్థముగ నిట్టి యుద్యోగమును నెఱవేర్చుచుండియుఁ దన విద్యా వ్యాసంగమును మాత్రము మానినవాఁడు గాఁడు. అతఁడు దనకుఁ దీఱినపుడెల్లఁ దనకడనున్న పుస్తకములం జదువుచుండెను, మఱియుఁ బాఠశాలకును బోవుచుండెను. ఒకనాఁ డతఁడు తన యుపాధ్యాయునిచేఁ జేయ నలవి కాని లెక్కను జేసి యతని మన్ననంగాంచెను. అప్పటినుండి తోడి విద్యార్థులకు సయితమాతనియెడ నమిత గౌరవమేర్పడెను. జేమ్సునకు "రాబిన్సను క్రూసో" యను గ్రంథము జదువుటయం దత్యంతప్రీతి. అతని కెంతటి యవసరమగు కార్యముండినను భగవంతునిఁ బ్రార్థింపకుండెడివాఁడు గాఁడు. అతఁ డెవరేని ద్రోహము నొనర్చుచో నెదిరించి శిక్షించుటలో నమిత ధైర్య

సాహసములు జూపుచుండెను. అతఁడు ప్రాణులయం దత్యంత దయయును, బిడ్డలయందు నిశ్చల భక్తియును గలిగి వెలయు చుండెను.

జేమ్సునకుఁ గ్రీడలయందును నధికాభిలాష ముండె డిది. అతఁడు బనిచేయుట కేర్పఱచుకొనిన కాలమునఁ దప్పఁ దక్కిన కాలమునం దొకభాగము నాటలకయి వినియోగించు చుండెను. జేమ్సు అంగసౌష్ఠవము గలిగిన యువకుఁడుగ నుండెను. అతఁ డొకసారి "గ్లెన్‌ల్యాం"డను ప్రదేశమున కేఁగెను, ఆట నాతఁ డొక వాగ్ప్రియు నెదిరించి యోడించెను.

జేమ్సు ఈరీతిఁ గాలముం గడపుచుఁ దన క్షేత్రవ్యవసాయ కార్యములనుగూడ గమనించుచుండెను. ఒకనాఁ డొక పాలివాఁడు జేమ్సుతల్లియొద్ద కరుదెంచి జేమ్సును తనకడఁ బనిసేయుట కనుప్పుమని యడిగెను. జేమ్సు తమ భూమికి సంబంధించిన సేద్యపుఁ బనులను జేయవలసి యున్నందున, నతనిఁ బంపుట కెట్లు వీలుపడునని యామె ప్రత్యుత్తర మొసంగెను కాని యా సంసారి, తన "పెప్పర్మెంటు" [illegible]లాంకురములను గమనింపఁగల సమర్థుఁడు జేమ్సేయని గ్రహించి. యతని ననేకవిధముల బ్రతిమాలి, తనయొద్దఁ బనికి నియమించుకొనెను. జేమ్సు అతనియొద్దఁ బనికిఁ గుదిరి యతఁడు మెచ్చుఁదగినట్లు తన విధుల నిర్వర్తించు చుండెను. ఆపని పూర్తియైనపిదప జేమ్సొక లవణవ్యాపారియొక్క నుద్యోగమునకుఁ గుదిరెను. కాలక్రమమున జేమ్సుపై నతనికి

విశ్వాస మతిశయించెను. ఆ వ్యాపారి యొద్దఁ బనిసేయు వారి లోన నేకులు మోసగాండ్రుగ నుండిరి. వారిచర్యలు జేమ్సునకుఁ బట్టినవి కావు. వారి నందఱను జేమ్సు తన సద్బోధనములచే సన్మార్గమునకుఁ ద్రిప్పఁ బ్రయత్నించెను. జేమ్సు తన యజమానుని యింటనే భోజనాదికములనుగూడఁ జేయు చుండినందునఁ, దనకుఁ దీఱినప్పుడెల్ల నాయింటఁగల యుద్గ్రంథములను బఠించుచు వచ్చెను. ఆ గృహమున సముద్ర యానమునుగూర్చి వ్రాయఁబడిన యనేక పుస్తకము లుండినవి. వాని నన్నిఁటిని జేమ్సు చదివెను. అందుచే నతనికి సముద్ర ప్రయాణము సలుపవలయు నను కుతూహలము జనించెను. ఈ కుతూహలము నానాఁట నభివృద్ధింగాంచెను. జేమ్సు రాత్రి చాల ప్రొద్దుపోవువఱకును బొత్తిములఁ జదువుచుండువాఁడు. ఇట్లతఁ డొకనాఁటిరేయి చాలసేపటివఱకు జదువుచుండ, నతని యజమానుని తనయ, దీపపు వెలుఁగువలన నిద్ర నొందక, జేమ్సు సాధ్యమయినంత శీఘ్రముగ దివ్వె నార్పునని తలంచి యూరకుండెను. కాని, జేమ్సు తాఁ జదువుచున్న పుస్తకమునందలి విషయముపై మనస్సు దగిలినవాఁడగుట, నతనికిఁ బ్రొద్దుపోవుట సయితము దెలిసినది కాదు. అంత నాకన్య జేమ్సునుగూర్చి "కూలిసేయు పనుచువాండ్రకు నిద్రపోవుకాల మింకను సమీపించలేదా?" యని యధిక్షేపించెను. ఆమాట జేమ్సు మానసమున బాణమువలె నాఁటి, యానిశియెల్ల నతని కెంతయు బరితాపముం గూర్చెను. మఱునాఁడు వేఁకువనే జేమ్సు మేల్కని, తన

యజమానుని కడకేఁగి "ఆర్యా! మా యింటికిఁ బోవ నుత్సాహించుచున్నాఁడను. దయచేసి నా కానతి యిండు" అని ప్రార్థించెను. అప్పుడా యజమానుని మనమునకు దిగులు దోఁచి, "ఎందుల"కని ప్రశ్నించెను. జేమ్సేమియుఁ జెప్పక, "గృహమున కేఁగ వలయునని యాతురము గలిగిన" దనెను. తరువాత నా యజమానుఁడు జేమ్సునకుఁ జేరవలసిన వేతనము నిచ్చి, యతనిఁ బోయి రమ్మని చెప్పి పంపెను.

జేమ్సు తన మందిరముం జేరెను. అతఁడొకనాఁడు తన తల్లితోఁ దాను "నౌకయం దొక యుద్యోగమును సంపాదించుకొన నెంచియుంటి" నని చెప్పెను. ఆమె కతని తలంపుపై నానుభూతి లేకుండెను. కాన, నతఁ డా యుద్యమము నుండి విరమించి, తన సహోదరి యున్న యూరు జేరి, యందు బ్రూఁకుల నఱుకుపనిఁ జేయసాగెను. అట్టి సమయమున నతఁ డప్పుడప్పుడు "ఎట్రి" అను నదిలోని నౌకల రాకపోకలను జూచుట తటస్థించెను. కావునఁ, దా నెట్లైని యోడ నడపు పనిలోఁ గుదురుకొనవలయు నను నూహ మరల నతనికి జనించెను. వెంటనే తన యభిమత మక్కకుఁ దెలిపెను. కాని యామెయు జేమ్సు చెప్పినదానిం జెడచెవిం బెట్టెను. జేమ్సిక్కడను దనకుఁ దీఱుబడి యైనప్పుడెల్ల గ్రంథపఠన మొనర్చుచుండెను.

తన యక్కగారి యూరఁ దన కేర్పడియుండిన పని పూర్తియైన తత్క్షణమే జేమ్సు స్వగ్రామముం జేర నరిగెను. అట నొక గృహస్థు కడ నాతఁడు మాసచతుష్టయ మొక

యుద్యోగమున నుండెను. కాని నౌకా సంబంధోద్యోగము నిర్వహింపవలయు నను తలంపును మాత్ర మాతఁ డింకను మానకుండెను. ఒకనాఁడు ప్రస్తావవశమునఁ దన యజమానునికిఁ దన వాంఛిత మెఱింగించెను. కాని, యా యజమానుఁడును నతని కోరిక నెఱవేఱు మార్గమును సూచింపఁ డయ్యెను. తుట్టతుదకు జేమ్సు మరలఁ దన తల్లితోడనే, తన యభీప్సితమును నొక్కి వక్కాణించుటయు, మార్గాంతరము లేమి, నామె యెట్లో యద్దానికి సమ్మతింపవలసి వచ్చెను. అనంతరము జేమ్సు "ఎల్క్" యను నదీతీరమున కరిగి, యట నొక నౌకాధికారిని దర్శించి యుద్యోగమును సంపాదింప నెంచి యుండెను. కావున నతఁడా నదీతీరమున కరిగి నౌకాగమనమును వేచియుండెను. ఇంతలో నొకయోడ వచ్చి యట లంగరు వేసెను. జేమ్సు ఆ నౌకలోఁ బ్రవేశించి యందొకచోట నా నౌకాధికారికై వేచియుండెను. కొంత సేపటికా నౌకాధిపతి యటకుఁ దటాలునవచ్చి, జేమ్సునుగాంచి "ఈక్షణమే నీవీ యోడనుండి దిగిపోయెదవా? లేక నిన్నీ నదిలోఁ ద్రోయుమందువా?" యని గర్జించెను. జేమ్సాతని మాట లాలించి భీతినొంది వెంటనే యోడనుండి దిగి, తన దుస్థితికిఁ బరితపించుచుండెను. అట్లతఁ డుండఁగా, నౌకకు యజమానుఁడగు "కేప్టను లెచ్చు" రను నతఁడు తన్నుఁ బేరు వెట్టి పిలిచిన ట్లతనికి వినఁబడెను. తత్క్షణమే జేమ్సు తిరిగి చూచెను. కెప్టెను లెచ్చరు "సమాచారమే" మని జేమ్సు నడిగెను. జరగిన విషయము లెల్లఁ బూసగ్రుచ్చినట్లు జేమ్సత

నికిఁ జెప్పెను. తరువాత కేప్టనులెచ్చరు, జేమ్సును దన యోడలో నుద్యోగమున కుంచుకొనెను. అక్కాలమున "ఎష్ట్రి" యను నదీతీర ప్రదేశమునకుఁ జేరిన కాలువల మూలముగ వర్తకవ్యాపారములు సాగుచుండెను. కావున, కాప్టనులెచ్చ రా కాలువలలో సరకులను గొంపోవుటకుఁ బెక్కుపడవల నుంచుకొనియుండెను. ఆపడవలను నీటిగుఱ్ఱములు కాలువ కిరుప్రక్కలయందును, బ్రక్కకొకటి పంతున లాగుకొనిపోవును. జేమ్సు ఈ పడవలలో నొకదానిని నడపు నుద్యోగమున నమర్పఁ బడెను. జేమ్సు ఆ యుద్యోగమునఁ జేరిన మొదటిదినమే తానును, నీటిగుఱ్ఱములును గాలువలోఁ బడిపోవునట్టి సందర్భ మొండు తటస్థించెను. ఇందులకుఁ గారణము జేమ్సున కా కాలువలలోఁ బోవుటకుఁ జాలినంత అనుభవము లేకపోవుటయే. తక్కిన పడవలలోఁ బని సేయుచుండినవారు జేమ్సువలె సద్బుద్ధియు, సద్గుణములును గలవారుకారు. వారు సారాయము, పొగాకు మొదలగు మత్తుపదార్థముల నుపయోగించువారుగ నుండిరి. వారు మాటిమాటికి దమలోఁ దాము పోరాడుచుండిరి పడవలను గాలువలో నడపుకొని పోవునపుడు "నేనుముందు, నీవు వెనుక" యని తీవ్రముగఁ దగవులాడుకొనుచుండిరి. వారి జగడములం దీర్చి, వారిలో వారి కైకమత్యముం గుదుర్ప జేమ్సెంతయుఁ బ్రయాసపడెను. వారియందు నెలకొనియుండిన దురభ్యాసముల నన్నింటిని దొలఁగింప నతఁడు మిగులఁ బ్రయత్నించెను. వారు మధుపానమునుండి విరమించునట్లనేకవిధ

ముల వారికి బోధించెను. జేమ్సువందలి యిట్టి సద్గుణ పుంజములం దిలకించి కెప్టను లెచ్చరుగన కతనియెడ నత్యంతానురాగ మేర్పడెను. జేమ్సు పడవ నడపు నుద్యోగమున నుండినపు డతనికిఁ జదువుకొనుటకు గ్రంధములు లభించకుండుటొక గొప్ప లోటుగ నుండెను. కాని యతఁ డెన్నియో విషయములను ననుభవజ్ఞానమువలన నేర్చికొనఁగలిగెను. పడవ నడపు నుద్యోగమున నతఁ డపుడపుడు పట్టుదప్పి పదునాలుగు పర్యాయములు నీటిలోఁబడెను. కట్టకడపటినారి పడినప్పు డతని ప్రాణములకే యాపద సంభవింప నుండెను. అయిన నతఁ డదృష్టవశమున నట్టి యాపదనుండి తప్పించుకొనఁ గలిగెను. అనంతర మతఁడు రోగపీడితుఁ డాయెను. అతఁ డా వ్యాధిచేఁ గ్రమక్రమముగ బలహీనుఁడు గాసాగెను. కావున కెప్టను లెచ్చరునొద్ద సెలవుగైకొని స్వగ్రామమున కరుదెంచెను. కుమారుఁ డిల్లుసేరఁగనే, యాతనితల్లి యెంతయు సంతసించి, యతని క్షేమలాభములం గూర్చి విచారించెను. జేమ్సు తనకు సంభవించిన సంపదాపదలనన్నిఁటి నాద్యంతము దల్లితోఁ జెప్పెను. ఆమెయుఁ గొడుకునకుఁ గలిగిన యిడుములకు దుఃఖమును, మేలులకు మోదమును వెలిబుచ్చెను.

జేమ్సునకు సంభవించిన వ్యాధి పూర్తిగా నివారణము గాక, యతని నింకను వేధింపఁజొచ్చెను. అందుచే నతనితల్లి యొక వైద్యశిరోమణిని బిలిపించెను. అతఁడును జేమ్సు యొక్క రోగస్వభావముం గుర్తించి, తగిన యౌషధము నొసంగి వ్యాధిని బోగొట్టెను. జేమ్సును శరీరారోగ్యముం

గాంచి మునుపటిస్థితికి వచ్చి యథాప్రకార ముద్యోగము నిర్వహింప శక్తిఁగలవాఁ డాయెను.

---

3. జీవితమందలి మార్పు

దేహము స్వస్థతంగాంచిన పదంపడి, జేమ్సు తానే యుద్యోగమున నిఁకఁ గాలముం గడుపుదునా యని యాలోచించు చుండెను. ఉపాధ్యాయ వృత్తిఁ జేకొందునా? లేక మతబోధక కృత్యముం గైకొందునా? యని యాతఁడు తలపోయు చుండెను. తుదకతఁడు మతబోధకోద్యోగమునకుఁ గావలసిన విషయముల నేర్చుకొన మొదలుపెట్టెను. ఇట్లుండ "మిస్టర్ పేట్సు" అను నొక యుపాధ్యాయుఁ డతని యూరికి వచ్చి చేరెను. అతనిని జూచి జేమ్సు "అయ్యా! నాకే యుద్యోగము యుక్తమైనదో సెలవిం" డని యడిగెను. అయినను జేమ్సునకుఁ దాను నొకలో నుద్యోగము నిర్వహింపవలయు నను నుత్సాహ మింకను నుండెను. కాని, జేమ్సు తల్లి తన తంత్రముల చేతను, నుపాయముల చేతను, దన కుమారుని కా యుద్యోగ విషయమున నుండిన యుత్సాహమును దొలఁగించెను. ఇట్లతని తల్లి చేయఁగనే జేమ్సు, మిస్టర్ ఫేట్సు అను నతని యాలోచనము ననుసరించి, తన విద్య నింకను నభివృద్ధి నొందించుకొనఁ దీర్మానించెను. అట్టియెడ "డాక్టరు రాబిన్సను" అను ఘనవంతుఁ డొకఁడు జేమ్సు గ్రామమునకు వచ్చి యుండెను. అతనిం జూచి జేమ్సు తన విద్యా పరిశ్రమం బ్రకటించెను. అతఁడు జేమ్సు యొక్క

పాండిత్యమునకు మెచ్చికొని, యందులకుఁ దగిన ధైర్యము కూడ నున్నచో నెంతయు బాగుగ నుండునని హెచ్చరించెను. జేమ్సునకు ధరించుట కొక జత యుడుపులు మాత్రమే యుండెడివి. ఎక్కువగఁ గొనుట కతని కడ ధనము గూడ లేదు. అతని యొద్దనుండిన ద్రవ్యమంతయుఁ బది షిల్లులు మాత్రమే. అట్టి స్థితిలో నతఁడు పాఠశాలలోఁ జేరి చదువ నారంభించెను.

తరువాత, నతఁడు తనచేత నుండిన పది షిల్లింగులతోడను, గొంత పాత్రసామగ్రితోడను దనతోఁ జదువుకొన వచ్చు కొందఱు చిన్నవాండ్రతోడను "కాక్కా" పాఠశాలకు వెడలెను, అట నతఁడా పాఠశాలాధ్యక్షునిఁ జూచి, యా బడిలో స్థానముం బొంది తానే వంటజేసికొని భుజించుచుఁ జదువుకొనుచుండెను. వ్యాకరణ శాస్త్ర పాఠములు జరగు సమయములయందుఁ పాఠశాలాధ్యక్షునకును జేమ్సునకును గొన్ని విషయములలో నభిప్రాయ భేదములు తటస్థించుచుండెడివి. ఆ ప్రధానాధ్యాపకుఁడు వ్యాకరణ శాస్త్ర విషయములలోఁ గ్రొత్త క్రొత్త సూత్రములను గూడ గల్పించి, యనేకోదాహరణములతోఁ దా నుపదేశించు వానినే విద్యార్థులు నేర్వవలయునని యాజ్ఞాపించెను. ఆ ప్రధానోపదేశకునకును జేమ్సునకును మాటి మాటికిఁ గలుగు నట్టి యభిప్రాయ భేదముల నరసి తక్కిన విద్యార్థులు విస్మయమందు చుండిరి. పాఠశాలలోఁ గడపు కాలమునఁ దప్పఁ దక్కిన సమయములలో జేమ్సు ఒక వడ్రంగి నాశ్రయించి,

యతని దుకాణమునఁ బనిచేసి, తనకుఁ గావలసిన డబ్బు సంపాదించుకొనుచుండెను. జేమ్సు పాఠశాలలోని గ్రంథ భాండాగారము నందలి గ్రంథముల నహరహము పఠించుచు జ్ఞానార్జన మొనర్చుచుండెను. అతఁడు వ్రాయు వ్యాసముల నెల్లరును గొనియాడు చుండిరి. అతఁ డనేక మహా పురుషుల జీవితచరిత్రములను జదివి యెన్నియో యుత్కృష్టాంశములను గ్రహించెను. అతఁడు పాఠశాలకు సంబంధించిన విద్యార్థి సంఘములయందుఁ బలుమఱు నుపన్యాసము లొసంగుచుండెను. అతఁ డొక్కొక్కప్పుడు తన వ్యయములను దగ్గించుకొన వలయునను నుద్దేశముతో నాహారమును వర్జించి, పాలు మాత్రము ద్రావుచుఁ దన జీవితముం గడపెను.

ఇంగ్లండఁ బాఠశాలా విద్యార్థులకు సెలవు లీయఁబడెను. జేమ్సు ఆ సెలవులకుఁ దన స్వగ్రామమున కరుదెంచెను. అతఁడు తనయింటి శిథిలభాగముల నెల్ల బాగుపఱచి, మరల నొక గృహస్థుకడఁ బనిసేయుట కమరెను. రాత్రులయందతఁడు యథాప్రకారము పుస్తక పఠనమును జేయుచుండెను. ఆ సెలవులును ముగిసినవి. జేమ్సు పాఠశాలలోఁ దిరిగి ప్రవేశించెను. అందతఁడు తన చదువు సాగించుచుండు నపుడు తన చేతనుండిన యొకటే కాసును ధర్మ మొనర్చెను. తరువాత నతనియొద్ద నేమియు లేకుండెను. అయిన, నతఁడందులకు విచారపడక, తన స్వల్పధనమైన నుచితమార్గమున వ్యయమయినందుల కెంతయు సంతసించెను. పిమ్మట నతఁడు మరల నక్కడి పడ్రంగినే యాశ్రయించి, తనకుఁ దీఱిన సమ

యములలో నతని కడఁ బనిసేయుచుఁ, గావలసిన ధనమార్జించు కొనుచుఁ, గాలముఁ గడపుచుండెను. ఒక విద్యార్థి గౌరవనీయు నొకని నవమానించి యందులకయి విద్యాశాలాధ్యక్షుఁడతనిఁ బాఠశాలనుండి తొలఁగింపఁ దీర్మానించెను. అతఁడట్లు బడినుండి బహిష్కరింపఁ బడుచోఁ దామును బాఠశాలను వదలిపోయెద మనియు, జేమ్సును దమతోఁ జేరవలయు ననియుఁ దక్కిన పిల్లవాండ్రందఱు వచించిరి. కాని, వాడు చేయు కార్యము సరియైనది కాదనియుఁ, దప్పు చేసినవాఁడు, తన నేరమునకయి పశ్చాత్తాప మంది యుపాధ్యాయుని క్షమింప వేఁడుట యుక్తమనియు జేమ్సు చెప్పెను. నేర మొనర్చిన విద్యార్థి యతఁడు వక్కాణించి నట్లె ప్రధానోపాధ్యాయుని క్షమింపఁ బ్రార్థించెను. జేమ్సు కూడ నా ప్రధాన శిక్షకుని కా విషయమున మన్నించుటయే యతని గౌరవమునకుఁ దగిన కార్యమని స్పష్ట పఱచి, యా బాలుని నతఁడు మన్నించున ట్లొనర్చెను.

మరల సెలవులు వచ్చినవి. జేమ్సు తన యింటికిఁ జేరెను. ఈ పర్యాయ మతఁ డెటనేని ఉపాధ్యాయ పదవిని సంపాదింప మిగులఁ బ్రయత్నములు చేసెను. పాఠశాలా కార్య నిర్వాహకుల నెందఱనో యాశ్రయించెను. కాని, యాతని యభిలాషము నెఱవేఱలేదు. ప్రతి యొక్కఁడును “జేమ్సు చాల చిన్నవాఁడ” నియు, నతఁడు “విద్యార్థులను జక్కటి మార్గమున నడపింపఁజాలఁ” డనియు వచించి యాతనిఁ బంపి వేయుచుండెను. కట్ట కడపట, నతని కొఱకు బడిలో

నుద్యోగము లభించెను. అట నతఁడు బిల్లవాంగ్ర కుపదేశించుటలో నద్వితీయుఁడని పేరుగాంచెను. ఇంతలో సెలవులును ముగిసినవి. జేమ్సింకను జదువుటకై పాఠశాల కేఁగెను. ఈ సారి యతఁడు, తనకుఁ బరిచితుఁడగు తకుకుని యింటనే భుజింప నారంభించెను. మరల సెలవులు తటస్థించఁగనే, యూతఁడొకయూర నొక బడిని నెలకొల్పి దానిని జరుపుచుండెను. ఆ బడిలోని యొక బాలుఁడు తనకు రేఖాగణితము (Geometry) నేర్పుమని జేమ్సు నడిగెను. కాని, జేమ్సున కా గణిత శాస్త్రమునం దేమాత్రమును బ్రవేశము లేదు. కావున నతఁడు రాత్రిపూఁట నా శాస్త్రమును జదివి నేర్చికొని, యుదయమున నా బాలునికి బోధించుచు వచ్చెను.

జేమ్సునకుఁ గళాశాలలోఁ జేరి చదువవలయునని చాల కుతూహలముగ నుండెను. అందులకుఁ దగిన ప్రయత్నము గూడ జేమ్సు మొదలిడెను, అతఁడు విద్యాశాలలోఁ జదువుకొనుచుండినపుడే బానిస వ్యాపారమును మిక్కిలి నిరసించుచుండెను. దానిని ఖండించుచుఁ దమ విద్యార్థి సంఘ పక్షమున నతఁడనేకోపన్యాసము లిచ్చియుండెను. అతని ప్రసంగములను విన్న విద్యార్థులును, నుపాధ్యాయులును నాశ్చర్యపడుచుండిరి. ఇట్లుండ నా పాఠశాలలో విద్య నభ్యసింప "లూక్రిషియా రూడాల్ఫ్" అను నామముగల యొకకన్య వచ్చిచేరెను. జేమ్సును నాకన్యయు ననేక విషయములంగూర్చి చర్చించుకొనుచుఁ దమలో నేర్పడు విద్యా సంబంధ సంశయములను దొలఁగించుకొను వారు. అతఁడు మూఁడు

సంవత్సరముల కాలము "కాక్సా" విద్యామందిరమునఁ జదివిన తరువాతఁ, దన జననితోఁ గూడఁ దమ బంధుగుల పట్టణమునకు వెడలి, యచ్చటనున్న యొక పాఠశాలలో నుపాధ్యాయుఁడుగ నమరి, కళాశాలా ప్రవేశమునకుఁ గావలసిన ద్రవ్యమును సేకరించుకొనుట కొక మార్గముం గాంచెను.

తన బంధుగుల యూరిని వదలి జేమ్సు "ఇరాము" అను ప్రదేశమునందలి "ఎక్లెక్టిక్కు" విద్యాశాలలోఁ జేరి మరలఁ జదువ నారంభించెను. అతఁడటఁ దనకుఁ గావలసిన ధనము, నా పాఠశాలను నూడ్చుటవలనను, గంట కొట్టుట వలనను నార్జించు కొనుచుండెను.

అతఁ డేపనిని గాని సంపూర్ణముగఁ జేయక నడుమన వదలిపెట్టువాఁడు గాఁడు. అంతియగాక తనకుఁ గలుగు విరామ కాలమును వ్యర్థపఱచువాఁడును గాఁడు. అతఁడు తనకుఁ దీఱునప్పుడెల్ల విద్యాశాలలోని పుస్తక భాండాగారమున కేఁగి యనేక పుస్తకములను జదువువాఁడు. వడ్రంమును గూడ నప్పు డప్పు డొనర్చుచుండెను. ఆ బడిలో యుపాధ్యాయు లందఱును జేమ్సుయొక్క గుణాతిశయమునకును, విద్యాభిమానమునకును మిగుల సంతసించి, యత జిన్న తరగతులలోని పిల్లలకుఁ జదువుచెప్ప నియోగించి అతఁడు నీతిమార్గముం దప్పక, కర్తవ్యమును నిర్వహించులో నసమానుఁడని ఖ్యాతి వహించెను. అనంతరము జేమ కళాశాలలోఁ జేరి, యచ్చోటను దను జూచు వారెల్లఁ బ్ర

తిరుచునట్లు ప్రవర్తించెను. తుద కతఁడు 1856 వ సంవత్సరమున సర్వకళా పట్ట భద్రుఁడయ్యెను.

అట్లతఁడు పట్ట పరీక్షలో నుత్తీర్ణుఁడయిన వెంటనే "ఇరాము" అను ప్రదేశమునందలి పాఠశాలకే తిరిగివచ్చి, యందు ప్రాచ్యభాషాధ్యాపకుఁడుగఁ బనిసేయసాగెను. అతఁడటఁ గ్రమక్రమముగఁ బ్రధానోపాధ్యాయ పదవిం బొంది, విద్యార్థుల యొక్కయుఁ, దోడి యుపాధ్యాయుల యొక్కయు మన్ననలకుఁ బాత్రుఁడాయెను. పిదప నతఁడు న్యాయవాది పరీక్షకుఁ జదువ నారంభించెను. కొంతకాల మతఁడు మత బోధకుఁడుగ గూడఁ బనిచేసెను. ఇట్లుండ జేమ్సు 1858 వ-సం॥రమున మనము పైఁబేర్కొన్న "రూడోల్ఫు" అను కన్యను బెండ్లాడెను.

జేమ్సు "టాం బ్రౌన్సు స్కూల్ డేస్" (Tom Browns School Days) అను గ్రంథమును, "లార్డు మెకాలే" వ్రాసిన పుస్తకములను, "మిల్టు" రచించిన కావ్యములను విస్తారముగఁ బఠించెను.

---

## ౮ ఉన్నత పదవి

జేమ్సు ఆబ్రాహాము గార్ఫీల్డు తన యుపదేశములచే జనులను దనవంక కాకర్షించుటలో నసమానుఁడు. అతనికి బైబిలు గ్రంథమునందుఁ గల విశ్వాస మతని వయసుతోఁ బాటు వృద్ధిఁ జెందెను. అతఁడు సదుద్యమములం గొనసాగించుటయం దెప్పుడును వెనుదీసినవాఁడు గాఁడు. అతఁడు

యుద్ధ మతి దారుణముగ జరగు సమయమునఁ గూడఁ దన ప్రాణమును తృణ ప్రాయముగ నెంచి, రణరంగ మధ్యమున విహరించు చుండును. సంయుక్త రాష్ట్రాధ్యక్షుఁడగు లింకను కీర్తి శేషుఁడైన తరువాత, నతఁ డేఁబది వేలమంది ప్రజల శాసించి, వారి యుగ్రహావేశము నణంచి, వారిచేఁ గలుగ నున్న దారుణ విపత్తుల నమూలముట్టుగ నశింపఁ జేసెను.

జేమ్సు అబ్రాహాము కార్ఫీల్డుయొక్క బుద్ధి విశాల తం గుర్తించిన ప్రజ లతని నమెరికా సంయుక్తరాష్ట్ర శాసన సభ కొక సభ్యునిగ నెన్నుకొనిరి. అతఁడును దన్నితరులు మెచ్చు నట్లత్యంతశ్రద్ధతోఁ బ్రజాసేవ నొనర్చెను. "కాక్స మన్రో" యను నొక గౌరవసియుఁ డతని గుణగణములను గూర్చి యెంతయుఁ బ్రశంసించి వ్రాసి యున్నాఁడు.

1861 వ-సం॥రమున నేర్పడిన కలహము నతఁ డతి సులభముగ నడఁచివైచెను. పిమ్మట నతఁడు "కర్నలు" అను నుద్యోగమును బొందెను. ఆయుద్యోగమును వహించి యున్నపుడును నతఁడు తన కర్తవ్యమును మిగులఁ జక్కఁగ నెఱవేర్చు చుండెను. అనంతర మతఁడు "బ్రిగేడియర్ జన రలు" గను, "మేజరు జనరలు" గను నియమింపఁబడెను. కాంగ్రెసునకును నతఁడొక సభ్యుఁడుగఁ బ్రజలచే నెన్నుఁ కొనఁబడెను. తుదకు రాష్ట్ర జనులెల్ల రతని 1880 వ-సం వత్సరమున నమెరికా సంయుక్త రాష్ట్రాధిపతిగ నెన్ను కొనిరి. ఆమ్మహాపదవి నతఁడు 1881 వ-సంవత్సరము మార్చి మాసమందలి నాలుగవ దినమున స్వీకరించెను.

ఇట్లు చిన్న కుటీరమున నుద్భవించి, స్వ ప్రయత్నములచే నభివృద్ధికివచ్చి, కడ కమెరికా సంయుక్త రాష్ట్రాధిపత్యమును గైకొన్న జేమ్సు ఆబ్రాహామ్ పదవియందుఁ జాలకాల ముండఁజాలక పోయెను. అతని ప్రత్యర్థు లతనిపై నసూయతోఁదాల్చి, యతని నెట్లయినఁ గాల్చి చంపఁ గంకణము కట్టికొని యుండిరి. అట్టి శత్రువులలోఁ బ్రముఖుఁడగు "గెయిటో (Guiteau)" యనునతఁడు జేమ్సుఆబ్రాహామును 1881 సం॥రము జూలై మాసమున రెండవనాఁడు కాల్చెను. జేమ్సు సెప్టెంబరు 19 వ-దివసమునఁ బ్రాణములు వీడెను. జను లతని మరణము నాలించి యపారదుఃఖ సాగరమున మగ్నులయిరి. తాను మరణించుటకుఁ గొంత కాలమునకు ముందే జేమ్సు తన జీవితమును "భీమా (Insure)" చేసియుంచెను. అమెరికా ప్రజలు జనరల్ కార్ఫీల్డు సతీమణికి డెబ్బదివేల పవును లుచితముగ సమర్పించిరి. అమెరికా రాష్ట్రాధిపతులలో కార్ఫీల్డిరువది యొకటవ వాఁడు.

సమాప్తము.

కేసరీ ముద్రాక్షరశాల, చెన్నపురి.